సత్యమేవ జయతే

# సాక్షి



‘ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం’

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 12 సంచిక: 257

ఆదివారం 8-12-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


SUNDAY Special



**సీన్ రీకన్‌స్ట్రక్షన్**

‘అత్యాచారం’ నేపథ్యంలో చాలా సినిమాలే వచ్చాయి. వాటిలో కొన్నింటి గురించి చెప్పుకుందాం

- ఫ్యామిలీలో



**విజేత ప్రజ్ఞానంద**

లండన్ క్లాసిక్ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో టైటిల్ నెగ్గిన భారత గ్రాండ్‌మాస్టర్

- స్పోర్ట్స్‌లో

## తక్షణ న్యాయం ఉండదు!

- ప్రతీకారం కాస్తా న్యాయంగా మారకూడదు
- విచారణ జాప్యాలపై సమీక్ష జరగాలి
- స్వీయ దిద్దుబాటుకు తగిన ఏర్పాట్లు ఉండాలి
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎ.బాబ్డే
- మానభంగ కేసుల విచారణకు ప్రత్యేక వ్యవస్థ కావాలన్న కేంద్ర మంత్రి

- వివరాలు 3లో

“ప్రజలందరికీ న్యాయం అందుబాటులో ఉండేందుకు న్యాయవ్యవస్థ కట్టుబడి ఉండాలి. ఇందుకోసం కొత్త మార్గాలను అన్వేషించడంతో పాటు ఉన్నవాటిని దృఢతరం చేసుకోవాల్సిన అవసరమూ ఉంది.

– ఎస్.ఎ.బాబ్డే , సీజేఐ



## ఆమె పోరాటం ముగిసింది!

- ఢిల్లీ ఆస్పత్రిలో ‘ఉన్నావ్’ రేప్ బాధితురాలి తుదిశ్వాస
- దాదాపు 40 గంటలపాటు మృత్యువుతో పోరాటం
- కారకులను వెంటాడి చంపాలి: మృతురాలి తండ్రి
- యూపీ సర్కార్‌పై విపక్షాల కన్నెర్ర
- మృతురాలి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా
- కాలిన గాయాలతోనే మరణం: పోస్టుమార్టం నివేదిక

- వివరాలు 3లో

“మాకు డబ్బు వద్దు. ఎలాంటి సాయమూ అక్కర్లేదు. హైదరాబాద్ ఎన్‌కౌంటర్‌లో మాదిరిగా దోషుల్ని వెంటాడి, కాల్చి చంపాలి. లేదా ఉరైనా తీయాలి.

– మృతురాలి తండ్రి



## 1,000 సిటీ బస్సులు ఔట్?

- నష్టాలు తగ్గించుకునేందుకు ఆర్టీసీ యోచన..
- ఇక హైదరాబాద్‌లో మిగిలేవి 2,700 బస్సులే
- కోటి జనాభాకు అవి సరిపో తాయా అని సందేహాలు
- తగ్గించే బదులు సర్వీసుల హేతుబద్ధీకరణ చేయాలని సూచనలు
- ఓఆర్ఆర్ అవతలకు నడిపితే ఆదాయం పెరిగే అవకాశం

- వివరాలు 14లో

### పాఠకులకు విజ్ఞప్తి

8-12-2019 సంచిక నుంచి ప్రతీ ఆదివారం ‘సాక్షి’ దినపత్రిక వెల రూ. 6.00 నుంచి రూ.7.00కు పెంచడమైనది. కావున పాఠకులు గమనించ మనవి.


NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Vencobb CHICKEN | సూచించిన నేటి గుడ్లు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు

| గుడ్ల రిటైల్ ధర | | | | |
|---|---|---|---|---|
| ₹ 66 డజన్ | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 83 కిలో | బ్రాయిలర్ స్కిన్‌తో | 152 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 105 కిలో | స్కిన్‌లెస్ | 173 కిలో |

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది




దిశపై దారుణం జరిగిన తొండుపల్లి వద్ద శంషాబాద్ డీసీపీ ప్రకాశ్‌రెడ్డిని అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం

# ఎలా జరిగింది?

**‘దిశ’ నిందితుల ఎన్‌కౌంటర్‌పై ఎన్‌హెచ్‌ఆర్సీ విచారణ ప్రారంభం**

- మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో వివరాల సేకరణ
- మృతదేహాలను పరిశీలించి అన్ని అంశాలూ ఆరా
- పోస్టుమార్టం నివేదికపై అనుమానాలను నివృత్తి చేసుకున్న ప్రతినిధులు
- చటాన్‌పల్లి, తొండుపల్లిలో సంఘటనా స్థలాల పరిశీలన
- సోమవారం వరకు రాష్ట్రంలో కమిషన్ ప్రతినిధులు

**సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/షాద్‌నగర్ రూరల్/శంషాబాద్:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ‘దిశ’ అత్యాచారం, హత్య కేసులో నిందితుల ఎన్‌కౌంటర్‌పై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) విచారణ మొదలైంది. కమిషన్ ప్రతినిధులు శనివారం మహబూబ్‌నగర్‌లో విచారణ ప్రారంభించారు. ఢిల్లీ నుంచి వచ్చిన ప్రతినిధులు సోమవారం వరకు రాష్ట్రంలోనే ఉండి ఎన్‌కౌంటర్ జరిగిన తీరుపై సమగ్ర విచారణ జరపనున్నారు. ఇందులో భాగంగా తొలి రోజు.. ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన వారి మృతదేహాలను పరిశీలించారు. పోస్టుమార్టం నివేదికను అధ్యయనం చేశారు. అలాగే రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఎన్‌కౌంటర్ జరిగిన చటాన్‌పల్లి సంఘటనా స్థలాన్ని కూడా పరిశీలించారు. ఆదివారం మృతుల

మిగతా 2వ పేజీలో ▶

# నిధుల కోత తప్పదు

**అన్ని శాఖలకు సమాంతరంగా తగ్గించాలి**

**ఆర్థిక పరిస్థితిపై సమీక్షలో సీఎం కేసీఆర్ ఆదేశం**



రూ.**924** కోట్లు

కేంద్ర పన్నుల వాటాలో రాష్ట్రానికి పడిన కోత మొత్తం

- కేంద్రం లోపభూయిష్ట విధానం వల్లే ఈ పరిస్థితి
- ఆర్థిక పరిస్థితి దిగజారకుండా స్వీయ నియంత్రణ పాటించాలి
- వాటా నిధులు రాకుంటే త్వరలో ప్రధాని వద్దకు..
- కేంద్ర పన్నుల వాటా విడుదల కోరుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ

సాక్షి, హైదరాబాద్

దేశంపై ఆర్థిక మాంద్యం ప్రభావం లేదని పార్లమెంటు లోపల, బయట కేంద్ర ప్రభుత్వం ప్రతిరోజూ గొప్పలు చెబుతున్నా వాస్తవాలు మాత్రం పూర్తి భిన్నంగా ఉన్నాయని సీఎం కె.చంద్రశేఖర్‌రావు విమర్శించారు. రాష్ట్రానికి కేంద్ర పన్నుల వాటా గణనీయంగా తగ్గిన నేపథ్యంలో అన్ని శాఖలకు సమాంతరంగా నిధులు తగ్గించాలని ఆర్థిక శాఖను సీఎం ఆదేశించారు. రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటాపై వాస్తవాలు వెల్లడించాలని కోరుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు శనివారం లేఖ రాశారు. కేంద్ర నిధులు రాని పక్షంలో రాష్ట్రం ఎదుర్కొనే ఇబ్బందులను ప్రధాని దృష్టికి తీసుకెళ్లాలని సీఎం నిర్ణయించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు తదితర అంశాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం ప్రగతి భవన్‌లో సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి ఎస్. నర్సింగ్‌రావు, ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రూ. 924 కోట్ల మేర కోత..**

‘2019–20 ఆర్థిక సంవత్సరానికిగాను తెలంగాణకు పన్నుల వాటా రూపంలో రూ. 19,719 కోట్లు ఇస్తామని బడ్జెట్‌లో కేంద్రం పేర్కొంది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన రూ. 18,560 కోట్లతో పోలిస్తే ఇది 6.2 శాతం ఎక్కువ. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గడిచిన 8 నెలల్లో రాష్ట్రానికి అందిన కేంద్ర పన్నుల వాటా రూ. 10,304 కోట్లు మాత్రమే. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే 8 నెలల కాలానికి రాష్ట్రానికి కేంద్రం నుంచి వచ్చిన పన్నుల వాటా రూ. 10,528 కోట్లతో పోలిస్తే ఈ ఏడాది నికరంగా ఇప్పటి వరకు రూ. 224 కోట్ల మేర రాబడి తగ్గింది. కేంద్ర బడ్జెట్‌లో సూచించిన లెక్కల ప్రకారం వాస్తవానికి 6.2 శాతం అధికంగా రావడం పక్కనపెడితే ఈ ఏడాది 2.13 శాతం తగ్గింది. అంటే గత ఆర్థిక సంవత్సరం కంటే రూ. 700 కోట్లు అధికంగా రావాల్సి ఉండగా రూ. 224 కోట్ల మేర

మిగతా 4వ పేజీలో ▶










# దశ 'దిశ'లా...

'దిశ'అత్యాచార నిందితుల ఎన్‌కౌంటర్ ద్వారా వారి తల్లిదండ్రులకు కాస్త ఉపశమనం వచ్చిందేమో కానీ పూర్తి స్థాయి న్యాయం జరిగిందా? సాహో తెలంగాణ పోలీసు అని జనం జేజేలు పలుకుతున్నారు సరే, భవిష్యత్‌లో అత్యాచారాలకు అడ్డుకట్ట పడుతుందన్న భరోసా ఉందా? అత్యంత క్రూరమైన అత్యాచార కేసులు కూడా ఏళ్లకి ఏళ్లు కోర్టుల్లో నానుతూ ఉంటే బాధితులకు న్యాయం జరిగేదెప్పుడు?. ఇప్పుడు దేశ వ్యాప్తంగా జరుగుతున్న చర్చ ఒక్కటే. రేపిస్టులను బహిరంగంగా ఉరి తీయండి.. సత్వర న్యాయం జరిగేలా చూడండి. కన్నుకి కన్ను, పన్నుకి పన్ను సిద్ధాంతం మన దగ్గర సాధ్యమేనా? ఇదే ఇవాళ్టి సండే స్పెషల్...

## న్యాయం ఆలస్యమైతే అన్యాయమే...



దేశం నలుమూలలా ప్రతిరోజూ మహిళల ఆక్రందనలే వినిపిస్తున్నాయి. సగటున దేశవ్యాప్తంగా రోజుకు 92 అత్యాచార కేసులు నమోదవుతున్నాయి. ఈ కేసుల్ని విచారించడానికి కోర్టుల్లో తగిన సిబ్బంది లేకపోవడంతో పెండింగ్ కేసుల సంఖ్య తడిసి మోపెడవుతోంది. ఇక అత్యాచార కేసుల్లో దోషులుగా తేలేవారి సంఖ్య కూడా అత్యంత స్వల్పంగా ఉంది. చాలా ఏళ్లపాటు 25% నుంచి 30% కేసుల్లో మాత్రమే శిక్షలు పడ్డాయి. కానీ 2014లో మాత్రం శిక్షల రేటు 27 నుంచి 38 శాతానికి పెరిగింది. మహిళలపై అత్యాచారాలు, చిన్నారులపై లైంగిక వేధింపుల కేసుల్లో సత్వర న్యాయానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్ని ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం పదే పదే ప్రకటనలు చేస్తోంది. 2019 నాటికి దేశంలో 664 ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఉంటే, ప్రభుత్వం వాటిని 1,023కి పెంచుతామని చెబుతోంది. కానీ అవి కూడా సరిగా పనిచేస్తున్న దాఖలాలు లేవు. ఉరి శిక్ష పడాలంటే మన దేశంలో సగటున అయిదేళ్లు పడుతోంది. ఎందుకంటే ప్రత్యేక కోర్టులో శిక్ష పడితే, పై కోర్టుకి వెళ్లే అవకాశం ఉంటుంది. అక్కడ నుంచి హైకోర్టు, సుప్రీంకోర్టు... అక్కడ శిక్ష ఖరారు చేసినా అమలవుతుందన్న గ్యారంటీ లేదు. మరణ శిక్ష పడిన దోషులకి రాష్ట్రపతిని క్షమాభిక్ష కోరే హక్కు ఉంటుంది. ఈ ప్రక్రియ అంతా పూర్తయ్యేసరికి కొన్ని కేసుల్లో ఉరిశిక్ష అమలుకే 20 ఏళ్లు దోషులు జైల్లో ఉన్న సందర్భాలున్నాయి. అందుకే సత్వర న్యాయం అన్నది మన దగ్గర సాధ్యపడటం లేదు. 1991 నుంచి 2017, డిసెంబర్ చివరి నాటికి 371 మందికి ఉరిశిక్ష పడింది. కానీ గత 15 ఏళ్లలో నలుగురికి మాత్రమే ఉరిశిక్ష అమలు జరిగిందంటే న్యాయం జరగడంలో ఎంత అన్యాయం జరుగుతుందో అర్థమవుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## క్లుప్తంగా...

### మా బిడ్డకు జీవించే హక్కు లేదా?

- దారుణం జరిగినప్పుడు వీళ్లంతా ఎక్కడున్నారు..
- ఎన్‌హెచ్‌ఆర్సీ తీరును విమర్శించిన దిశ కుటుంబీకులు

**శంషాబాద్:** 'ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకున్నాం.. బాగా చదివించి డాక్టర్‌ను చేశాం.. అలాంటి మా కూతురును పొట్టనబెట్టుకున్నారు. ఆమెకు జీవించే హక్కులేదా? మా కూతురుపై దారుణం జరిగినప్పుడు జాతీయ మానవ హక్కుల కమిషన్ ఏం చేసింది'అని దిశ తండ్రి శ్రీధర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుల ఎన్‌కౌంటర్‌ను వ్యతిరేకిస్తున్న ఎన్‌హెచ్‌ఆర్సీ, మహిళా సంఘాల తీరును ఆయన తప్పుబట్టారు. తమకు అన్యాయం జరిగినప్పుడు వారంతా ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. అత్యంత దారుణంగా తమ బిడ్డను పొట్టన పెట్టుకున్న దుండగులు పోలీసుల నుంచి తప్పించుకుని పారిపోయి ఉంటే మరెన్నో దారుణాలు జరిగేవని చెప్పారు. పోలీసులు తమను తాము రక్షించుకోడానికి కాల్పులు జరిపారని, నిందితుల ఎన్‌కౌంటర్ తమకు ఉపశమనంగా ఉందని ఆయన శనివారం మీడియాతో అన్నారు.

### మహిళలు కోరితే వెపన్స్ ఇస్తారా?: జగ్గారెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** ఆత్మ రక్షణ కోసం మహిళలు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం ఆయుధాలిస్తుందా? ఈ దిశలో రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా ఆలోచన చేస్తుందా? అని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఎమ్మెల్యేలకు కేటాయించిన గన్‌మెన్లను తొలగించి, మహిళా రక్షణకు వారికి గన్‌మెన్లను ఇవ్వాలని లేదా వారికి ఆయుధాలైనా ఇవ్వాలని ఆయన సూచించారు. ఎన్‌కౌంటర్‌లతో హత్యాచారాలకు ఫుల్‌స్టాప్ పడుతుందని ప్రభుత్వం భావించవద్దని, అసలు హత్యాచారాలు నిరోధించడానికి చర్యలు తీసుకుంటేనే ఉత్తమమని ఆయన శనివారం అసెంబ్లీ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. ఎన్‌కౌంటర్ ముఖ్యమంత్రి చేయించారనే విధంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతున్నారని, ఆ చర్యను ప్రోత్సహించే విధంగా ఆయన మాట్లాడటం మంచిది కాదని అభిప్రాయపడ్డారు.

### దిశ నిందితుల కాల్చివేత తీరు సరికాదు: ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో దిశ హత్యాచార నిందితులను పోలీసులు తుదముట్టించిన తీరును భారత జాతీయ మహిళాసమాఖ్య (ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ) తీవ్రంగా ఖండించింది. సీఎంకు తెలిసే ఈ ఘటన జరిగే అవకాశమున్నందున, అందుకు బాధ్యత వహించి ఆయన తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్‌చేసింది. పోలీసులు చట్టాన్ని చేతుల్లో కి తీసుకోవడం సరికాదని, దిశ నిందితులను చట్టపరిధిలోనే కఠినంగా శిక్షించాల్సిన అవసరముందని సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి అనీ రాజా అభిప్రాయపడ్డారు. శనివారం మఖ్దూంభవన్‌లో ఉస్తెల సృజన, పోటు కళావతి, ఛాయాదేవిలతో కలిసి ఆమె విలేకరుల తో మాట్లాడుతూ ఇలాంటి కేసుల్లో కోర్టులు త్వరితంగా శిక్షలు వేసేలాచూడాలే నిందితుల ను హతమార్చడం సరికాదన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక మహిళలపై అత్యాచారాలకు ఊతమిచ్చేలా పరిస్థితులు తలెత్తాయని ఆరోపించారు. రేపిస్టులకు మద్దతుగా బీజేపీ మంత్రులు ర్యాలీలు నిర్వహించిన స్థితి బీజేపీ హయాంలోనే జరిగిందని ఎద్దేవాచేశారు. బీజేపీ ఎమ్మెల్యే సైతంఅత్యాచార కేసులో జైలుకు వెళ్లిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. ఈ నెల 27–30 తేదీల మధ్య జైపూర్‌లో జరగనున్న సమాఖ్య జాతీయ సభల వాల్‌పోస్టర్‌ను ఈ సందర్భంగా అనీ రాజా, తదితరులు విడుదలచేశారు.

### దళిత, బహుజనుల ప్రాణాలకు విలువ లేదు: ఆర్.కృష్ణయ్య



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో దళిత, బహుజనుల మాన, ప్రాణాలకు విలువ లేనట్లు కనిపిస్తోందని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య శనివారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో న్యాయం అగ్రవర్ణాలకు ఒక రకంగా, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మరో రకంగా జరుగుతోందని మండిపడ్డారు. దిశ హత్యపట్ల పోలీసుల స్పందన హర్షించదగిందే అయినప్పటికీ అదే సమయంలో దళిత, బహుజన కులాలకు చెందిన వారిపై జరిగిన దాడి, హత్య పట్ల పోలీసులు స్పందించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర పౌరులందరికీ న్యాయం ఒకే రకంగా ఉండాలని, ఒక్కో కులానికి ఒక రకంగా ఉండేలా ప్రభుత్వం పక్షపాత ధోరణితో వ్యవహరించవద్దని హితవు పలికారు.



చటాన్‌పల్లిలో ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశాన్ని శనివారం పరిశీలిస్తున్న ఎన్‌హెచ్‌ఆర్సీ ప్రతినిధులు

# ఎలా జరిగింది?

▶ మొదటి పేజీ తరువాయి

తల్లిదండ్రులతో సమావేశం కానున్నారు. అయితే వారి తల్లిదండ్రులను హైదరాబాద్‌కు పిలిపించుకుంటారా? లేక మృతుల స్వస్థలమైన నారాయణపేట జిల్లా మక్తల్ మండలం గుడిగండ్ల, జక్లేర్ గ్రామాలకు వెళ్తారా అనే దానిపై శనివారం రాత్రి వరకు స్పష్టత రాలేదు. సోమవారం రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు, ఎన్‌కౌంటర్ చేసిన పోలీసులతో సమావేశమయ్యే అవకాశాలున్నాయని పోలీసువర్గాలు తెలిపాయి. విచారణ ప్రక్రియ పూర్తయిన తర్వాత సోమవారం సాయంత్రం లేదా మంగళవారం ఉదయం తిరిగి ఢిల్లీకి వెళ్లనున్నారు.

### మూడున్నర గంటల పాటు భేటీ

శనివారం మధ్యాహ్నం 1.20 గంటలకు మహబూబ్‌నగర్ వచ్చిన ఎన్‌హెచ్‌ఆర్సీ ప్రతినిధులు స్థానిక పోలీసు అధికారులు, పోస్టుమార్టం నిర్వహించిన గాంధీ ఆస్పత్రి ఫోరెన్సిక్ వైద్య బృందం, స్థానిక జనరల్ ఆస్పత్రి వైద్యులతో సుమారు మూడున్నర గంటల పాటు భేటీ అయ్యారు. 'దిశ'అత్యాచారం, హత్య మొదలు.. ఎన్‌కౌంటర్, శవపరీక్ష వరకు అన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. దిశ హత్య తర్వాత, ఎన్‌కౌంటర్ తర్వాత రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. పోస్టుమార్టం నివేదికను పరిశీలిస్తున్న సమయంలో ఎన్‌హెచ్‌ఆర్సీ ప్రతినిధులకు పలు అనుమానాలు రావడంతో పోస్టుమార్టం చేసిన వైద్యులను పిలిపించాలని కోరారు. దీంతో గాంధీ ఆస్పత్రికి చెందిన ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్‌ఓడీ కృపాల్‌సింగ్, అసోసియేట్ ప్రొఫెసర్ లావణ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ మహేందర్, మరో వైద్యుడు హుటాహుటిన మహబూబ్‌నగర్ వచ్చి, వారి సందేహాలను నివృత్తి చేశారు.

### రెండుసార్లు మృతదేహాలు పరిశీలన..

ఆస్పత్రికి చేరుకున్న వెంటనే నేరుగా మార్చురీకి వెళ్లిన ఎన్‌హెచ్‌ఆర్సీ ప్రతినిధులు.. అక్కడ మృతదేహాలను వారి పేర్లతో సహా వివరాలన్నీ నిర్ధారించుకున్నారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంకిషన్ చాంబర్‌కు వెళ్లి పోస్టుమార్టం నివేదికను క్షుణ్ణంగా చదివారు. ముఖ్యంగా ఎంత దూరం నుంచి కాల్చి ఉండొచ్చు? తూటాలు మృతుల శరీరాల్లో చొచ్చుకుని పోవడంతో ఏ మేరకు రంధ్రం ఏర్పడింది? మృతులు పారిపోతున్నట్టు ధ్రువీకరించే ఆధారాలు ఏవైనా ఉన్నాయా అనే కోణాల్లో ఆరా తీశారు. అనంతరం మరోసారి మార్చురీకి వెళ్లి.. మృతదేహాలను పరిశీలించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అక్కడ నుంచి చటాన్‌పల్లి శివారులో దిశను కాల్చివేసిన స్థలానికి చేరుకున్నారు. నిందితులు దిశను శంషాబాద్ నుంచి అక్కడకు ఎలా తీసుకొచ్చారు..? ఆమె మృతదేహాన్ని ఎక్కడ దహనం చేశారు..? అనే విషయాలను శంషాబాద్ డీసీపీ ప్రకాశ్‌రెడ్డి వారికి వివరించారు. తర్వాత ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతానికి చేరుకుని.. మృతదేహాలు ఎక్కడ పడి ఉన్నాయి.. ఎన్‌కౌంటర్ ఎలా జరిగిందనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. దిశను కాల్చేసిన స్థలానికి ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం ఎంత దూరంలో ఉందనే వివరాలను కూడా సేకరించారు. ఎన్‌కౌంటర్ జరిగిన సమయంలో ఎంతమంది పోలీసులు ఉన్నారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. దాదాపు 20 నిమిషాల పాటు ఆ ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాక, అక్కడి నుంచి నిందితులు దిశపై హత్యాచారం చేసిన తొండుపల్లిలోని టోల్‌ప్లాజా వద్దకు వెళ్లారు. దిశపై అత్యాచారం, హత్య జరిగిన ప్రహరీ లోపలి ప్రదేశాన్ని నిశితంగా గమనించారు. నిందితులు ఆమెపై ఘాతుకానికి ఎలా పాల్పడ్డారో డీసీపీ ప్రకాశ్‌రెడ్డి వారికి వివరించారు.

### నేడు మృతుల తల్లిదండ్రులతో భేటీ...

జాతీయ మానవహక్కుల కమిషన్ ప్రతినిధులు 'దిశ'ఎన్‌కౌంటర్ మృతుల తల్లిదండ్రులతో ఆదివారం సమావేశం కానున్నారు. మృతుల వ్యక్తిత్వం.. అలవాట్ల వివరాలతో పాటు ఎన్‌కౌంటర్‌పై వారి అభిప్రాయాలు సేకరించనున్నారు. నిందితులను పోలీసులు ఎప్పుడు తీసుకెళ్లారు? ఎలా తీసుకెళ్లారు? ఏం చెప్పి తీసుకెళ్లారు? ఎన్‌కౌంటర్ చేస్తున్నట్లు సమాచారం ఇచ్చారా? చేసిన తర్వాత వారి స్పందన ఏమిటి? అనే విషయాలపై ఆరా తీస్తారని ఓ పోలీసు అధికారి అభిప్రాయపడ్డారు.

### రహస్యంగా విచారణ..

ఎన్‌కౌంటర్ నిజానిజాలను నిర్ధారించేందుకు వచ్చిన ఎన్‌హెచ్‌ఆర్సీ ప్రతినిధులు తమ విచారణను రహస్యంగా నిర్వహించారు. ఎన్‌కౌంటర్, పోస్టుమార్టంపై తమ అనుమానాలను నివృత్తి చేసుకునే క్రమంలో వైద్యులు, పోలీసు ఉన్నతాధికారులను తప్ప ఎవరినీ లోపలికి అనుమతించలేదు. మీడియాతో మాట్లాడతారని భావించినా మాట్లాడలేదు. మూడు రోజుల విచారణ పూర్తయిన తర్వాతే వారు మీడియాతో మాట్లాడతారని ఓ పోలీసు అధికారి పేర్కొన్నారు. ఈ క్రమంలో విచారణకు అంతరాయం కలగకుండా పోలీసులు ఆస్పత్రి ముందు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బయటి వ్యక్తులెవరినీ లోపలికి అనుమతించలేదు. రోగులను క్షుణ్ణంగా పరిశీలించి.. నిర్ధారించుకున్న తర్వాతే వదిలిపెట్టారు. మీడియాను సైతం గేటు బయటకు పంపేశారు. మరోవైపు దిశ తల్లిదండ్రులను కమిషన్ ప్రతినిధులు కలుస్తారని భావించినా.. వారు ఆమె ఇంటికి వెళ్లలేదు.

#### మూడురోజుల్లో ఫోరెన్సిక్ నివేదిక

''ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన దిశ నిందితుల పోస్టుమార్టం నివేదికను మరో మూడు రోజుల్లో జిల్లా జడ్జి ద్వారా హైకోర్టుకు సమర్పిస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐదుగురితో కూడిన వైద్య బృందం నిందితుల మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తిచేసింది. ఈ వ్యవహారంలో అన్ని నిబంధనలూ అనుసరించాం. పోస్టుమార్టానికి సంబంధించి ఎన్‌హెచ్‌ఆర్సీ ప్రతినిధులు అడిగిన సందేహాలను నివృత్తి చేశాం''

*– డాక్టర్ కృపాల్‌సింగ్, గాంధీ ఆస్పత్రి ఫోరెన్సిక్ నిపుణుడు*

#### ఘటన తీరును తెలుసుకునేందుకే వచ్చారు

''దిశ హత్యోదంతం, నిందితుల ఎన్‌కౌంటర్ జరిగిన తీరును పరిశీలించేందుకే జాతీయ మానవ హక్కుల సంఘం బృందం వచ్చింది. ఏడుగురు సభ్యులతో కూడిన బృందం మధ్యాహ్నం మహబూబ్‌నగర్ వెళ్లి తిరుగు ప్రయాణంలో చటాన్‌పల్లి వద్ద దిశను కాల్చిన స్థలాన్ని, ఎన్‌కౌంటర్ స్థలిని పరిశీలించింది. విచారణ కమిటీలో ఓ ఫోరెన్సిక్ నిపుణుడితోపాటు దర్యాప్తు అధికారి కూడా ఉన్నారు. విచారణ ముగిశాక పూర్తి వివరాలు వెల్లడిస్తాం''

*– ప్రకాశ్‌రెడ్డి, శంషాబాద్ డీసీపీ*




### బుల్లెట్ల కోసం పోలీసుల గాలింపు

**షాద్‌నగర్ రూరల్:** దిశ హత్య కేసులో నిందితులను ఎన్‌కౌంటర్ చేసిన ప్రదేశంలో పోలీసులు ఉపయోగించిన బుల్లెట్ల కోసం ప్రత్యేక బృందాలు శనివారం ఉదయం గాలించాయి. చటాన్‌పల్లి బ్రిడ్జి సమీపంలోని ఘటనా స్థలంలో మెటల్ డిటెక్టర్‌ల సాయంతో ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు వెతికారు. పోలీసుల ఎదురుకాల్పుల్లో నలుగురు నిందితులకు మొత్తం 12 బుల్లెట్ గాయాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అయితే పోలీసులు వారిపై మొత్తం 15 రౌండ్ల కాల్పులు జరిపినట్లు విశ్వసనీయ సమాచారం. ఘటనా స్థలంలో పడిన బుల్లెట్లను స్వాధీనం చేసుకునేందుకు వాటి కోసం చుట్టుపక్కల ప్రాంతాన్ని జల్లెడపట్టారు. ఎన్ని బుల్లెట్లు లభించాయనే వివరాలు మాత్రం పోలీసులు వెల్లడించలేదు.

## ఇలాంటి రాక్షసుల కోసమా.. పహారా కాసింది?

- దిశ తండ్రి, మాజీ సైనికుడు శ్రీధర్‌రెడ్డి ఆవేదన
- దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టి పనిచేశా
- కానీ నా కూతుర్ని 'మృగాలు' చిదిమేశాయి
- నా గుండె బరువు ఎన్నటికీ దిగదు
- కీచకులకు సత్వర శిక్షలు పడేలా చట్టాలు సవరించాలి

**సాక్షి, హైదరాబాద్:** దేశం నీకు ఏమిచ్చిందన్నది కాదు.. దేశానికి నువ్వు ఏమిచ్చావు అన్నది ముఖ్యం అంటారు పెద్దలు. సైన్యంలో పనిచేసి దేశానికి సేవలందించే వీర జవానుకు ఏమిచ్చి రుణం తీర్చుకోగలం? ఒకవేళ దేశ సేవలో అసువులుబాసితే అతని త్యాగానికి సెల్యూట్ చేస్తాం. అమరుడంటూ కీర్తిస్తాం. దిశ తండ్రి కూడా ఓ వీరసైనికుడే. కానీ ఆయనకు నలుగురు కీచకులు మిగిల్చిందేమిటి? తన గారాలపట్టి, అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతుర్ని అన్యాయంగా చిదిమేశారు. పైశాచికత్వంగా తెగబడి ప్రాణాలు తీసి కాల్చేశారు.

**నా గుండె బరువు ఎన్నటికీ దిగదు...**

దిశ నిందితుల ఎన్‌కౌంటర్ తరువాత 'సాక్షి' ఆమె తండ్రి శ్రీధర్‌రెడ్డిని పరామర్శించింది. నలుగురు నిందితులు ఎన్‌కౌంటర్‌లో మరణించడాన్ని ఆయన స్వాగతించారు. పోలీసుల పనితీరును అభినందిస్తున్నానని, వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ''నేను దేశంపై ప్రేమతో 1981లో సైన్యంలో చేరా. అహ్మద్‌నగర్‌లో శిక్షణ తర్వాత అంబాలాలో పోస్టింగ్ ఇచ్చారు. తరువాత పంజాబ్‌లోని కపుర్తలాలో పోస్టింగ్. అదే సమయంలో 'ఆపరేషన్ బ్లూస్టార్'కూడా జరిగింది. అప్పుడు పంజాబ్‌లో చాలా ఉద్రిక్త పరిస్థితులు ఉన్నాయి. ఆపరేషన్ మొదలైందని మాకు సందేశం అందింది. పలు రెజిమెంట్ల నుంచి వెళ్లాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశించారు. సిద్ధంగా ఉండాలని, రిజర్వు ఫోర్సుగా తరువాత వెళ్లాల్సింది మా యూనిట్ సభ్యులేనని ఆదేశాలు వచ్చాయి. నాతోటి వారితో సహా సిద్ధంగా ఉన్నాం. మేము ఆ ఆపరేషన్‌లో నేరుగా పాల్గొనలేదు కానీ రిజర్వు ఫోర్సు కింద పని చేశాం. సైన్యంలో ఆరేళ్లపాటు సేవలందించా. ఏ సైనికుడూ ప్రాణాల కోసం ఎప్పుడూ బాధపడడు. నేను కూడా ఎప్పుడూ భయపడలేదు. గుండెనిండా ధైర్యం కలవాడిని. కానీ నేడు నా గుండె కూడా బరువెక్కింది. ఎన్ని చేసినా ఆ గుండె బరువు దిగదు''అని అన్నారు.

**కీచకులకు త్వరగా శిక్షలు పడాలి..**

''మాలాంటి సైనికులు సరిహద్దులో కఠిన వాతావరణ పరిస్థితుల్లోనూ విధులు నిర్వహిస్తారు. దేశం కోసం, దేశ ప్రజల కోసం ప్రాణాలను పణంగా పెడతారు. మేం అందరి కోసం పాటుపడతాం. మాకు కుల, మత, ప్రాంతీయ భేదాలు ఉండవు. కానీ మాలాంటి సైనికుల గుండెలు కూడా బరువెక్కేలా చేస్తున్న ఇలాంటి పిశాచాలు దేశంలో స్వేచ్ఛగా తిరుగుతుండటం బాధాకరం. ఇలాంటి వారి కోసమా మేము ప్రాణాలు పణంగా పెట్టి పని చేసింది? అన్న ఆలోచన మమ్మల్ని మరింత బాధకు గురిచేస్తోంది. అందుకే ఇలాంటి రాక్షసులకు త్వరగా శిక్షలు పడేలా ప్రస్తుతమున్న చట్టాలను సవరించాలి. కొత్త చట్టాలు తీసుకురావాలి. నిర్భయ కేసులో ఏడేళ్లు గడిచినా నేటికీ దోషులకు శిక్ష పడలేదు. యూపీలోని ఉన్నావ్‌లో అత్యాచార బాధితురాలిని నిందితులు బెయిల్‌పై వచ్చి మరీ చంపడం అత్యంత హేయం. అందుకే ఆడవారిపై అఘాయిత్యాలకు పాల్పడే వారిని చట్టపరంగా, శీఘ్రంగా శిక్షించేలా చట్టాలను బలోపేతం చేయాలి''అని దిశ తండ్రి ప్రభుత్వాలను కోరారు.

## అన్నింటికీ ఆన్సర్లున్నాయ్!

**ఎన్‌కౌంటర్‌పై పక్కా ఆధారాలతో సైబరాబాద్ పోలీసుల నివేదిక రెడీ**

**సాక్షి, సిటీబ్యూరో:** దిశ మిస్సింగ్, ఆపై హత్యాచారంలో కేసు నమోదు నుంచి నిందితుల ఎన్‌కౌంటర్ వరకు అంతా చట్టపరిధిలోనే జరిగిందని చెబుతున్న సైబరాబాద్ పోలీసులు.. అందుకు తగిన ఆధారాలు సిద్ధం చేశారు. గత నెల 27న దిశా ఘటన జరిగినప్పటి నుంచి ఈనెల 6వ తేదీ తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్ తర్వాత కూడా వస్తున్న విమర్శలన్నింటికీ పక్కా సాక్ష్యాలతో రూపొందించిన నివేదికను ఇటు న్యాయస్థానాలకు, అటు హక్కుల కమిషన్‌కు పంపించేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్‌కౌంటర్‌పై కొందరు సానుకూలంగా, మరికొందరు వ్యాఖ్యలు చేయడంతో పోలీసులు ప్రతి అంశాన్ని పక్కాగా నివేదికలో పొందుపరిచినట్టు సమాచారం. ఈ కేసు విచారణలో సీసీ కెమెరాల పుటేజీలు, సాక్షుల వాంగ్మూలాలు, పరిస్థితులను బట్టి నిర్ధారించే సర్కమ్‌స్టాన్సియల్ ఎవిడెన్స్‌లతో పాటు లారీలో సేకరించి ఫోరెన్సికల్ ల్యాబ్‌కు పంపిన రక్తపు మరకలు, వెంట్రుకలే కీలక ఆధారాలుగా ఉన్నాయి. కిడ్నాప్, అత్యాచారం, హత్య.. ఇవి జరుగుతున్నప్పుడు చూసిన ప్రత్యక్ష సాక్షులు లేకపోవడం, హతురాలి శరీరం కాలిపోవడంతో స్వాబ్స్ వంటివి సేకరించే పరిస్థితి లేదు. కాగా, ఎన్‌కౌంటర్ మరణాలకు తప్పనిసరిగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న ఆదేశాల ప్రకారం ఇప్పటికే షాద్‌నగర్ ఠాణాలో చటాన్‌పల్లి వద్ద జరిగిన నలుగురి ఎన్‌కౌంటర్‌పై కేసు నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌తోపాటు కేసు డైరీ, ఎంట్రీలు, పంచనామాల తదితర సమాచారాన్ని కోర్టుకు సమర్పించనున్నారు. ఈ కేసు విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను ఎక్కడా అతిక్రమించలేదని, నిందితులు ఎదురుతిరగడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఎన్‌కౌంటర్ చేయాల్సి వచ్చిందని సైబరాబాద్ పోలీసులు స్పష్టంచేస్తున్నారు.

## మెడికల్ కాలేజీకి మృతదేహాల తరలింపు

**సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్:** 'దిశ'కేసులో ఎన్‌కౌంటర్‌లో మరణించిన నలుగురు నిందితుల మృతదేహాలను గుట్టుచప్పుడు కాకుండా పోలీసుల పహారా మధ్య శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రి నుంచి మెడికల్ కాలేజీకి తరలించారు. పోలీసులు, అధికారుల రాకపోకల కారణంగా జిల్లా ఆస్పత్రిలో రోగులకు ఇబ్బందులు కలగడంతో పాటు భద్రతా చర్యల్లో భాగంగా రాత్రికి రాత్రే మృతదేహాలను మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎదిర శివారులో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలకు తరలించారు. సోమవారం వరకు మృతదేహాలను అక్కడే భద్రపరచనున్నారని సమాచారం.

### డిప్యూటీ స్పీకర్ ఇంట్లో దొంగతనానికి యత్నం

**రాంగోపాల్‌పేట్:** డిప్యూటీ స్పీకర్ ఇంట్లో దొంగతనం చేసేందుకు వచ్చిన యువకులను ఆయన కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. మోండా టకారా బస్తీలో డిప్యూటీ స్పీకర్ పద్మారావు తన కుమారులతో కలసి ఉంటున్నారు. శనివారం తెల్లవారుజామున 3.15 గంటలకు స్పీకర్ ఇంటి వెనక వైపు అలికిడి రావడంతో ఆయన కుటుంబీకులు లేచి భవనం పైకి వెళ్లి చూడగా.. ఇంటి వెనక 3వ అంతస్తు వద్ద ఓ యువకుడు గ్రిల్స్ పట్టుకుని వేలాడుతూ కనిపించాడు. పద్మారావు కుటుంబ సభ్యులు అతడ్ని పట్టుకుని ప్రశ్నించగా దొంగతనం చేసేందుకు వచ్చానని అంగీకరించాడు. రాజస్తాన్‌కు చెందిన సురేష్, గంగావిషన్, అభీబ్, సురేష్‌చౌదరి, ఖాన్ సింగ్ అనే 5 మంది యువకులు పద్మారావు ఇంటి వెనకే ఓ గదిలో ఉంటున్నారు. వీరే దొంగతనానాకి పథకం పన్నినట్లు తెలియడంతో స్పీకర్ కుటుంబీకులు వారికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పద్మారావు కుమారుడు పరమేశ్వర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు మిగతా నలుగురిని కూడా అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.



# ఆమె పోరాటం ముగిసింది!



స్త్రీలపై అరాచకాలను నిరసిస్తూ శనివారం ఢిల్లీలో ర్యాలీలో ఓ మహిళ ఆక్రందన

## ఢిల్లీ ఆస్పత్రిలో 'ఉన్నావ్' రేప్ బాధితురాలి తుదిశ్వాస

- కారకులను వెంటాడి చంపాలి: మృతురాలి తండ్రి
- యూపీ సర్కార్‌పై విపక్షాల కన్నెర్ర
- మృతురాలి కుటుంబానికి రూ.25 లక్షల సాయం ప్రకటించిన ప్రభుత్వం
- కాలిన గాయాలతోనే చనిపోయిందని పోస్టుమార్టం నివేదిక వెల్లడి





మృతురాలి ఇంటివద్ద జనం. బాధితురాలి బంధువులను పరామర్శించి వస్తున్న ప్రియాంక గాంధీ.



మృతదేహాన్ని అంబులెన్స్‌లో స్వగ్రామానికి తరలిస్తున్న దృశ్యం

**న్యూఢిల్లీ/లక్నో/ఉన్నావ్:** నేరస్తుల బెదిరింపులు.. స్పందించని ప్రభుత్వం.. చలించని పోలీసులు..ఇలా అడ్డంకులెన్ని ఎదురైనా వెరవకుండా న్యాయం కోసం ముందుకు సాగిన ఉన్నావ్ అత్యాచార బాధితురాలి(23) జీవన పోరాటం ముగిసింది. దాదాపు 40 గంటల పాటు మృత్యువుతో పోరాడి, ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచింది. తనపై జరిగిన అత్యాచారం కేసులో కోర్టు విచారణకు హాజరయ్యేందుకు వెళ్తున్న బాధితురాలిపై గురువారం ఉదయం నిందితులు పెట్రోల్ పోసి, నిప్పంటించిన విషయం తెలిసిందే. 90 శాతం కాలిన గాయాలతో ఢిల్లీలో చికిత్స పొందుతున్న ఆమె శుక్రవారం అర్ధరాత్రి కన్నుమూసింది. కుటుంబసభ్యులు శనివారం రాత్రి స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకొచ్చారు. ఆమె మృతిపై విపక్షాలు భగ్గుమన్నాయి. యూపీలోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమైందని, బాధితురాలికి న్యాయం చేయలేకపోయిందని విమర్శించాయి. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో ఈ కేసు విచారణ చేపట్టి, త్వరలోనే బాధితులకు శిక్షలు పడేలా చూస్తామన్నారు. మృతురాలి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారంతోపాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తామని యూపీ ప్రభుత్వం ప్రకటించింది.

**వెంటాడి చంపాలి: మృతురాలి తండ్రి**

తన కుమార్తె మరణానికి కారణమైన వారిని వెంటాడి, చంపాలని మృతురాలి తండ్రి ఆవేశంతో అన్నారు. 'మాకు డబ్బొ వద్దు. ఎలాంటి సాయమొద్దు. హైదరాబాద్ ఎన్‌కౌంటర్ మాదిరి దోషుల్ని కాల్చి చంపాలి లేదా ఉరి తీయాలి'అని అన్నారు. తన సోదరి మరణానికి కారణమైన దోషులకు జీవించే హక్కు లేదని బాధితురాలి సోదరుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'దోషులంతా చస్తేనే నా సోదరికి న్యాయం జరిగినట్లవుతుంది. ఆ కిరాతకులందరినీ యమపురికి పంపాలి'అని అన్నారు.

**అత్యాచారాల రాజధానిగా భారత్: రాహుల్**

దేశంలో పెరుగుతున్న అత్యాచార కేసులను చూస్తుంటే ప్రపంచ 'అత్యాచారాలకు రాజధాని'గా భారతదేశం మారిపోతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితిని చూసి అంతర్జాతీయ సమాజం భారత్‌ను ఎగతాళి చేస్తోందన్నారు. ఉత్తరప్రదేశ్ బీజేపీ ఎమ్మెల్యే కుల్‌దీప్ సింగ్ అత్యాచారం కేసులో నిందితుడిగా ఉన్నా.. మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

**యూపీ ప్రభుత్వం విఫలం: ప్రియాంకా గాంధీ**

ఉన్నావ్ రేప్ బాధితురాలికి న్యాయం అందించడంలో ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ ఆరోపించారు. ప్రియాంక శనివారం బాధితురాలి స్వగ్రామానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆమెకు న్యాయం దక్కకపోవడానికి ప్రతి ఒక్కరిదీ బాధ్యతేనన్నారు.

**సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి: మాయావతి**

మహిళలపై పెరుగుతున్న నేరాలను సుమోటోగా పరిగణించి, వీటికి అడ్డుకట్టపడేలా కేంద్రానికి తగు సూచనలివ్వాలని బీఎస్పీ అధినేత్రి మాయావతి సుప్రీంకోర్టును కోరారు. మాయావతి శనివారం యూపీ గవర్నర్ ఆనందీ బెన్ పటేల్‌ను కలిశారు. రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్ననేరాలు ఆందోళన కలిగిస్తున్నాయని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

**యోగి ప్రభుత్వాన్ని తొలగించాలి: అఖిలేశ్**

'ఉన్నావ్'బాధితురాలికి రక్షణ కల్పించడంలో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం విఫలమైందంటూ సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ అసెంబ్లీ ఎదుట బైఠాయించారు. ఇది చీకటి దినమనీ, రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి ఎలాంటి సాయం అందించారు? మీరు ప్రభుత్వాన్ని నడిపే తీరు ఇదేనా? అని నిలదీశారు.

### పోస్టుమార్టం నివేదిక ఏం చెప్పింది?

ఉన్నావ్ రేప్ బాధితురాలి మృతదేహానికి సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి వైద్యులు శనివారం పోస్టుమార్టం జరిపారు. 'తీవ్రంగా కాలిన గాయాల కారణంగా బాధితురాలు చనిపోయింది. విష ప్రయోగం, మారణాయుధాలు, ఊపిరాడకపోవడం వంటి కారణాలతో చనిపోయినట్లు ఆధారాలు కనిపించలేదు'అని వైద్యుడొకరు చెప్పారు. 'శుక్రవారం సాయంత్రం నుంచి ఆమె పరిస్థితి క్రమంగా క్షీణించింది. రాత్రి 11 గంటలపుడు అకస్మాత్తుగా గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. గుండెను తిరిగి పని చేయించడానికి తీవ్రంగా శ్రమించినా ఫలితం దక్కలేదు. 11.40 గంటలకు ఆమె తుదిశ్వాస విడిచింది'అని ఆస్పత్రి వైద్యుడు శలబ్ కుమార్ ప్రకటించారు.

## అపరకాళిగా మారి హతమార్చింది

**లైంగిక వేధింపులపై ఓ ఇల్లాలి ప్రతిఘటన**



మణికంఠన్

**సాక్షి ప్రతినిధి, చెన్నై:** వరుసకు సోదరుడైన వ్యక్తి లైంగిక వేధింపులకు ఆమె తట్టుకోలేకపోయింది. అపరకాళిగా మారి అంతమొందించింది. తేనీ జిల్లా ఉత్తమపాళయంకు చెందిన అరటి ఆకుల వ్యాపారి మణికంఠన్ (38)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మణికంఠన్ బావమరిది పాండీశ్వరన్ (30) భార్య నిరంజన (25)లకు ఇద్దరు పిల్లలున్నారు. మణికంఠన్, పాండీశ్వరన్ కొన్నేళ్ల క్రితం టీ బంకు నడిపారు. ఈ సమయంలో నిరంజనపై కన్నేసిన మణికంఠన్ తరచూ సెల్‌ఫోన్‌లో ఇబ్బందికరమైన సంభాషణ చేసేవాడు. అనేకసార్లు హెచ్చరించినా పద్ధతి మార్చుకోకపోవడంతో భర్తకు ఫిర్యాదు చేసింది. ఈ వివాదం కారణంగా టీ బంకును ఎత్తివేసి ఇరువురూ వేర్వేరు వ్యాపారాల్లో స్థిరపడ్డారు. అయినా బుద్ధి మార్చుకోని మణికంఠన్ నిరంజనకు సెల్‌ఫోన్ ద్వారా అసభ్య సంభాషణలు కొనసాగించాడు. దీంతో విసిగిపోయిన నిరంజన శనివారం ఉదయం భర్తతో కలిసి మణికంఠన్ దుకాణానికి వెళ్లి నిలదీసింది. ఈ సమయంలో ఘర్షణ వాతావరణం చోటుచేసుకోగా నిరంజన తన వెంట తెచ్చుకున్న కొడవలితో మణికంఠన్‌ను హతమార్చింది. రక్తం మడుగులో ఉన్న మణికంఠన్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు విడిచాడు. భార్యాభర్తలిద్దరూ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోగా వారిని అరెస్ట్ చేశారు.

## క్లుప్తంగా...

### ఎంపీల విదేశీ పర్యటనలపై చట్టం తేవాలి

**న్యూఢిల్లీ:** ఎంపీలు విదేశీ పర్యటనలు చేసినప్పుడు దానికి సంబంధించిన వివరాలతో పాటు ఖర్చుల వివరాలు తప్పనిసరిగా వెల్లడించేలా చట్టాన్ని తీసుకురావాలని బీజేపీ ఎంపీ కోరారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ రహస్య విదేశీ పర్యటనల నేపథ్యంలో ఆ పార్టీ లక్ష్యంగా ఎంపీ జీవీఎల్ నరసింహారావు ప్రజా ప్రాతినిధ్య (సవరణ) బిల్లుకు సంబంధించిన ఓ ప్రైవేట్ మెంబర్స్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. 'విదేశీ ప్రభుత్వాలు, సంస్థల నుంచి స్వీకరించిన ఏ రకమైన ఆతిథ్యం అయినా సరే దాని వివరాలు రాజ్యసభ చైర్మన్‌కు గానీ, లోక్‌సభ స్పీకర్‌కు గానీ వెల్లడించాలి'అని బిల్లు తెలిపింది. కాగా, ఎంపీలు విదేశీ పర్యటనల వివరాలు తెలపాలని 2017లోనే మార్గదర్శకాలు జారీ అయ్యాయని, 2019 జూలైలోనూ పార్లమెంటరీ వ్యవహారాల శాఖ దీన్ని పునరుద్ఘాటించిందని జీవీఎల్ పేర్కొన్నారు.

### బీజేపీ అధినాయకత్వంపై ఏక్‌నాథ్ ఖడ్సే కినుక



**జల్‌గావ్:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల ఓటమికి కారకులైన వారిపై చర్యలు తీసుకోకుంటే ప్రత్యామ్నాయం చూసుకుంటానంటూ బీజేపీ సీనియర్ నేత ఏక్‌నాథ్ ఖడ్సే అధినాయకత్వానికి పరోక్ష హెచ్చరికలు పంపారు. 'అక్టోబర్‌లో జరిగిన ఎన్నికల్లో నా కుమార్తెతో పాటు మరికొందరు బీజేపీ అభ్యర్థుల ఓటమికి కారణాలపై ఆధారాలు చూపాను. సంబంధీకులపై చర్యలు తీసుకోవాలని కోరాను'అని తెలిపారు. 'పార్టీని వీడి వెళ్లాలనుకోవడం లేదు. పార్టీలో ఇవే రీతిగా అవమానాలు కొనసాగుతుంటే మరో మార్గం ఆలోచిస్తా'అని తెలిపారు.

### ట్రేడింగ్‌లో అవకతవకలు.. ఐటీ దాడులు

**న్యూఢిల్లీ:** ట్రేడింగ్‌లో అవకతవకలకు పాల్పడ్డారంటూ ఆదాయపు పన్ను శాఖ పలువురు షేర్ బ్రోకర్స్, ట్రేడర్స్‌పై దాడులు జరిపింది. దేశ వ్యాప్తంగా ముంబై, కోల్‌కతా, హైదరాబాద్, ఢిల్లీ సహా 39 చోట్ల సోదాలు చేపట్టినట్లు ఐటీ శాఖ శనివారం తెలిపింది. రివర్సల్ ట్రేడ్స్ ద్వారా కృత్రిమంగా లాభం/నష్టం వచ్చేలా చేశారని వీరిపై ఆరోపణలున్నాయి. దీని ద్వారా వీరు రూ. 3500 కోట్ల వరకూ లాభాలు/నష్టాలు వచ్చేలా చేశారని ఐటీ శాఖ తెలిపింది.

### ఉగ్ర సయీద్‌కు ఊరట



**లాహోర్:** ముంబై ఉగ్ర పేలుళ్ల ప్రధాన సూత్రదారి, నిషేధిత ఉగ్రవాద సంస్థ జేయూడీ (జమాత్–ఉద్–దవా) చీఫ్ హఫీజ్ సయీద్‌కు లాహోర్‌లోని యాంటీ టెర్రరిజమ్ కోర్టులో (ఏటీసీ) ఆశ్చర్యకర రీతిలో స్వల్ప ఊరట లభించింది. ఉగ్ర నిరోధక కేసులో హఫీజ్‌తో పాటు మరో నిందితుడిగా ఉన్న మాలిక్ జాఫర్ ఇక్బాల్‌ను అధికారులు విచారణకు హాజరుపర్చకపోవడం పట్ల కోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఇక్బాల్‌ను కోర్టులో ప్రవేశపెట్టని కారణంగా హఫీజ్‌పై ఎలాంటి అభియోగాలు నమోదు చేయకుండానే విచారణను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. తదుపరి విచారణలో భాగంగా ఈ నెల 11న అతడిపై అభియోగాలు నమోదు చేస్తామని శనివారం తెలిపింది. 11న ఇక్బాల్‌ను కోర్టు ఎదుట హాజరుపర్చాలని అధికారులను ఆదేశించింది.

# తక్షణ న్యాయం ఉండదు!

- ప్రతీకారం కాస్తా న్యాయంగా మారకూడదు
- విచారణ జాప్యాలపై సమీక్ష జరగాలి
- స్వీయ దిద్దుబాటుకు తగిన ఏర్పాట్లు ఉండాలి
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బాబ్డే వ్యాఖ్యలు



రాజస్తాన్ హైకోర్టు భవనం ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి కోవింద్, సీజేఐ జస్టిస్ బాబ్డే

**జోధ్‌పూర్:** న్యాయమన్నది ఎప్పుడూ తక్షణం అందేదిగా ఉండరాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎ.బాబ్డే స్పష్టం చేశారు. న్యాయం ఎప్పుడూ ప్రతీకారంగా మారకూడదని, అలా మారినప్పుడు న్యాయానికి ఉన్న లక్షణాలేవీ మిగలవని ఆయన తెలిపారు. రాజస్తాన్ హైకోర్టులో శనివారం ఒక కొత్త భవనాన్ని ఆవిష్కరించిన సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ చేసిన ఈ వ్యాఖ్యలు దిశ హత్య కేసు నిందితులు ఎన్‌కౌంటర్‌లో మరణించిన నేపథ్యంలో ప్రాధాన్యమేర్పడింది. ఇటీవలి పరిణామాలు చాలా పురాతనమైన చర్చను సరికొత్త ఉత్సాహంతో మొదలుపెట్టాయన్న జస్టిస్ బాబ్డే న్యాయవ్యవస్థ కేసుల విచారణలో జరుగుతున్న జాప్యం విషయంలో తన వైఖరిని మార్చుకోవాల్సిన అవసరముందని స్పష్టం చేశారు.

ప్రజలందరికీ న్యాయం అందుబాటులో ఉండేందుకు న్యాయవ్యవస్థ కట్టుబడి ఉండాలని, ఇందుకోసం కొత్త మార్గాలను అన్వేషించడంతోపాటు ఉన్నవాటిని దృఢతరం చేసుకోవాల్సిన అవసరమూ ఉందని ప్రధాన న్యాయమూర్తి వివరించారు. వివాదాలను వేగంగా సంతృప్తికరంగా పరిష్కరించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అదే సమయంలో న్యాయవ్యవస్థ పట్ల మారుతున్న దృక్పథంపై కూడా అవగాహన ఉండాలని అన్నారు. న్యాయవ్యవస్థలో జరిగిన తప్పిదాలను స్వయంగా దిద్దుకునే ఏర్పాటు అవసరముందని, అయితే ఈ ఏర్పాట్లను ప్రచారం చేయాలా? వద్దా? అన్నది చర్చనీయాంశమని అన్నారు. గత ఏడాది సుప్రీంకోర్టు న్యాయమూర్తులు నలుగురు బహిరంగంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి.. చేసిన వ్యాఖ్యలు, జరిగిన తప్పిదాలను స్వయంగా సరిచేసుకునేందుకు జరిగిన ఒక ప్రయత్నమేనని అన్నారు. 'లిటిగేషన్లను వేగంగా పరిష్కరించే పద్ధతులను ఏర్పాటు చేయడమే కాదు. లిటిగేషన్లను ముందస్తుగా నివారించాల్సి ఉంది'అని చెప్పారు. కేసు దాఖలయ్యే ముందే మధ్యవర్తిత్వం ద్వారా సమస్య పరిష్కారానికి ఇప్పటికే కొన్ని చట్టాలున్నాయని, వాటిని అన్ని కేసులకూ తప్పనిసరి చేసే విషయాన్ని ఆలోచించాలని చెప్పారు.

అంతకుముందు కార్యక్రమంలో కేంద్ర న్యాయశాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ మాట్లాడుతూ మానభంగ కేసుల విచారణ సత్వరం జరిగేలా ప్రధాన న్యాయమూర్తి, ఇతర సీనియర్ న్యాయమూర్తులు ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇందుకు తగిన నిధులు అందిస్తుందని హామీ ఇచ్చారు. విచారణ జాప్యం దేశంలోని మహిళలను తీవ్రమైన బాధకు, ఒత్తిడికి గురిచేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో హేయమైన నేరాల విచారణకు 704 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఉన్నాయని, పోక్సో, మానభంగ నేరాల విచారణకు మరో 1,123 ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మంత్రి వివరించారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్ తరువాత మానభంగ కేసుల నిందితులకు సత్వర శిక్ష పడేలా చూడాలన్న డిమాండ్లు పెరుగుతున్న విషయం తెలిసిందే. ఎన్‌కౌంటర్‌లో దిశ నిందితులు మరణించడంపై కొన్ని వర్గాల వారు సంతోషం వ్యక్తం చేయడం, సంబరాలు చేసుకోవడం కొందరి ఆందోళనకు కారణమవుతోంది.

### పేదలకు అందని స్థాయిలో న్యాయ ప్రక్రియ: రాష్ట్రపతి

దేశంలో న్యాయ ప్రక్రియ పేదలకు అందని స్థాయిలో ఉందని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆందోళన వ్యక్తం చేశారు. జోధ్‌పూర్‌లో శనివారం హైకోర్టు కొత్త భవనం ఆవిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రపతి మాట్లాడుతూ ''న్యాయ ప్రక్రియ బాగా ఖరీదైపోయింది. పలు కారణాల వల్ల సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోయింది. మరీ ముఖ్యంగా హైకోర్టు, సుప్రీంకోర్టులు సాధారణ కక్షిదారులకు అందడం అసాధ్యంగా మారింది''అని వ్యాఖ్యానించారు. ''ఈ రోజుల్లో పేదవారెవరైనా ఇక్కడకు ఫిర్యాదు తీసుకుని రాగలరా? ఈ ప్రశ్న చాలా ముఖ్యమైంది. ఎందుకంటే రాజ్యాంగం పీఠికలో అందరికీ న్యాయం అందించడం బాధ్యతని మనమందరం అంగీకరించాం కాబట్టి' అని అన్నారు. న్యాయం కోసం పెడుతున్న ఖర్చుపై గాంధీజీ ఆందోళన వ్యక్తం చేశారని, దరిద్ర నారాయణుల సేవే ఆయనకు అన్నింటికంటే ముఖ్యమైన అంశమని అన్నారు. గాంధీజీ ప్రాథమ్యాలను గుర్తు చేసుకుంటే, కటిక పేదవాడు, అతి బలహీనుడి ముఖాలను మనం మననం చేసుకుంటే ఈ అంశాల్లో మనకు తగిన మార్గం కనిపిస్తుందని అన్న రాష్ట్రపతి న్యాయ ప్రక్రియను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ఉచిత న్యాయసేవలు ఒక మార్గం కావచ్చునని సూచించారు.

## ఆ రేప్ కేసులో తండ్రీకొడుకులు నిర్దోషులు

**ఢిల్లీ కోర్టు తీర్పు**

**న్యూఢిల్లీ:** రాజధాని ఢిల్లీలో నాలుగేళ్ల క్రితం జరిగిన ఒక అత్యాచారం కేసులో ఓ తండ్రి, కొడుకులను నిర్దోషులుగా ప్రకటించిన సంఘటన ఆసక్తిని రేకెత్తిస్తోంది. బాధితురాలు నిందితుల కూతురు, సోదరి కావడం గమనార్హం. వివరాలు.. ఇలా ఉన్నాయి. సుమారు 10 మంది కుటుంబ సభ్యులతో ఒకే గది ఉన్న ఇంట్లో బాధితురాలు నివాసం ఉంటోంది. ఇందులోనే ఓ చిన్న కిరాణా కొట్టు కూడా నడుపుతున్నారు. 2015 ప్రాంతంలో తనకు 17 ఏళ్ల వయసు ఉన్నప్పుడు తన తండ్రి, సోదరుడు కొన్ని నెలలపాటు అత్యాచారం చేశారని, విషయం ఇతరులకు చెబితే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ అంశంపై పోలీసులు ఎఫ్ఐఆర్ ఆలస్యంగా దాఖలు చేయడం ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం. ఈ కేసులో విచారణ చేపట్టిన ఢిల్లీ అదనపు సెషన్స్ కోర్టు మూడు కారణాలను చూపి ఫిర్యాదు చేసిన యువతి తండ్రి, సోదరుడిని నిర్దోషులుగా విడిచిపెట్టింది. ఎఫ్ఐఆర్ ఆలస్యంగా దాఖలు కావడం ఒక కారణమైతే, కుటుంబ సభ్యుల సమక్షంలో అత్యాచారం జరగడం అసంభవమని కోర్టు అంచనాకు రెండో కారణం. విచారణ సమయంలో బాధితురాలు వేర్వేరు తేదీలు, నెలల పేర్లు చెప్పిందని, పైగా ఇతర కుటుంబ సభ్యులెవరూ బాధితురాలి పక్షాన విచారణలో పాల్గొనకపోవడాన్ని బట్టి కూడా ఆ యువతి చెప్పేది నిజం కాకపోవచ్చునని కోర్టు భావించింది. ఆ యువతి అప్పుడప్పుడూ కిరాణా కొట్లో వ్యాపారం చేసేదని, తనను బయట ఎక్కడకూ పంపేవారు కాదన్న బాధితురాలి వాంగ్మూలానికి ఇది భిన్నమని కోర్టు చెప్పింది. కొనుగోళ్ల కోసం వచ్చిన వాళ్ల (ఎక్కువగా ఇరుగు పొరుగు కావచ్చు)కు చెప్పుకున్నా ఎవరో ఒకరు సాయపడి ఉండేవారని కోర్టు పేర్కొంది.

## జార్ఖండ్‌లో 63.36% పోలింగ్

**రెండో దశలో 20 స్థానాల్లో..**



సిరా గుర్తుతో సీఎం రఘుబర్ దాస్

**రాంచీ:** ఉద్రిక్తత నడుమ జార్ఖండ్‌లో రెండో దశ పోలింగ్ ముగిసింది. 63.36 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. సిసాయ్ నియోజకవర్గంలోని 36వ పోలింగ్ బూత్ వద్ద పోలీసుల నుంచి ఆయుధాలు లాక్కోవడానికి ప్రయత్నించిన వ్యక్తుల మీద భద్రతా సిబ్బంది కాల్పులు జరపడంతో ఓ వ్యక్తి మరణించగా, మరి కొందరు గాయపడ్డారని ఏడీజీపీ మురారి లాల్ మీనా చెప్పారు. ఈ ఘటనపై విచారణ జరపుతున్నామని జార్ఖండ్ ఎన్నికల అధికారి వినయ్ కుమార్ చౌబే తెలిపారు. పోలీసుల కాల్పుల అనంతరం కోపోద్రిక్తులైన ప్రజలు రాళ్లు విసరడంతో ఓ పోలీసుకు గాయాలయ్యాయి. రెండో దశలో మొత్తం 20 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరగనుండగా, అందులో 18 స్థానాల్లో మధ్యాహ్నం 3 వరకూ మరో రెండు స్థానాల్లో సాయంత్రం 5 వరకు పోలింగ్ జరిగింది. దాదాపు ఏడు జిల్లాల వ్యాప్తంగా 42 వేల మంది భద్రతా సిబ్బందిని నియమించినట్లు చెప్పారు.



శనివారం శ్రీనగర్‌లో జరిగిన పాసింగ్ ఔట్ పరేడ్‌లో తుపాకులు గాల్లోకి ఎగరేసి ఆనందం వ్యక్తం చేస్తున్న కొత్త సైనికులు

## బెంగాల్ గవర్నర్‌కు ఎదురైన నల్ల జెండాలు



**లిలువా:** పశ్చిమబెంగాల్ గవర్నర్ జగదీప్ ధన్‌కర్‌కు ఊహించని ఘటన ఎదురైంది. శనివారం ఓ కాలేజీ కార్యక్రమానికి హాజరవడానికి లిలువాకు వచ్చిన ఆయనకు పలువురు వ్యక్తులు నల్ల జెండాలను చూపించారు. వాటిపై 'షేమ్ షేమ్ గవర్నర్' అని రాసి ఉంది. ఈ నిరసనను తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలే చేశారంటూ ప్రచారం ఊపందుకుంది. పెండింగ్ బిల్లులకు ఆమోదం ఇవ్వకపోవడంతో ఈ వారంలో రెండు రోజులు అసెంబ్లీ వాయిదా పడిందంటూ నిరసనకారులు నినాదాలు చేశారు. టీఎంసీ హౌరా అధ్యక్షుడు అనూప్ రాయ్ మాట్లాడుతూ జెండాలు చూపిన ఘటన గురించి తమకు అసలు తెలియదన్నారు. అయినా స్థానికులు చేసే చర్యలను తామెలా ఆపగలమని ప్రశ్నించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారని హౌరా కలెక్టర్ ముక్త ఆర్య చెప్పారు.





## 'హెచ్–1బీ'కి ఇక ఇ–రిజిస్ట్రేషన్

**వచ్చే ఏప్రిల్ 1 నుంచి దరఖాస్తుల స్వీకరణ**

**వాషింగ్టన్:** భారత్ టెక్కీల డాలర్ కలలను నెరవేర్చే, అమెరికాలో విదేశీయులు ఉద్యోగాలు చేయడానికి వీలు కల్పించే హెచ్–1బీ వీసా దరఖాస్తు విధానాన్ని మార్చినట్లు అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) తెలిపింది. 2021ఏడాది హెచ్1బీ దరఖాస్తులను ఇకపై ఎలక్ట్రానిక్ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. కంపెనీలు తాము తీసుకోబోయే ఉద్యోగుల వివరాలను సమగ్రంగా అందజేయాలని కోరింది. రిజిస్ట్రేషన్ కోసం 10 డాలర్లను ఫీజుగా చెల్లించాలి. ఏటా 85 వేల హెచ్–1బీ వీసాలను ఈ వీసా దరఖాస్తులు పూర్తయ్యాక లాటరీ పద్ధతిలో ఎంపిక చేసిన 85 వేల వీసాలు మంజూరు చేస్తారు. 'ఎలక్ట్రానిక్ ప్రక్రియ వల్ల పేపర్ వర్క్ తగ్గుతుంది. ఐటీ కంపెనీల, ఉద్యోగుల సమాచారం ఇవ్వడం సులభతరం అవుతుంది'అని ఇమిగ్రేషన్ అధికారులు వెల్లడించారు. 2020–21 సంవత్సరానికి వచ్చే ఏడాది మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తుల రిజిస్ట్రేషన్, ఏప్రిల్ 1 నుంచి దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు.



ఫ్లాగ్‌డే సందర్భంగా మోదీ కోటుకు జెండాను పిన్ చేస్తున్న చిన్నారి

## సాయుధ బలగాల సంక్షేమానికి తోడ్పడండి

**ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు • డీజీపీల జాతీయ సదస్సుకు హాజరు**

**పుణే:** సాయుధ బలగాల సంక్షేమానికి ప్రజలు తోడ్పడాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. శనివారం పుణేలోని రాజ్‌భవన్‌లో జరిగిన ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. అక్కడే ఆయన 2016లో నగ్రోటా ఉగ్రదాడిలో నేలకొరిగిన మేజర్ కునాల్ గోసావి భార్య, కుమార్తెలతో మాట్లాడారు. అనంతరం ఫ్లాగ్ డే కార్యక్రమానికి సంబంధించిన 57 నిమిషాల వీడియోను ప్రధాని ట్విట్టర్‌లో విడుదల చేశారు. 'ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే సందర్భంగా అత్యుత్తమ ధైర్య సాహసాలు చూపుతున్న సాయుధ బలగాలకు, వారి కుటుంబాలకు నా సెల్యూట్. మన బలగాల సంక్షేమానికి మీరు కూడా సాయం అందించాల్సిందిగా కోరుతున్నా' అని పేర్కొన్నారు. అనంతరం పోలీస్ డైరెక్టర్ జనరళ్లు, ఇన్‌స్పెక్టర్ జనరళ్ల జాతీయ సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చిలో జరిగిన ఈ సదస్సుకు హోం మంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా హాజరయ్యారు. శుక్రవారం ప్రారంభమైన ఈ సదస్సు ఆదివారంతో ముగియనుంది.

## టీచర్‌పై సామూహిక అత్యాచారం

- మధ్యప్రదేశ్‌లో దారుణం

**సిధి/దమోహ్/మోవ్:** మధ్యప్రదేశ్‌లో ఓ పాఠశాల ఉపాధ్యాయురాలిపై సామూహిక అత్యాచారం జరగగా, మరో చోట వేధింపులు తాళలేక ఓ టీనేజర్ ఆత్మహత్య చేసుకుంది. రెండు ఘటనలు గురువారం జరగ్గా ఆలస్యంగా వెలుగులోకొచ్చాయి. సిధిలో సాయంత్రం స్కూల్ ముగించుకొని తిరిగి వస్తున్న టీచర్‌పై నలుగురు స్థానికులు దగ్గర్లోని ఓ ఫాంహౌజ్‌కు ఎత్తుకెళ్లి గ్యాంగ్‌రేప్ చేశారు. ఆమె స్పృహతప్పి పడిపోవడంతో అక్కడి నుంచి పారిపోయారు. అనంతరం ఆమె ఇంటికెళ్లి వివరాలను తెలపడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరిపై గతంలోనూ పలు కేసులు నమోదయ్యాయి. మరోవైపు, దమోహ్‌లో 17 ఏళ్ల బాలిక గురువారం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానిక యువకులు కొందరు ఆమెను వేధింపులకు గురి చేయడంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కాగా, మోవ్‌లో నాలుగేళ్ల బాలికను రేప్ చేసి చంపిన నిందితుడిని లాయర్లంతా కలసి కోర్టు వద్ద చితకబాదారు.




# ఇతర దేశాల్లో శిక్షలు ఇలా..



**చైనా:** అత్యాచార నిందితుల్ని నేరుగా ఉరికంబం ఎక్కిస్తారు. కొన్ని కేసుల్లో దోషుల పురుషాంగాన్ని తొలగించి నపుంసకులుగా కూడా మారుస్తారు. ఇదంతా నేరం జరిగిన రోజుల వ్యవధిలో జరిగిపోతుంది. అయితే సరైన సాక్ష్యాధారాలు లేకపోయినా ఉరిశిక్ష విధించడం విమర్శలకు దారి తీసిన సందర్భాలూ ఉన్నాయి. కొన్ని కేసుల్లో ఉరి తీశాక వారు నిర్దోషులని తేలడం గమనార్హం.



**ఇరాన్:** అత్యాచార దోషుల్ని బహిరంగంగా కాల్చి చంపుతారు. లేదంటే ఉరితీస్తారు. కొన్ని సందర్భాల్లో బాధితురాలు క్షమించడానికి అంగీకరిస్తే, ఉరి శిక్ష నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుంది.

**అఫ్గానిస్తాన్:** రేపిస్టులకు శిక్ష పడిన నాలుగు రోజుల్లోనే ఉరి తియ్యడమో, లేదంటే కాల్చి చంపడమో చేస్తారు.

**యూఏఈ:** రేప్ చేసిన ఏడు రోజుల్లో ఉరికంబం ఎక్కిస్తారు.

**సౌదీ అరేబియా:** సౌదీ అరేబియాలో అత్యాచారం నేరం రుజువైతే బహిరంగంగా తలనరికి చంపుతారు.

**నెదర్లాండ్స్:** మహిళలపై జరిగే లైంగిక వేధింపులన్నింటినీ అత్యాచారం కిందే పరిగణిస్తారు. అమ్మాయి అనుమతి లేకుండా ముద్దు పెట్టుకున్నా అక్కడ నేరుగా జైలుకి పంపిస్తారు. నేర తీవ్రత ఆధారంగా 4 నుంచి 5 సంవత్సరాలు శిక్ష ఉంటుంది.

**ఫ్రాన్స్:** అత్యాచార చట్టాలు అత్యంత కఠినంగా ఉంటాయి. అత్యాచార కేసుల్లో 15 ఏళ్ల కారాగార శిక్ష విధిస్తారు. జైల్లో ఉన్నన్ని రోజులు వారిని చిత్రహింసలకు గురి చేస్తారు. నేర తీవ్రతని బట్టి దానిని 30 ఏళ్లకు పెంచుతారు.

**అమెరికా:** అమెరికాలో రెండు రకాల చట్టాలున్నాయి. ఒకటి కేంద్ర చట్టమైతే, రెండోది రాష్ట్రాలకు సంబంధించింది. ఫెడరల్ లా కింద అత్యాచార నేరం నిరూపణ అయితే యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తారు. ఇక రాష్ట్ర పరిధిలో తీసుకుంటే రాష్ట్రానికి రాష్ట్రానికి మధ్య శిక్షల్లో తేడాలుంటాయి.



## క్లుప్తంగా...

### 11న ఫారెస్ట్ కాలేజీ, హార్టికల్చర్ వర్సిటీ ప్రారంభం

**హాజరుకానున్న సీఎం కేసీఆర్**

**సాక్షి, హైదరాబాద్:** గజ్వేల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా సీఎం కేసీఆర్ ములుగులో నిర్మించిన తెలంగాణ ఫారెస్ట్ కాలేజీతోపాటు హార్టికల్చర్ యూనివర్సిటీని ఈనెల 11న ప్రారంభించనున్నారు. తమిళనాడులోని మెట్టుపాలయంలో అక్కడి ప్రభుత్వం ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేయడం ద్వారా దాదాపు 120 మందిని ఐఎఫ్ఎస్‌కు ఎంపికయ్యేలా తీర్చిదిద్దింది. దీనిని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా 2016లో 'తెలంగాణ ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్'ను ములుగులో విశాలమైన ప్రాంగణంలో నిర్మించింది. అలాగే ఉద్యానవనాల అభివృద్ధి, పరిశోధన కోసం ములుగులోనే హార్టికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటుకు సర్కార్ నడుం బిగించింది. ఫారెస్ట్ ఇన్‌స్టిట్యూట్‌తో పాటు హార్టికల్చర్ వర్సిటీ భవన సముదాయాలను సీఎం బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు, అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హాజరవనున్నారు.

### యూనియన్లపై మొండివైఖరి విడనాడాలి: సీపీఎం



**సాక్షి, హైదరాబాద్:** యూనియన్ల విషయంలో సీఎం కేసీఆర్ తన మొండివైఖరిని విడనాడకుండా కార్మికులతో బలవంతంగా సంతకాలు పెట్టించే రాజ్యాంగ విరుద్ధ చర్యకు పాల్పడడాన్ని ఖండిస్తున్నట్లు సీపీఎం ప్రకటించింది. సీఎం నోటి మాటతోనో, ఒక్క కలం పోటుతోనో యూనియన్లు ఉండకూడదనడానికి అవి రాజకీయ పార్టీలు, సొంత జాగీర్లు కావని ఆ పార్టీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికులు పోరాడి యూనియన్లను సాధించుకున్నారే తప్ప ఎవరి దయాదాక్షిణ్యాలతో అవి రాలేదన్నారు. సీఎం ప్రతిష్టకు, పట్టుదలకు పోకుండా యూనియన్లు వద్దనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, కార్మికులనుంచి సంతకాలు తీసుకోవద్దని డిమాండ్ చేశారు.

### చట్టసభల్లో థర్డ్‌జెండర్‌కు రిజర్వేషన్లు కల్పించాలి

**ప్రధానికి ఎంపీ రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి**



**సాక్షి, హైదరాబాద్:** చట్టసభల్లో థర్డ్ జెండర్‌కు రిజర్వేషన్లు కల్పించాలని ప్రధాని నరేంద్ర మోదీకి కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల రిజర్వేషన్లను మరో పదేళ్లు పొడిగిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 334కు ప్రస్తుత సమావేశాల్లో సవరణ చేసుకుంటున్న సందర్భంగా ఆంగ్లో ఇండియన్లకు ఇన్నేళ్లు కల్పిస్తున్న రిజర్వేషన్లు కూడా ఇందులో అంతర్భాగంగా ఉన్నాయన్నారు. ఈ ఆర్టికల్ సవరణ ప్రక్రియలో ఆంగ్లో ఇండియన్ల రిజర్వేషన్లను తొలగించి, ఆ స్థానంలో థర్డ జెండర్స్‌కు ఆ సదుపాయాన్ని కల్పించాలని ప్రధానికి రాసిన లేఖలో కోరారు. దీనికోసం అదనంగా రిజర్వేషన్ల కోటా సృష్టించాల్సిన అవసరం లేదని, ఇన్నేళ్లు ఆంగ్లో ఇండియన్లు అనుభవిస్తున్న కోటానే ఇకపై థర్డ్‌జెండర్‌కు దక్కేలా సవరణ చేయాలని విజ్ఞప్తిచేశారు.

### ఘనంగా ఎంపీ సంతోష్ జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కేటీఆర్**

**సాక్షి, హైదరాబాద్:** రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్ జన్మదినం సందర్భంగా టీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవలో ఆయన మరింత రాణించాలని ఆకాంక్షించారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కె.కవిత కూడా సంతోష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, బేగంపేటలోని దేవనార్ అంధుల పాఠశాలలో ఎంపీ సంతోష్ శనివారం తన జన్మదినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రైతు సమన్వయ సమితి చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయకుడు దండె విఠల్ కలిసి రూ.10 లక్షల విరాళాన్ని దేవనార్ అంధుల పాఠశాల నిర్వాహకులకు అందజేశారు. మలక్‌పేటలోని మూగ, చెవిటి ఆశ్రమ పాఠశాలలో దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ డా.వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో సంతోష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా అమీర్‌పేట గురుద్వార్‌లో ఎంపీ సంతోష్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



**2013-14 నుంచి ఫీజు బకాయిలు (రూ. కోట్లలో)**

| సంవత్సరం | బకాయిలు |
|---|---|
| 2013-14 | 6.76 |
| 2014-15 | 5.45 |
| 2015-16 | 9.5 |
| 2016-17 | 130.05 |
| 2017-18 | 135.5 |

- ఇకపై కాలేజీలకు ఫీజు బకాయిలు ఉండొద్దని ప్రభుత్వ నిర్ణయం
- 2013-14 నుంచి 2017-18 వరకు ఉన్న రూ. 287.26 కోట్ల బిల్లులకు వచ్చే నెల ఆమోదం
- జనవరి 31లోగా చెల్లించేందుకు ఆర్థిక శాఖ కసరత్తు

# ఫీజు బకాయిలుండవు

**సాక్షి, హైదరాబాద్:** కాలేజీ యాజమాన్యాలకు శుభవార్త. గత కొన్నేళ్లుగా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపులకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు నుంచి 2017–18 విద్యా సంవత్సరం వరకు ఉన్న బకాయిలను పూర్తిస్థాయిలో క్లియర్ చేయాలని నిర్ణయించింది. ఇకపై ఫీజు బాకీ అనేది లేకుండా ప్రతి కాలేజీకీ విడుదల కావాల్సిన నిధులను పైసాతో సహా ఇవ్వనుంది.

**ఐదేళ్ల బకాయిలు రూ. 287.26 కోట్లు...**

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కింద ఇవ్వాల్సిన నిధులను ప్రభుత్వం ఏటా విడుదల చేస్తున్నప్పటికీ సాంకేతిక కారణాలు, బిల్లుల క్లియరెన్స్‌లో జాప్యంతో ఏటా నూరు శాతం చెల్లింపులు జరగడం లేదు. ఏటా ఒకట్రెండు శాతం నిధులు విడుదల కాకపోవడం... తర్వాత ఏడాదిలో వాటికి మోక్షం లభించకపోవడంతో బకాయిలుగా మారుతున్నాయి. 2013–14 విద్యా సంవత్సరం నుంచి 2017–18 విద్యా సంవత్సరం వరకు రూ. 287.26 కోట్ల మేర బకాయిలు ఉన్నట్లు గుర్తించిన ప్రభుత్వం... వాటిని ఒకేసారి విడుదల చేసి జీరో బ్యాలెన్స్ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కాలేజీలవారీగా పెండింగ్ బిల్లులను పరిశీలించా లని సంక్షేమ శాఖలను ఆదేశించింది. దీంతో చర్యలకు ఉపక్రమించిన సంక్షేమాధికారులు ఆయా కాలేజీలకు సర్క్యులర్లు పంపేందుకు సిద్ధమవుతున్నారు. అలా కుదరకుంటే యాజమాన్యాలకు ఫోన్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం ఇవ్వనున్నారు.

**జనవరి 15 డెడ్‌లైన్...**

కాలేజీల యాజమాన్యాలకు ఫీజు బకాయిలున్నట్లు తేలితే సంబంధిత బిల్లులను తక్షణమే సంబంధిత జిల్లా సంక్షేమ శాఖాధికారులకు సమర్పించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత వారం ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు వివిధ సంక్షేమ శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో బకాయిలను ఎట్టిపరిస్థితుల్లో ఆపొద్దని, వాటిని వెంటనే చెల్లించాలని నిర్ణయించడంతో ఈ మేరకు చర్యలు వేగవంతమయ్యాయి. ఆన్‌లైన్‌లో సాఫ్ట్‌కాపీలతోపాటు హార్డ్‌కాపీలను వచ్చే ఏడాది జనవరి 15వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా సమర్పించాలి. అలా సమర్పించిన బిల్లులను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం సంక్షేమ శాఖలకు స్పష్టం చేసింది. గడువులోగా వచ్చిన బిల్లులను పరిశీలించి జనవరి 31 నాటికి క్లియర్ చేయాలని ఆదేశించింది. జనవరి 15లోగా బిల్లులు సమర్పించకుంటే ఆయా కాలేజీలకు ఫీజు బకాయిలు విడుదల కష్టం కానుంది. ఎందుకంటే 2017–18 వార్షిక సంవత్సరం వరకు చెల్లింపులు చేసే ఆప్షన్‌ను జిల్లా సంక్షేమశాఖాధికారుల లాగిన్ ఐడీ నుంచి ప్రభుత్వం తొలగించనుంది. దీంతో ఆ బకాయిలు విడుదల కావాలంటే కాలేజీలు నేరుగా ప్రభుత్వాన్ని సంప్రదించాల్సి ఉంటుందని ఎస్సీ అభివృద్ధిశాఖ సంచాలకుడు పి.కరుణాకర్ 'సాక్షి'కి చెప్పారు.

**ఫిబ్రవరి తర్వాతే 2018-19 చెల్లింపులు...!**

2018–19 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తుల పరిశీలన ఇంకా పూర్తి కాలేదు. ఇప్పటివరకు 77 శాతం దరఖాస్తులను పరిశీలించినట్లు తెలుస్తోంది. గత విద్యా సంవత్సర ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ డిమాండ్ రూ. 2,101.45 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటివరకు రూ. 941.05 కోట్లు చెల్లించగా ఇంకా రూ. 1,164.4 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఫిబ్రవరి నుంచి ఈ చెల్లింపులు జరిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# డజను కార్పొరేషన్లకు కేబినెట్ హోదా?

- ఆశావహుల జాబితాలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- ఇప్పటికే ఎమ్మెల్సీ పల్లాకు కేబినెట్ హోదాతో నామినేటెడ్ పోస్ట్
- జాబితాలో పద్మా దేవేందర్, బాజిరెడ్డి, జోగు, పట్నం, నాయిని తదితరులు

**సాక్షి, హైదరాబాద్:** టీఆర్ఎస్ పార్టీ రెండో పర్యాయం అధికారంలోకి వచ్చి సుమారు ఏడాది కావస్తోంది. 89 అసెంబ్లీ స్థానాలను గెలుచుకోవడంతో పాటు, ఇతర పార్టీల శాసనసభ్యుల చేరికతో ప్రస్తుతం అసెంబ్లీలో టీఆర్ఎస్‌కు 104 మంది సభ్యుల బలం ఉంది. 40 మంది సభ్యులు ఉండే శాసన మండలిలోనూ టీఆర్ఎస్‌కు సంపూర్ణ బలం ఉండటంతో మంత్రివర్గంలో చోటు కోసం సీనియర్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తీవ్రస్థాయిలో పోటీ పడ్డారు. రెండోసారి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ 8న జరిగిన మూడో విడత మంత్రివర్గ విస్తరణ వరకు మంత్రిమండలి సభ్యుల సంఖ్య సీఎం కేసీఆర్‌తో కలుపుకుని 18కి చేరు కుంది. మంత్రివర్గంలో వివిధ సామాజిక వర్గాల సమీకరణలను దృష్టిలో పెట్టుకుని చోటు కల్పించాల్సి రావడంతో చాలామందికి చోటు కల్పించలేకపోయారు. దీంతో పలు కార్పొరేషన్లతో పాటు ఇతర నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని ఈ ఏడాది సెప్టెంబర్ మొదటి వారంలో జరిగిన మంత్రివర్గ విస్తరణ సందర్భంగా పలువురి నేతలకు సీఎం సంకేతాలు ఇచ్చారు.

**కేబినెట్ హోదాలో నామినేటెడ్ పదవులు**

టీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చాక పోలీసు హౌజింగ్ కార్పొరేషన్, ఎంబీసీ కార్పొరేషన్, టీఎస్ఐఐసీ సంస్థల పాలక మండళ్ల చైర్మన్ల పదవీ కాలాన్ని మాత్రమే సీఎం కేసీఆర్ పొడిగించారు. పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్‌గా సిద్దిపేట జిల్లాకు చెందిన మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని నియమించారు. మంత్రివర్గంలో చోటు ఆశించిన మాజీ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీగా నామినేట్ చేసి, శాసన మండలి చైర్మన్ పదవి అప్పగించారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌ను రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడిగా కేబినెట్ హోదాలో నియమించారు. కేబినెట్‌లో స్థానం ఆశించిన వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు దాస్యం వినయ భాస్కర్, శాసన మండలి సభ్యులు బోడకుంట వెంకటేశ్వర్లును ప్రభుత్వ చీఫ్ విప్‌గా నియమిస్తూ, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను విప్‌లుగా, శాసనసభ కమిటీ చైర్మన్లుగా నియమిస్తూ సంతృప్తి పరిచే ప్రయత్నం చేశారు. తాజాగా శాసనమండలి సభ్యులు పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కేబినెట్ హోదాలో రైతు సమన్వయ సమితి చైర్మన్‌గా నియమించారు.

**మరో డజను మందికి కేబినెట్ హోదా?**

పలు ప్రభుత్వ రంగ సంస్థల కార్పొరేషన్లకు చైర్మన్లుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను నియమించాలనే యోచనలో ఉన్న సీఎం కేసీఆర్, కొందరికి కేబినెట్ హోదా కూడా కల్పించే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఇటీవల 29 కార్పొరేషన్ల చైర్మన్ పదవులను లాభదాయక పదవుల జాబితా నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈ జాబితాలో మూసీనది పరివాహక (రివర్‌ఫ్రంట్) అభివృద్ధి కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీ), రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ, కాళేశ్వరం నీటిపారుదల ప్రాజెక్టు సంస్థ, యాదగిరిగుట్ట దేవాలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ (వైటీడీఏ), హైదరాబాద్ మహానగరాభివృద్ధి ప్రాధికార సంస్థ, రాష్ట్రంలోని పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థలు, తెలంగాణ రాష్ట్ర క్రీడల ప్రాధికార సంస్థ, తెలుగు అకాడమీ, హాకా, అధికార భాషా కమిషన్, తెలంగాణ గురుకుల విద్యా సంస్థల సంఘం (టీఆర్ఈఐ), హజ్ కమిషన్, సాహిత్య అకాడమీ, టీఎస్‌జెన్‌కో, టీఎస్ ట్రాన్స్‌కో, టీఎస్ డిస్కమ్ చైర్మన్లు కేబినెట్ హోదా జాబితాలో ఉన్నట్లు సమాచారం. రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ చైర్మన్ పదవుల కోసం టీఆర్ఎస్‌లో పోటీ తీవ్రంగా ఉన్నా, కేబినెట్ హోదా పదవులను బాజిరెడ్డి గోవర్ధన్, జోగు రామన్న, రెడ్యా నాయక్, తుమ్మల నాగేశ్వరరావు, పద్మా దేవేందర్‌రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు, పట్నం మహేందర్ రెడ్డి, నాయిని నర్సింహారెడ్డి తదితరులు ఆశిస్తున్నట్లు టీఆర్ఎస్ వర్గాలు చెప్తున్నాయి.

# నిధుల కోత తప్పదు

▶ మొదటి పేజీ తరువాయి

కోత పడటంతో రాష్ట్రానికి ఇప్పటివరకు కేంద్ర పన్నుల వాటా మొత్తంగా రూ. 924 కోట్ల మేర తగ్గింది. రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు ఇటీవలి ఢిల్లీ పర్యటనలో కేంద్ర పన్నుల వాటా 8.3 శాతం తగ్గిన విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి వాటాలో రాబడి 15 శాతం మేర తగ్గితే రూ. 2,957 కోట్ల మేర కోత పడుతుంది. అదే జరిగితే రాష్ట్రంలో అనేక పథకాల అమల్లో ఇబ్బందులు ఎదురవుతాయి'అని సీఎం వ్యాఖ్యానించారు.

**అన్ని శాఖలకు నిధులు తగ్గించండి...**

'అన్న వస్త్రం కోసం వెళ్తే ఉన్న వస్త్రం పోయిన రీతిలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనిశ్చితంగా ఉంది. కేంద్ర పన్నుల వాటా రాబడి గణనీయంగా తగ్గిన నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని శాఖలకు సమాంతరంగా నిధులు తగ్గించాలి'అని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. ఖర్చుల తగ్గింపును ఏదో ఒక శాఖకు వర్తింపజేయకుండా అన్ని శాఖల్లోనూ అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ లోపభూయిష్ట విధానం వల్లే ఇలాంటి సంకట స్థితి ఏర్పడిందని సమావేశంలో సీఎం అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఆర్థిక స్థితి దిగజారకుండా స్వీయ నియంత్రణ పాటించడం తప్ప మరో గత్యంతరం లేదని, అన్ని శాఖలను అప్రమత్తం చేసి ఖర్చుల్లో కోత, ఆర్థిక నియంత్రణను కఠినంగా అమలు చేయాలని సీఎం సూచించారు. అధికారులు, మంత్రులు సైతం ఆర్థిక క్రమశిక్షణ పాటించాలన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఇతర ఆర్థిక అంశాలపై ఈ నెల 11న జరిగే కేబినెట్ సమావేశంలో మంత్రులు, అధికారులకు సమగ్ర నోట్ అందించాలని ఆర్థిక శాఖ అధికారులను కేసీఆర్ ఆదేశించారు. కేంద్రం తన వాటా నిధులు ఇవ్వకుంటే ఎదురయ్యే ఇబ్బందులను ఐదారు రోజుల్లో ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లే యోచనలోఉన్నట్లు సీఎం వెల్లడించారు.

**కేంద్ర పన్నుల వాటాను విడుదల చేయండి**

కేంద్ర బడ్జెట్‌లో పేర్కొన్న విధంగా రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటాను విడుదల చేయాలని, లేనిపక్షంలో వాస్తవాలను విడుదల వెల్లడించాలని కోరుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం కేసీఆర్ శనివారం లేఖ రాశారు. '2017–18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీఎస్టీలో అంతర్భాగంగా ఉండే ఐజీఎస్టీ ద్వారా తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన రూ. 2,812 కోట్లకు కూడా కేంద్రం ఎగనామం పెట్టింది. తెలంగాణ రాష్ట్రానికి ఇవ్వాల్సిన ఐజీఎస్టీ నిధులను కేంద్రం ఎగ్గొంటిందనే విషయాన్ని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) కూడా తన నివేదికలో స్పష్టంగా పేర్కొంది. జీఎస్టీ ద్వారా 14 శాతం కంటే తక్కువ రాబడి వచ్చిన రాష్ట్రాలకు నష్టాన్ని పూడుస్తామని జీఎస్టీ చట్టం అమలు సందర్భంగా కేంద్రం అన్ని రాష్ట్రాలకు హామీ ఇచ్చింది. అయితే దేశవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం మూలంగా తెలంగాణ రాష్ట్రానికి 14 శాతం మేర జీఎస్టీ నిధులు సమకూరడం లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం నుంచి జీఎస్టీ నష్టపరిహారం కింద రాష్ట్రానికి రావాల్సిన రూ. 1,719 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలి'అని సీఎం కేసీఆర్ లేఖలో కోరారు.

## ఆక్యుపెన్సీ రేషియో పెంచాలి

**ఆర్టీసీ ప్రగతిపై అధికారులకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం**

**సాక్షి, హైదరాబాద్:** బస్సుల ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్)ను 80 శాతానికి పెంచేందుకు తగిన కృషి చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆర్టీసీ అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో డిపోలకు వెళ్లి అక్కడి ఉద్యోగులకు సంస్థ పట్ల మరింత నమ్మకం కలిగేలా చూడాలన్నారు. రాష్ట్ర రవాణా సంస్థ పురోగతి, ఉద్యోగుల సంక్షేమంపై శనివారం సంస్థ ఎండీ సునీల్ శర్మ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రయాణికుల రవాణా అవసరాలను గుర్తించి ఆ మేరకు సేవల్ని అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సీఎం అన్నారు. ఉద్యోగులు విధి నిర్వహణలో ప్రయాణికులు చేయెత్తిన చోట ఆపడం, అడిగిన చోట దింపడం వంటి విషయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఉద్యోగులకు గుర్తు చేయాలని, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం, వారి సంక్షేమానికి తక్షణమే డిపోల్లో వేల్ఫేర్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం తరపున పెద్ద ఎత్తున కార్గో నిర్వహించేందుకు త్వరితగతిన ప్రణాళిక రూపొందించాలన్నారు. సంస్థలో అదనపు ఖర్చుల్ని తగ్గించే ప్రయత్నం చేయాల్సి ఉందని సీఎం అభిప్రాయపడ్డారు.



మీడియాతో మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క. చిత్రంలో శ్రీధర్‌బాబు, షబ్బీర్ అలీ, రేవంత్‌రెడ్డి, అంజన్‌కుమార్, సీతక్క తదితరులు

# మద్య నియంత్రణపై గవర్నర్ హామీ

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- శాంతిభద్రతలు దిగజారుతున్నాయని గవర్నర్‌కు కాంగ్రెస్ వినతిపత్రం

**సాక్షి, హైదరాబాద్:** మహిళలపై దాడులు, మద్యం షాపుల నియంత్రణ వంటి అంశాలను లోతుగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని తమకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ హామీనిచ్చారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, నేరాల గురించి గవర్నర్‌కు వివరించామన్నారు. ప్రధానంగా రాష్ట్రంలో జరిగే నేరాలన్నింటికి కూడా కారణమైన మద్యాన్ని నియంత్రించకపోతే ఈ నేరాల్ని అదుపు చేయడం కష్టతరమౌతుందని ఆమె దృష్టికి తీసుకొచ్చామన్నారు. శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌కు కాంగ్రెస్ నేతలు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, సీతక్క, రేవంత్ రెడ్డి, కుసుమకుమార్, షబ్బీర్ అలీ, అంజన్‌కుమార్ యాదవ్, కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, వినయ్‌కుమార్, ఇందిరాశోభన్ తదితరులు వినతి పత్రం సమర్పించారు. అనంతరం భట్టి మీడియాతో మాట్లాడుతూ కేవలం రూ.10 వేల కోట్ల రాబడి ఉన్న మద్యం వ్యాపారాన్ని నాలుగేళ్లలోనే దాదాపు రూ. 21వేల కోట్లకు పెంచి దానిపై రాబడి పొందేటట్లుగా రాష్ట్రప్రభుత్వం చేస్తున్న వ్యాపారాత్మక ధోరణిని అదుపు చేయకపోతే రాష్ట్రంలోని యువత పెడదోవ పడుతుందని చెప్పామన్నారు. రాష్ట్రంలో ఉన్న బెల్ట్ షాపుల్ని , పర్మిట్ రూంలను, రోడ్లపై ఉన్న వైన్ షాపులన్నింటిని మూసివేయాలని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కట్టడి చేయాలని గవర్నర్‌ను కోరామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న నేరాలు, అత్యాచారాలు, మహిళలపై దాడులు అన్నింటికి కారణమైన ఈ పర్మిట్ రూంలను, బెల్ట్ షాపులను, రోడ్ల మీద అమ్మే షాపుల నియంత్రణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని భట్టి కోరారు. వాటి కట్టడికి కాంగ్రెస్ పక్షాన ఒక కార్యాచరణను చేపడతామన్నారు. పోలీస్ యంత్రాంగం కూడా నిష్పక్షపాతంగా ప్రజలకోసం పనిచేయకపోతే దానిపై కూడా కార్యాచరణ చేపడతామన్నారు.

**వీహెచ్, పొన్నాల కినుక...**

గవర్నర్‌ను కలిసే వారి జాబితాలో తమ పేర్లు లేకపోవడం పట్ల పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు, పొన్నాల లక్ష్మయ్య కినుక వహించి, అక్కడి నుంచి వెళ్లిపోయారు. గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించేందుకు రావాలంటూ పిలిచి చివరకు కలిసే వారి జాబితాలోనే పేర్లు లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇది బీసీనాయకులను పార్టీలో నిర్లక్ష్యం చేయడమేనంటూ ధ్వజమెత్తారు. ఢిల్లీలో ఉన్న తనకు సీఎల్పీనేత భట్టి విక్రమార్క ఫోన్‌చేసి రావాల్సిందిగా కోరితే వచ్చినట్టు వీహెచ్ మీడియాకు తెలిపారు. వారి పేర్లు జాబితాలో లేకపోవడం బాధాకరమని, వారికి తాను క్షమాపణలు చెబుతున్నానని ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూస్తామన్నారు.

**బెల్ట్ షాపులంటే ఏమిటి ?**

బెల్ట్‌షాపులు అంటే ఏమిటీ అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను గవర్నర్ అడిగి తెలుసుకున్నారని కాంగ్రెస్ నేతలు తెలిపారు. వాటి ఇబ్బందులను గురించి గవర్నర్‌కు వివరించినట్టు వారు తెలియజేశారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులకు సంబంధించిన సమాచారం తన వద్ద ఉందని, వాటిని పరిశీలించి తగిన విధంగా స్పందిస్తామని గవర్నర్ చెప్పారని వారు పేర్కొన్నారు.

## బీజేపీ ప్రభుత్వ వైఖరిపై కార్యాచరణ

**సీపీఐ జాతీయ కార్యవర్గ భేటీలో నిర్ణయం**

**సాక్షి, హైదరాబాద్:** కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, ఈ దిశలో కార్యాచరణను అమలు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గం నిర్ణయించింది. ఈ ధోరణికి అడ్డుకట్ట వేసేలా కలిసొచ్చే శక్తులను ఒక్కతాటిపైకి తీసుకురావాలని అభిప్రాయపడింది. బీజేపీ, సంఘ్ పరివార్ శక్తులను ఎదుర్కొనేందుకు వీలుగా జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో లౌకిక, ప్రజాతంత్ర, వామపక్ష శక్తుల విశాల వేదిక ఏర్పాటు దిశగా సీపీఐ చొరవ తీసుకోవాలని పలువురు సభ్యులు సూచించినట్లు సమాచారం. గతంలో పాండిచ్చేరిలో చేసిన తీర్మానానికి అనుగుణంగా విశాల ప్రాతిపదికన లెఫ్ట్, డెమోక్రటిక్, సెక్యులర్, సామాజిక శక్తులను ఒక వేదికపైకి తీసుకొచ్చేందుకు పార్టీ కృషిని మరింత పెంచాలని వివిధ రాష్ట్రాల ప్రతినిధులు కోరినట్లు తెలిసింది. రెండు రోజుల జాతీయ కార్యవర్గ సమావేశాలు శనివారం మఖ్దూంభవన్‌లో మొదలైన సందర్భంగా పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై నివేదిక సమర్పించారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలు, దేశ ఆర్థిక వ్యవస్థకు వాటిల్లుతున్న నష్టం, కార్మిక, ఇతర చట్టాలకు తూట్లు పొడవడం, కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, ఎన్ఆర్‌సీ, మహారాష్ట్రలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, తదితర అంశాలను ప్రస్తావించినట్లు సమాచారం. ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో కోల్‌కత్తాలో జరగనున్న పార్టీ జాతీయ నిర్మాణ మహాసభల్లో చర్చించాల్సిన అంశాలు, చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, తిథి శు.ఏకాదశి ఉ.7.09 వరకు, తదుపరి ద్వాదశి నక్షత్రం అశ్వని రా..3.04 వరకు తదుపరి భరణి, వర్జ్యం రా.10.44 నుంచి 12.25 వరకు, దుర్ముహూర్తం సా.3.55 నుంచి 4.36 వరకు, అమృతఘడియలు... రా.7.17 నుంచి 8.56 వరకు.

సూర్యోదయం : 6.22
సూర్యాస్తమయం : 5.22
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

వెంకయ్య నాయుడు (ఉ.రాష్ట్రపతి)

## రాయని డైరీ

మాధవ్ శింగరాజు

మాట్లాడే భాష వినబుద్ధి అవదు. మాట్లాడలేని భాషను వదలబుద్ధి కాదు. భాషల్లోని వైరుధ్యమా లేక ఇది మనుషుల్లోని వైపరీత్యమా!

పార్లమెంటు ప్రాంగణంలో తటాలున కొందరు ఎదురుపడి 'నమస్కారమండీ వెంకయ్యనాయుడు గారూ.. బాగున్నారా' అని పలకరిస్తుంటారు. మందంగా నవ్వుతాను. 'బాగున్నాను' అని చెప్పడం అది. దేవుడు మనిషికి మందస్మితం పెట్టడం మంచిదైంది. మాట్లాడే ఓపిక లేనపుడు, మాట్లాడే ఆసక్తి లేనప్పుడు యూజ్‌ఫుల్‌గా ఉంటుంది.

'హాయ్.. వెంకీ, హవ్యూ' అని వెళ్లిపోతుంటారు కొందరు. అది నాకు సుఖంగా, సౌఖ్యంగా ఉంటుంది. పొడవాటి కుశలపు పలకరింపు షార్ట్ కట్‌లోకి అనువాదం అవడం వల్ల లభ్యమైన సుఖసౌఖ్యాలు కావచ్చవి. లేదా, నేను బదులు చెప్పే భారాన్ని వాళ్లు నాపై పెట్టి నేను ఆ బరువును వాళ్ల కళ్లెదుటే దించుకునే వరకు అక్కడే ఎదురుచూడకుండా వాళ్ల మానాన వాళ్లు వెళ్లిపోవడం వల్ల కావచ్చు.

రాని భాష రాహుల్‌గాంధీని కూడా మంచి వక్తను చేస్తుంది! టీవీ మ్యూట్‌లో ఉండగా చూశాను. మలప్పురంలో ఏదో మాట్లాడుతున్నాడు. ఇక్కడ పార్లమెంటు సమావేశాలు జరుగుతుంటే అక్కడ కేరళలో ఏం పని! రాహుల్ ఒక్కో మాటకు జనం హర్షధ్వానాలు చేస్తున్నారు! అంతగా ఏం మాట్లాడుతున్నాడా అని మ్యూట్‌ని తీసి చూశాను. రాహుల్ వేదికను అలంకరించి ఇంగ్లిష్‌లో మాట్లాడుతుంటే పక్కనే ఒక విద్యార్థిని నిలబడి ట్రాన్స్‌లేట్ చేసి చెప్తోంది. 'నౌ' అని రాహుల్ అంటే.. 'ఇప్పో' అని ఆ అమ్మాయి, 'ఫస్ట్ ఆఫ్ ఆల్' అని రాహుల్



అంటే.. 'ఒన్నామత్తై' అని ఆ అమ్మాయి. ఏదో స్కూల్ కార్యక్రమం. చీఫ్‌గెస్ట్‌గా వెళ్లినట్లున్నాడు. అ అమ్మాయి కారణంగా ఇంగ్లిష్ వినసొంపుగా మలయాళంలోకి తర్జుమా అయి అక్కడ ఉన్నవాళ్లందరి చేతా చప్పట్లు కొట్టిస్తోంది.

శుక్రవారం రాజ్యసభలో సరోజినీ హేంబ్రమ్ తన సొంత సంతాలీ భాషలో మాట్లాడినప్పుడు కూడా.. ఆ స్కూల్ అమ్మాయి మలయాళం మాట్లాడుతున్నట్లే ఉంది వినబుద్ధయ్యేలా. సభలో అంతా చప్పట్లు. రాజ్యసభలో మునుపెవరూ వినని భాష! రఘునాథ్ ముర్ము అనే ఆయన ఆ భాషకు లిపిని కనిపెట్టారని, ఆయనకు భారతరత్న ఇవ్వాలని సరోజినీ హేంబ్రమ్ డిమాండ్. జేఎన్‌యూలో పీహెచ్‌డీ చేస్తున్న అమ్మాయిని రాజ్యసభలో రెడీగా కూర్చోబెట్టి సంతాలీని అక్కడికక్కడ హిందీలోకి ట్రాన్స్‌లేట్ చేయించుకుంటే ఇవన్నీ తెలిశాయి.

"ప్రతి సమావేశంలోనూ ఇవన్నీ చెప్పడానికి ట్రైచేస్తున్నాను నాయుడూజీ" అన్నారు సరోజిని.. జీరో అవర్ ముగిశాక.

"అవును ఒకసారి సభ ఎడ్జార్న్ అయింది. ఒకసారి డిస్కషన్‌కి టైమ్ తక్కువైంది కదా" అన్నాను.

"ఈ సమావేశాలు కాదు నాయుడూజీ. నేను రాజ్యసభ సభ్యురాలిని అయినప్పటి నుంచీ ట్రై చేస్తున్నాను. ఇంకో ఏడాదికి నా టెర్మ్ అయిపోతుంది. నా భాషలో నేనిక ఎప్పటికీ మాట్లాడలేనేమో అనుకున్నాను. మీరు మాట్లాడనిచ్చారు" అన్నారు సరోజిని నాకు ధన్యవాదాలు తెలుపుతూ.

"నేను మాట్లాడనిచ్చేదేముందీ సరోజినీజీ. మీ భాషను మీరు మాట్లాడకుండా మిమ్మల్ని ఎవరు ఆపగలరు.. రాజ్యసభలోనైనా, లోక్‌సభలోనైనా, ఒరిస్సాలోనైనా, ఓవర్సీస్‌లోనైనా.." అన్నాను.

"మాట్లాడేవాళ్లు లేకపోతే కాదు నాయుడూజీ, వినేవాళ్లు లేకపోతే ఏ భాషైనా చచ్చిపోతుంది" అన్నారు సరోజినీ.

కరెక్ట్ అనిపించింది.

"బాగా చెప్పారు అనే మాటను మీ సంతాలీ భాషలో ఏమంటారు సరోజినీజీ" అని అడిగాను.

# తూటాలకు వీరతిలకం!

జనహితం


వర్ధెల్లి మురళి



ఆ 'దుర్మార్గుల' శరీరాల్లో మొత్తం 11 బుల్లెట్లు దిగబడ్డాయి. 'ఆ బుల్లెట్లను దాచుకోవాలని ఉంది. ఆ తుపాకులను ముద్దాడాలని ఉంది' అంటున్నారు సెలబ్రిటీలు.

తనదైన ఒక అందమైన నవజీవితాన్ని అప్పుడప్పుడే నిర్మించుకోవడం మొదలుపెట్టిన ఆ యువ డాక్టర్‌ను అతిదారుణంగా చిదిమేసిన 'మానవమృగాలు' పోలీసులపై కూడా తిరగబడ్డాయట. రాళ్లతో దాడి చేశాయట. వారి పిస్తోళ్లను కూడా లాక్కొని కాల్పులు జరిపాయట. గత్యంతరం లేని స్థితిలో పోలీసులు జరిపిన ఎదురుకాల్పులకు హతమైపోయాయి.

ఇటువంటి ఎన్‌కౌంటర్ కథనాలు మనదేశంలో కొత్తకాదు. కొన్నివేల ఎన్‌కౌంటర్లు జరిగి వుంటాయి. అవన్నీ వేరు. ఈ ఎన్‌కౌంటర్ వేరు. ఈ వార్త కీచకవధ వార్తలాగా క్షణాల్లో దేశాన్ని చుట్టేసి జనాన్ని ఉత్తేజితం చేసింది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా పండితులూ, పామరులూ అందరూ ముక్తకంఠంతో శభాష్ అన్నారు. ఈరోజే కదా నిజమైన దీపావళి అని కూడా వ్యాఖ్యానించారు. విద్యార్థినులు, యువతులూ డ్రమ్స్ వాయిస్తూ, డ్యాన్సులు చేస్తూ హర్షామోదాలు వ్యక్తం చేశారు. 'ఊరికి ఒకడే రౌడీ వుండాల. ఆడు పోలీసోడే అయివుండాల' వగైరా ట్వీట్లు సామాజిక మాధ్యమాల్లో కనిపించాయి. 'సింగం.. సింగం..' అనే ట్యూన్లు న్యూస్ చానెళ్లలో వినిపించాయి. చివరికి, సర్వోన్నత చట్టసభైన పార్లమెంట్‌లో సైతం ఎన్‌కౌంటర్‌కు సమర్థనగా ప్రసంగాలు సాగాయి.

అదేమిటి? పోలీసులే తీర్పు చెప్పేసి శిక్షలు వేస్తూపోతే ఇక న్యాయవ్యవస్థ దేనికి? కోర్టులు – జడ్జీలు ఎందుకు? అంటూ అక్కడక్కడా కొన్ని స్వరాలు వినిపించాయి. బహుశా రోజులు గడిచేకొద్దీ ఈ స్వరాలు ఇంకొంచెం బలం పుంజుకోవచ్చు. కానీ మెజారిటీ ప్రజలు మాత్రం పోలీసు తీర్పు సమర్థించారు. ఇదొక కఠిన వాస్తవం. ఈ కఠిన వాస్తవానికి వెనుక కచ్చితమైన కారణాలు ఉన్నాయి. సంస్థాగతమైన లోపాలతో మన న్యాయవ్యవస్థ, పోలీసు వ్యవస్థ కునారిల్లుతున్నాయి. పెరుగుతున్న జనాభా, పెరుగుతున్న వివాదాల నేపథ్యంలో న్యాయస్థానాల సంఖ్య, జడ్జీల సంఖ్య పెరిగి ఉండాల్సింది. పెరగకపోగా జడ్జీ పోస్టుల్లో ఎప్పుడూ చాలా భాగం భర్తీ కాకుండా ఖాళీగానే వుంటున్నాయి. దేశంలోని వివిధ కోర్టుల్లో దాదాపు 3 కోట్ల కేసులు పెండింగ్‌లో వున్నాయి. క్రిమినల్ కేసులే రెండు కోట్లు. ఇందులో పదోవంతు కేసులు పదేళ్లకు పైగా పెండింగ్‌లో వున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) లెక్కల ప్రకారం 2017లో 32,500 అత్యా చారం కేసులు నమోదయ్యాయి. అప్పటికే పెండింగ్‌లో వున్న వాటితో కలిపి ఈ సంఖ్య లక్షా 46 వేలకు చేరింది. వాటిలో ఆ సంవత్సరం వివిధ కోర్టుల్లో పరిష్కారమైన రేప్ కేసుల సంఖ్య 18,300 మాత్రమే. అంటే ఏటా పదిశాతం కేసులు పరిష్కారమవుతుంటే 30 శాతం కేసులు పెండింగ్ జాబితాకు అదనంగా తోడవుతున్నాయి. భారతదేశంలో వున్న పెండింగ్ కేసులన్నింటినీ పరిష్కరించాలంటే 70 వేలమంది అదనపు జడ్జీలు అవసరమవుతారని మూడేళ్ల కింద అప్పటి ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. పోలీసు వ్యవస్థ పరిస్థితి కూడా అదేవిధంగా వున్నది. సాధారణ స్థాయిలో నేరాలు జరిగే దేశాల్లో ప్రతి లక్ష జనాభాకు 225 మంది పోలీసులుండాలని ఒక లెక్క వుంది. నేరాలు ఎక్కువగా జరిగే భారతదేశంలో మాత్రం లక్షకు 138 మంది పోలీసులున్నారు. ఈ సంఖ్యలో 25 శాతం పోస్టులు ఎప్పుడూ ఖాళీగానే వుంటాయట. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఉండాల్సిన పోలీసుల సంఖ్యలో సగానికంటే తక్కువమందితో మన పోలీసు వ్యవస్థ నెట్టుకొస్తున్నది. ఇంత పెద్ద దేశంలో ఫోరెన్సిక్ ల్యాబ్‌లు మూడో నాలుగో వున్నాయి. ఫోరెన్సిక్ రిపోర్టు రావాలంటే నెలలపాటు వేచి వుండాల్సిన దుస్థితి. మన మార్చురీల నిర్వహణ ప్రపంచంలో ఎక్కడా లేనంత దారుణంగా వుంది. ఈ కారణాలు కూడా నేర పరిశోధనకు సవాల్ విసురుతున్నాయి. అనేక కేసుల్లో నేర నిరూపణలో వైఫల్యాలకు ఇవి కూడా కారణాలే.

దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై వచ్చిన స్పందనను ఈ నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. యావత్తు దేశాన్ని కుదిపేసిన నిర్భయ ఉదంతంలో దోషులకు మరణశిక్ష పడి ఏడేళ్లు దాటినా ఇప్పటికీ అమలు జరగలేదు. తొమ్మిదేళ్ల పసి బాలికపై అత్యాచారం కేసులో కింద కోర్టు విధించిన మరణశిక్షను పైకోర్టు యావజ్జీవ శిక్షగా సవరించింది. అత్యాచారాలకు, హత్యలకు బలైన బిడ్డల తల్లిదండ్రులు తీరని కడుపుకోత వేదనను అనుభవి స్తుంటే, నేరస్తులు మాత్రం నిర్భయంగా సంచరిస్తున్న ఘటనలు జనంలో న్యాయస్థానాల తీర్పుపై నమ్మకాన్ని సన్నగిల్లేలా చేశాయి. ఇటువంటి పరిస్థితుల్లో దిశ ఉదంతం దేశం దృష్టిని తనవైపు తిప్పుకున్నది. హైదరాబాద్ నగరం శివారు ప్రాంతంలో, దేశంలోనే అతిపెద్ద జాతీయ రహదారి పక్కన, నిత్యం వేలాది వాహనాలు తిరిగే ఔటర్ రింగ్‌రోడ్డుకు చేరువలో ఒక యువ డాక్టర్‌పై జరిగిన దారుణ ఘటన మీడియాలో విస్తృతంగా ప్రచార మైంది. 'నాకు భయమేస్తున్నది పాప' అన్న దిశ గొంతుక ప్రతి గుండెను తాకింది. ప్రభుత్వంపై, పోలీసులపై ఒత్తిడి పెరిగింది. జాతీయ మీడియాలో పూనకాల స్వాములు వేసిన వీరంగం అంతా ఇంతా కాదు. ఒక ఉద్యమ నాయకుడు, రెండుసార్లు ప్రజల చేత ముఖ్యమంత్రిగా ఎన్నికైన నాయకునిపట్ల కనీస గౌరవం లేకుండా ఆయన మౌనంపై పూనకాల స్వాములు ప్రశ్నల వర్షం కురిపించారు. మౌనానికి అర్థం మూగ తనం కాదు. పోలీసు భుజంమీద వేలాడుతున్న తుపాకీ కూడా మౌనంగానే వుంటుంది. ట్రిగ్గర్ నొక్కినప్పుడు వచ్చిన శబ్దానికి ప్రపంచమే ఉలిక్కిపడింది. భుజం మాత్రం పోలీసులదే.

ఇప్పుడిక్కడ కలవరం కలిగించే మరో అంశం ముందుకొచ్చింది. దిశపై అత్యాచారం జరగడానికి మూడు రోజుల ముందు అసిఫాబాద్ జిల్లాలో ఒక ముప్పయ్యేళ్ల వివాహిత, దళిత యువతిపై కూడా గ్యాంగ్‌రేప్ జరిగింది. పరమ కిరాతకంగా ఆ యువతి చేతివేళ్లను, గొంతునూ కోసి చంపి, అడవిలో శవాన్ని పారేశారు. పోలీసులు ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ ఘటనకు మీడియాలో అరకొర ప్రాధాన్యతే లభించింది. దిశ కేసులో చెప్పినట్టు, బాధిత మహిళ పేరు గోప్యంగా ఉంచాలని మీడియాకు ఈ యువతి కేసులో ఏ అధికారి సలహా ఇవ్వలేదు. మా మాన ప్రాణాలకు విలువ లేదా అని ప్రశ్నిస్తూ దళిత సంఘాలు ఆందోళనబాట పడుతున్నాయి. మరొక వైరుధ్యాన్ని కూడా ప్రజలు సోషల్ మీడియాలో ఎత్తిచూపుతున్నారు. దిశ కేసులో నిందితులు నిరుపేదలు. దిశను బలితీసుకున్న పదో రోజున ఆ నిందితులు పోలీస్ ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ అత్యాచార ఘటనలో నిందితులు బడాబాబులు. ఘోరం జరిగి సరిగ్గా ఏడాది నిండగానే ఆ బాధితురాలిని బడాబాబులు నడిరోడ్డుపై నిప్పుపెట్టి చంపేశారు. ఇక్కడ నిందితుల ఎన్‌కౌంటర్ జరిగిన రోజే అక్కడ బాధితురాలి హత్య జరగడం కేవలం కాకతాళీయమే కావచ్చు. కానీ పోలీసు తూటాలు చెప్పే తీర్పులో ధనిక – పేద వివక్ష ఉండితీరుతుందని ఈ ఘటనలు స్పష్టం చేశాయి. ఎందుకంటే బాధితురాలిపై దాడులు జరుగుతాయని తెలిసినా పోలీసులు ఆమెకు రక్షణ ఇవ్వలేదు.

ఎన్‌కౌంటర్ జరిగిన మరుసటిరోజు తెలుగు టెలివిజన్ చానళ్లలో ఆసక్తికరమైన చర్చలు జరిగాయి. చర్చల్లో పాల్గొన్న విశ్లేషకులతోపాటు ఫోన్ కాలర్స్ సైతం న్యాయవ్యవస్థ వ్యవహారశైలిలోని వైరుధ్యాలను ఎత్తి చూపారు. ఓటుకు కోట్లు కేసులో ఆడియో వీడియో ఆధారాలతో చంద్రబాబునాయుడు దొరికిపోయినా, ఆ కేసును స్వీకరించడానికి న్యాయస్థానాలు నేటివరకు అంగీకరించకపోవడానికి కారణమేమిటని ఒక విశ్లేషకుడు ప్రశ్నించాడు. చంద్రబాబుపై లక్ష్మీపార్వతి దాఖలు చేసిన ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో విచారణపై ఉన్న స్టేను ఎత్తివేయడానికి 14 సంవత్సరాలు పట్టిందని, ఇక విచారణ జరిగి తీర్పు రావడానికి ఇంకెన్నేళ్లు పడతాయని ఒక కాలర్ ఆవేదనతో ప్రశ్నించాడు. కాంగ్రెస్ పార్టీ – తెలుగుదేశం కలిసి రాజకీయ కక్షతో వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై ఎటువంటి ఆధారాలు లేకుండా సాదాసీదా పిటిషన్ వేస్తే న్యాయస్థానం సీబీఐ విచారణకు ఆదేశించింది. సదరు న్యాయమూర్తికి పదవీ విరమణ అనంతరం మరో ఉన్నత పదవి లభించింది. చంద్రబాబుపై డాక్యుమెంటరీ ఆధారాలతో సహా వైఎస్ విజయమ్మ దాఖలుచేసిన పిటిషన్‌ను అదే న్యాయస్థానం సీబీఐ దగ్గర సిబ్బంది లేరనే సాకుతో తిరస్కరించింది. ఈ వైరుధ్యాలను మరో కాలర్ గుర్తుచేశాడు. న్యాయవ్యవస్థపై నమ్మకం సన్నగిల్లుతున్నదనే ఆందోళనకరమైన అంశం ఈ చర్చల్లో ప్రతిఫలించిన కారణంగానే ఇక్కడ ప్రస్తావించవలసి వచ్చింది. ఇటువంటి పరిస్థితిలోనే ఎన్‌కౌంటర్ రూపంలో దొరికిన సత్వర పరిష్కారాన్ని ప్రజలు ఆమోదించినట్టు కనిపిస్తున్నది.

ఆడపిల్లల మీద అత్యాచార ఘటనలను సంపూర్ణంగా అరికట్టాలంటే చేపట్టవలసిన చర్యలు చాలానే ఉన్నాయి. తొలుత న్యాయ – పోలీస్ వ్యవస్థలు ప్రజల విశ్వాసాన్ని చూరగొనగలిగేలా రూపొందించాలి. మారిన అవసరాలకు అనుగుణంగా వాటిని పటిష్టం చేయాలి. నేరస్తులను కఠినంగా శిక్షించేలా చట్టాలను సవరించుకోవాలి. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు అందరూ చెబుతున్నట్టు విచ్చలవిడి మద్యం విక్రయాలపై నియంత్రణ విధించాలి. మొబైల్ ఫోన్లలో అశ్లీల వరద ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలి. ఇవన్నీ ఒక భాగం మాత్రమే. ప్రధానంగా జరగాల్సింది సాంస్కృతిక ప్రక్షాళన. 'నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అని చెప్పిన మను ధర్మశాస్త్ర వారసత్వం మన నడవడిలో, మన ఆలోచనలో, మన అంతరంగాల్లో అంతర్లీనంగా ప్రవహిస్తూనే వున్నది. అభ్యుదయ వాదులమని చెప్పుకునే వాళ్లు కూడా 'పురుషులు కొంచెం ఎక్కువ సమానం – స్త్రీలు కొంచెం తక్కువ సమానం' అనే భ్రష్ట సమానత్వ భావనతో వ్యవహరిస్తుంటారు. చిన్నతనం నుంచే మగపిల్లవాడెక్కువ, ఆడపిల్ల కొంచెం తక్కువ అనే ఆలోచనా ధోరణికి ప్రయత్నపూర్వకంగా వీడ్కోలు చెప్పాలి. 'నీవలెనే, నావలెనే... నీ అక్కా, నా చెల్లీ' అనే భావం చిట్టి మెదళ్లలో ఎక్కాలి. అతడు – ఆమె ఈ ప్రపంచానికి సమాన పట్టాదారులని చెప్పాలి. ఆశలు ఇద్దరివీ, ఆశయాలు ఇద్దరివీ, అవకాశాలు ఇద్దరివీ, ఆకాశం ఇద్దరిదీ, అంతరిక్షం ఇద్దరిదీ, అనంతకోటి నక్షత్రాలు ఇద్దరివీ అనే సమభావం చిన్నవయసులో నాటగలిగితే స్త్రీని భోగవస్తువుగా చూసే మనస్తత్వం అలవడదు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ కారణంగానే స్త్రీల మీద విచ్చలవిడి అత్యాచారాలు కనిపించవు. ఆ స్థితికి చేరుకోవడం అనేది అత్యున్నత నాగరిక దశ. అప్పటివరకు కనీసం దోషులకు కఠిన శిక్షలు పడేలా చూడాలి. అందుకు రాజకీయ నాయకత్వానికి స్థిరచిత్తం ఉండాలి. కానీ, దురదృష్టవశాత్తు స్త్రీలను కించపరిచే ధోరణి మన నాయకత్వంలోనే ఉన్నది. 'కోడలు మగపిల్లాడిని కంటానంటే అత్త వద్దంటుందా' అని పద్నాలుగేళ్ల ముఖ్యమంత్రి బహిరంగంగా సామెతను విసరడం మూర్తీభవించిన ఆయన పురుషాధిక్య భావజాలానికి బండగుర్తు. ఈ అహంభావం వల్లనే మహిళా అధికారిని అవమానించిన ఒక మాజీ ఎమ్మెల్యేను ఇప్పటికీ చంద్రబాబు తనకు ఆదర్శం అని చెబుతున్నాడు. ఈ అహంభావం వల్లనే నిస్సహాయ మహిళల పరువును దోచేసే 'కాల్‌మనీ' ముఠాను పార్టీలో ప్రోత్సహించాడు. ఇటువంటి రాజకీయ నాయకత్వాన్ని ఎండగట్టాలి. అప్పటివరకూ పోలీసులు వెయ్యి అత్యాచారాలకు ఒక ఎన్‌కౌంటర్ చేస్తారు. అలా చేసినప్పుడల్లా ఆడబిడ్డలతోటి ఆ పోలీసుల తుపాకీ గొట్టాలకు రాఖీలను కట్టిద్దాం. వారు పేల్చే తూటాలను ఏరుకొచ్చి వీరతిలకం దిద్దిద్దాం. పోలీసువారికి విన్నపం... మరోసారి ఇటువంటి సందర్భంలో సీన్ రీ–కన్‌స్ట్రక్షన్ చేయడానికి వెళ్లినప్పుడు ఇప్పటి మాదిరిగానే బలహీనులైన పోలీసులను తీసుకొని వెళ్లాలి. ఎందుకంటే నిందితులు తిరగబడి పోలీసుల తుపాకులు లాక్కోవాలి కదా. అప్పుడే కదా ఎన్‌కౌంటర్ జరిగేది.

muralivardelli@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



### సోషల్ మీడియా

### మౌనం



"మహిళలకు ఏం జరుగుతోందో చూడండి. వాళ్లు పూర్తిగా అభద్రతకు లోనవుతున్నారు. శాంతిభద్రతలు, న్యాయ వ్యవస్థలో నత్తనడకన సాగుతున్న కేసుల విచారణ చూస్తే వారికి పిచ్చెక్కుతోంది. న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఏమాత్రం లేదు. బీజేపీ ప్రభుత్వం గుడ్డిదీ, చెవిటిదీ, స్మృతి ఇరానీ ఇప్పటికీ మౌనం వీడటం లేదు"

– నగ్మా, కాంగ్రెస్ నేత

### నిర్బంధం



"అస్సాం రాష్ట్రంలోని ఓ డిటెన్షన్ కేంద్రంలో గడిపిన ఒక మహిళను బీబీసీ ఇంటర్వ్యూ చేసింది. ఆ కేంద్రంలో ఆరు గదులు ఉన్నాయనీ, ఒక్కో గదిలో కనీసం అరవై మందిని ఉంచేవారని ఆమె చెప్పింది. అందరికీ కలిపి కేవలం రెండు మరుగుదొడ్లు, ఒక స్నానాల గది మాత్రమే ఉందని చెప్పింది. క్యాబ్, జాతీయ పౌరసత్వ చట్టం(ఎన్‌ఆర్సీ) అమానవీయమైనవి. డిటెన్షన్ కేంద్రాలు హింసాత్మక కేంద్రాలే"

– రూపా గులాబ్, రచయిత

### కాల వ్యవధి



"అత్యాచార కేసుల విచారణకు కచ్చితమైన కాల వ్యవధిని తప్పకుండా నిర్ణయించాలి. మూడు నెలల్లో వాటిపై విచారణ పూర్తి చేయాలి. రెండు నెలలు హైకోర్టులో, ఒక నెల సుప్రీంకోర్టులో విచారణ జరిగిన తరువాత.. మొత్తం కేసు విచారణ ఆరు నెలల్లో పూర్తయిపోయి తీర్పు చెప్పేయాలి. అలాగే, నమ్మకద్రోహం, సహజీవనం, ప్రేమికులు విడిపోవడం వంటివి అత్యాచారం కిందికి రావు. వీటన్నిటినీ చట్టం స్పష్టంగా వివరించాలి"

– ఇష్కారన్ సింగ్ భండారి, అడ్వొకేట్

### పోలీసులు



"లక్నోలోని విధాన సభ దగ్గర నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలపై యూపీ పోలీసులు లాఠీలు ఝుళిపించారు. అత్యాచార బాధితులు ఫిర్యాదు చేస్తే ఎఫ్‌ఐఆర్ నమోదు చేయని పోలీసులు నిరసనకారులను మాత్రం తరిమికొడతారు"

– ప్రశాంత్ కుమార్, జర్నలిస్ట్

### నిర్ణయం



"కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌నుకానీ, ఇతర బీజేపీ మంత్రులను కానీ ఏ విషయంలోనైనా నిలదీయడం సరికాదు. ఎందుకంటే, అన్ని నిర్ణయాలు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలే తీసుకుంటారని మనందరికీ తెలుసు"

– రంజొన బెనర్జీ, జర్నలిస్ట్

### రక్షణ



"హైదరాబాద్ తరువాత ఇప్పుడు ఉన్నావ్ తెరమీదికి వచ్చింది. అక్కడ బాధితురాలు కాలిన గాయాలతో మరణించింది. పెరుగుతున్న అత్యాచార కేసులు, సత్వర న్యాయం అందకపోవడం ఆందోళనకరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని అత్యయిక పరిస్థితిగా స్వీకరించి, మహిళా రక్షణకు పరిష్కారాలతో ముందుకు రావాలి"

– డి.కె.శివకుమార్, కాంగ్రెస్ నేత

### సిగ్గు



"మన కాలంలో మహిళా భద్రత అనేది ఎన్నికల అంశం కానందుకు మనమంతా సిగ్గు పడాలి. అది కేవలం మహిళల సమస్య కాదు. అలాగే, మహిళా రాజకీయ నేతలకు మాత్రమే సంబంధించినది కూడా కాదు. పాలనకు, మన ప్రాథమిక హక్కులకు అది అసలైన పరీక్ష"

– బర్ఖాదత్, జర్నలిస్ట్

సందర్భం

# తెలుగు భాషపైన నిజమైన ప్రేమేనా?


పాటిబండ్ల ఆనందరావు

ఈ మధ్య కొందరు రాజకీయ నాయకులకు హఠాత్తుగా తెలుగు భాషపైన ఎక్కడ లేని ప్రేమ పుట్టుకొచ్చింది. తెలుగు భాష సంస్కృతి అంతమైపోయిందన్న ఆందోళనతో నిద్రకూడా పోవడం లేదు. ఇప్పటికిప్పుడు తెలుగుపైన ఇంత అభిమానం ఎందుకు కలిగింది? ప్రభుత్వ బడుల్లో ప్రాథమిక విద్య ఆంగ్ల మాధ్యమంలో ఉంటుందన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రకటన వల్లనే గదా. తెలుగు మాట్లాడితే జరిమానా విధిస్తూ, ఎండలో నిలబెట్టి శిక్షిస్తూ, తెలుగు వాసనని కూడా లోపలికి రాకుండా జాగ్రత్త పడుతున్న కార్పొరేట్ స్కూళ్లలో సంపన్న వర్గాల పిల్లలు ఆంగ్ల మాధ్యమంలో చదువుకుంటున్నప్పుడు తెలుగు భాషకు ఏ అపకారం, అపచారం జరగలేదా? ఇప్పుడు పేదలు, బలహీనవర్గాలు, దళిత, మైనారిటీల పిల్లలు ఇంగ్లిష్‌లో చదువుకుంటేనే తెలుగుకు అంత పెద్ద ఉపద్రవం వచ్చి పడబోతున్నదా? తెలుగు భాషపైన ఇప్పుడు అలవిమాలిన ప్రేమని ఒలకబోస్తున్న గత ప్రభుత్వం తెలుగు భాషాభివృద్ధికి ఏం చేసింది?

ఓరియంటల్ కళాశాలలు వరుసగా మూతపడుతున్నాయి. భాషా ప్రవీణ, విద్వాన్ వంటి కోర్సుల సిలబస్‌లో తెలుగు భాషకు సంబంధించిన సిలబస్‌ను తగ్గించి ఇంగ్లిష్‌ని ఒక సబ్జెక్టుగా ప్రవేశపెట్టారు. మరి పద్నాలుగేళ్లు సీఎం రాజ్యమేలిన చంద్రబాబుకు, ఆయన అనుచరు లకు, వంత పాడుతున్న మేధావులకు ఆనాడే తెలుగు భాషకు జరిగిన అపచారం తెలీలేదా? మరో విషయం. టెన్త్, ఇంటర్ తరగతుల్లో సంస్కృతం పేపర్ ఎందుకొచ్చింది? ఎవరి ప్రయోజనం కోసం వచ్చింది? తెలుగు పేపర్‌ను వదిలేసి విద్యార్థులంతా సంస్కృతం పేపర్లోకి పరుగులు తీసే పరిస్థితి ఎందుకేర్పడింది? విద్యా వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ సంస్థలు ర్యాంకుల పంట పండించుకోవడం కోసం కాదా? దీంతో తెలుగు బడులకు మనుగడ లేక, తెలుగు పండితులకు గౌరవం లేక, తెలుగు భాష ఇంత చులకనైపో తుంటే, పలుచనైపోతుంటే ఇన్నేళ్లుగా చూస్తూ కూర్చున్నారు కదా.. ఇప్పుడు తెలుగు గురించి మాట్లాడే అర్హత వీరికి ఎక్కడినుంచి వచ్చింది?

గ్రామీణ ప్రాంతాల బడుల్లో సరిపడినంత విద్యార్థులు లేరన్న నెపంతో గత ప్రభుత్వం వేలాది బడులను మూసివేసింది. దాంతో పేద విద్యార్థులు అప్పులు చేసి ప్రైవేటు బడులకు పరుగులు తీయవలసి వచ్చింది. ఆ మాత్రం శక్తి కూడా లేని వేలాదిమంది పసివాళ్లు బడిబాటే మర్చిపోవాల్సి వచ్చింది. ఇంత నిర్దయగా నిరుపేదలు, బడుగు, బలహీనుల బిడ్డలకు చదువుని దూరం చేసి గాలికొదిలేసిన చంద్రబాబు ఇప్పుడు పసిబిడ్డల చదువుల గురించి కాకుండా వాళ్ల భాష గురించి బాధపడటం ఎంత విచిత్రం.



మాతృభాషలో విద్యాబోధనే ఉత్తమం అని మేధావులు, భాషా శాస్త్రవేత్తలు చెబుతోంది నిజమే. అయితే మాతృభాషలోనే ఉన్నత విద్య అభ్యసిస్తున్న జర్మనీ, జపాన్, రష్యా వంటి పలు దేశాల పరిస్థితి వేరు. ఈ దేశాలు ఆంగ్లేయుల పాలనకు తలొగ్గలేదు. ఇంగ్లిష్ నేర్చుకునే అవసరం వారికి ఏర్పడనందున శాస్త్ర, సాంకేతిక జ్ఞానమంతా వారి మాతృభాషలోనే లభ్యమవుతుంది. కానీ భారత్ వంటి దేశాల పరిస్థితి పూర్తిగా భిన్నమైంది. 200 ఏళ్లకు పైగా బ్రిటిష్ వలసగా మనం ఉండటంతో ఇంగ్లిష్ మనపై బలవంతంగా రుద్దారు. భారతీయులు అనివార్యంగా ఇంగ్లిష్ నేర్చుకోవలసి వచ్చింది. ఇంగ్లిష్‌లో మాట్లాడటం గొప్ప అన్న భావన స్థిరపడి పోయింది. ఇంగ్లిష్ రానివాళ్లు ఆత్మన్యూనతలో ఉండిపోయారు. అంతగా పాతుకుపోయిన ఆంగ్ల భాషను ఇప్పటికిప్పుడు తోసెయ్యగలమా?

వారు చెబుతున్నట్లే తెలుగు భాషని ఉద్దరిద్దాం. 'ఆంధ్రదేశంలోని ప్రతి పాఠశాలలోనూ ప్రాథమిక విద్యను తెలుగులోనే బోధించాలి, ఏ మినహాయింపూ లేకుండా ప్రతి తెలుగువాడూ తెలుగు మాధ్యమంలోనే చదువుకోవాలి' అనే నినాదంతో ముందుకురండి. ఆ ఉద్యమాన్ని చేపట్టండి. కనీసం ఒక ప్రకటన చేయగలరా? చేయలేరు. ఇంగ్లిష్ మీడియం బడుల్ని పల్లెత్తు మాటనలేరు. ఇంగ్లిష్‌తో విద్యా వ్యాపారం చేస్తున్న సంస్థలకు నష్టం జరిగే ఏ నిర్ణయమూ తీసుకోలేరు. ఎందుకంటే ఆ వ్యాపార సంస్థలు మన వాళ్లవి. అక్కడ చదువుకోవలసింది మన పిల్లలు. ఏమిటీ ద్వంద్వ నీతి? లెక్కలు, సైన్సు, సోషల్ ఇంగ్లిష్‌లో బోధించినంత మాత్రాన తెలుగు అంతమైపోతుందా?

ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్న వాళ్లు మాత్రమే తెలుగును బ్రతికించాలా? ఇంగ్లిష్ మాధ్యమంలో చదివే సంపన్నులకు ఆ బాధ్యత లేదా? పైగా అంబేడ్కర్ అంత గొప్పవాడు కాలేదా? పీవీ నరసింహారావు దేశ ప్రధాని కాలేదా? సీవీ రావు సైంటిస్ట్ కాలేదా? అబ్దుల్ కలాం రాష్ట్రపతి కాలేదా? వారంతా వారి వారి మాతృభాషల్లో ప్రాథమిక విద్య అభ్యసించినవాళ్లే కదా అంటూ ఉన్నత స్థానాల్లో ఉన్నవాళ్లని ఉదాహరణగా చూపిస్తున్నారు. ఇదెలా ఉందంటే కార్పొరేట్ విద్యా సంస్థలు ఒకటి రెండు ర్యాంకులు చూపించి తమ వద్ద చదివితే అందరికీ ఇలాంటి ర్యాంకులు వస్తాయన్న భ్రమని కల్పించి దోచుకుంటున్నట్టుగా ఉంది. స్వయం ప్రతిభతో, అసాధారణ మేధస్సుతో రాణించే వాళ్లకు ఇవేవీ వర్తించవు. పైగా వారు చదువుకునే రోజుల్లో ఊళ్లో ఒకే బడి ఉండేది. అందరికీ ఒకే సిలబస్ ఉండేది. ఎవరి స్థాయికి తగ్గట్లు వారు వృద్ధి చెందేవారు.

ఇప్పుడా పరిస్థితి ఉందా? విద్యార్థి లోకమంతా నిట్టనిలువునా రెండుగా చీలిపోలేదా? సంపన్నులందరూ ప్రైవేట్ బడుల్లోకి, పేదలు, బలహీన వర్గాలూ ప్రభుత్వ బడుల్లోకి అనివార్యంగా నెట్టబడలేదా? ఈ విభజన ఎవరి ప్రయోజనం కోసం జరిగింది? ఈ తెలుగు వాదం చేస్తున్న పెద్దలెవరైనా వాళ్ల పిల్లల్ని ఒక్క సంవత్సరం ఆ బడుల్లో చదివించగలరా? తమిళ మాధ్యమంలో చదివిన వారికి తమిళులు 20 శాతం రాయితీ ఇస్తున్నారు. కన్నడిగులు 10 శాతం ఇస్తున్నారు. తెలుగుపైన అంత ప్రేమ ఉంటే గత ప్రభుత్వం వారినెందుకు ఆదర్శంగా తీసుకోలేదు. ఇప్పుడు 90 శాతం మంది ప్రజల్ని పీడించి దోపిడీ చేస్తున్నాయి విద్య, వైద్య రంగాలు. వాటిని సమూలంగా సంస్కరించే ప్రయత్నం ప్రారంభించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలకు 9 రకాల వసతులు సమకూరుస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ప్రజలకు అనేక సంక్షేమ ఫలాలు అందిస్తున్నారు. తెలుగు భాష బాగుండాలి అనేవారు అంతకంటే ముందు తెలుగు ప్రజలు బాగుండాలని కోరుకోవాలి.

వ్యాసకర్త నాటక రచయిత, ప్రకాశం జిల్లా
మొబైల్ : 98498 98800

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి
ఫ్యామిలీ
నల్లగొండ
ఆదివారం ॥ 8-12-2019


● ఎన్టీఆర్

# సీన్ రీకన్‌స్ట్రక్షన్

**పోలీస్ చేతిలో గన్ ఉంటుంది.**
**గన్ మాత్రమే ఉంటుంది. చట్టం ఉండదు.**
**పోలీస్ ఒంటిపై డ్రెస్ ఉంటుంది.**
**డ్రెస్ మాత్రమే ఉంటుంది. చట్టం ఉండదు.**
**చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకుండా**
**ఉండటం కోసమే పోలీస్‌కి ఆ గన్.. ఆ డ్రెస్!**
**కానీ.. క్రిమినల్స్ చట్టం చేజారినప్పుడు**
**పోలీస్ అయినా.. మామూలు మనిషైనా..**
**చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే పరిస్థితి వస్తుంది.**
**సినిమాల్లో మనం చూస్తున్నదీ..**
**'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్‌లో**
**మనం చూసిందీ ఇదే!**
**ఏదైనా 'షూటింగ్' వరకూ వచ్చిందంటే..**
**అందులో కథ ఉంటుంది..**
**కథ వెనుక వ్యథ ఉంటుంది.**
**అప్పుడు రియల్ లైఫ్‌కి, రీల్ లైఫ్‌కి**
**తేడా కనిపించదు.**
**కావాలంటే సీన్ టు సీన్..**
**రీకన్‌స్ట్రక్షన్ చేసి చూద్దాం రండి.**

శిశువులుగా మీరు పుట్టి పశువులుగా మారితే!
మానవ రూపంలోనే దానవులై పెరిగితే...
సభ్యతకీ సంస్కృతికీ సమాధులే కడితే...

'ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీతి లోకంలో' పాటలోని పదాలివి.

వేటూరి సుందరామ్మూర్తి కలం చూపించిన ఆవేశం. 'ప్రతిఘటన' (1985) సినిమాలోని పాట. నిజమే.. సమాజంలో ఆడవారిపై జరుగుతున్న అత్యాచారాలను చూస్తుంటే... నాడు– నేడు ఈ లోకం 'దుర్యోధన దుశ్శాసన దుర్వినీతి లోకం' లానే ఉందనిపిస్తోంది. ఇన్నేళ్లల్లో ఏ మార్పూ లేదు. సినిమా కోసం ఆయన రాసిన ఈ పాట సమాజానికి వర్తిస్తుంది. ఏడేళ్ల క్రితం 'నిర్భయ', పది రోజుల క్రితం 'దిశ'.. మధ్యలో ఎందరో నిర్భయలు... ఇంకెంతమంది బలవ్వాలి?

దేశవ్యాప్తంగా ఉన్న ఈ ప్రశ్నకు సమాధానం దొరికేది ఎప్పుడు? అంటే 'గాంధీగారు అన్నట్లు అర్ధరాత్రి స్త్రీ ఒంటరిగా తిరగలిగినప్పుడు' అంటారు సీనియర్ నటి శారద.

**సమాజంలో జరిగేవి సినిమాలో కనిపిస్తాయి. సినిమాలో కనిపించేవి సమాజంలో జరుగుతుంటాయి. సినిమాకి ప్రేరణ సమాజమా? సమాజంలో జరిగేవి సినిమాకి ప్రేరణా? అంటే చెప్పడం కష్టం. భారత చలనచిత్ర చరిత్రలో సమాజానికి అద్దం పట్టే కథలు ఎన్నో వచ్చాయి. నాటి నుండి నేటి వరకు 'అత్యాచారం' నేపథ్యంలో చాలా సినిమాలే వచ్చాయి. కొన్ని చిత్రాల గురించి చెప్పుకుందాం.**

దిశపై అత్యాచారం జరిపినవాళ్లను ఏం చేయాలి? 'చంపేయాలి'. 'ఎన్‌కౌంటర్' చేయడంతో రగిలిన హృదయాలు శాంతించాయి. అయితే ఇది చట్టం చేసింది. 'రాఖీ' (2006) సినిమాలో రాకీ (ఎన్టీఆర్) చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకుంటాడు. అత్తింటివాళ్లు అతని చెల్లెలిని అమానుషంగా చంపేస్తే, తన చెల్లికి జరిగిన అన్యాయం ఏ చెల్లికీ జరగకూడదనుకుంటాడు. అత్యాచారానికి పాల్పడేవారిని వెంటాడి, పెట్రోల్ పోసి, నిప్పంటించేస్తాడు. తెరపై రగిలిన ఈ మంట ప్రేక్షకుడి మనసులను చల్లబరుస్తుంది. 'ఇలాంటి అన్న ఉండాలి' అంటూ రాఖీకి అమ్మాయిలందరూ రాఖీలు కడతారు. ఇదే ఎన్టీఆర్ 'టెంపర్' (2015)లో ముందు కరెప్టెడ్ పోలీస్‌లా కనిపించి, ఆ తర్వాత పరివర్తన చెందుతాడు. కామాంధుల చేతిలో బలైపోయిన యువతికి న్యాయం చేయడానికి సాక్ష్యాలు సాధిస్తాడు. కానీ సాక్ష్యం తారుమారవుతుంది. ఇక చేసేదేం లేక కోర్టు బోనులో నిలబడి, 'ఆ అమ్మాయిపై అత్యాచారం చేసినవాళ్లల్లో నేనూ ఉన్నానంటాడు. మమ్మల్ని శిక్షించండి' అంటాడు. ఆ సీన్ చాలా ఉద్వేగభరితంగా ఉంటుంది. నేరం చేయని ఎన్టీఆర్ నిందితులతో పాటు జైలుపాలవుతాడు. కానీ జైలులో దుష్టశిక్షణ చేస్తాడు.


● ఎన్టీఆర్

• • •

ఓ 30 ఏళ్ల వెనక్కి వెళ్లి పోలీసాఫీసర్ వైజయంతిని గుర్తు చేసుకుందాం. నిజాయతీకి చిరునామా అయిన వైజయంతి అత్యాచారానికి గురైన యువతికి న్యాయం చేయడానికి పడే తపనతో రూపొందిన చిత్రం 'కర్తవ్యం' (1990). ఇందులో వైజయంతి పాత్ర చేశారు విజయశాంతి. యువతికి న్యాయం చేయడానికి ఆర్థిక బలం ఉన్న పెద్దవాళ్లను ఢీ కొంటుంది వైజయంతి. అత్యాచారం చేసిన ఆ యువకుడితోనే యువతి మెడలో తాళి కట్టిస్తుంది. అయితే? అత్యాచారం చేసినవాడిని పెళ్లాడాలా? అలాంటి వక్రబుద్ధి ఉన్న వ్యక్తితో జీవితం పంచుకోవాలా? అనేది నేటి ప్రశ్న. 30 ఏళ్ల క్రితం నాటి పరిస్థితులకు ఆ క్లైమాక్స్ కరెక్ట్ అని చెప్పొచ్చు. ఆ సంగతలా ఉంచితే.. తెరపై వైజయంతి చూపించిన తెగువ ఎందరో స్త్రీలకు ఆదర్శం. ప్రతి స్త్రీ పోలీస్ కానక్కర్లేదు. కానీ వైజయంతిలా ధైర్యంగా ఉండాలి. అలాంటి ధైర్యసాహసాలనే ప్రదర్శిస్తుంది 'ఆమె' (1994)లో సుధ పాత్ర. మధ్యతరగతి గృహిణి ఆమె. కోడలిపై కన్నేసిన భర్తను నరికి, కోడలిని కూతురిగా చేసుకుంటుంది. ప్రేక్షకులు 'భేష్' అన్నారు. 'పెళ్లి' (1997) సినిమా కూడా దాదాపు ఇలాంటిదే. కోడలిని హింస పెట్టే కొడుక్కి విషం పెట్టి, చంపేస్తుంది సుజాత. కోడలికి వేరే పెళ్లి చేస్తుంది. ఒక స్త్రీ ఇంకో స్త్రీని అర్థం చేసుకోవాలన్నది ఈ సినిమాలు చెప్పే సందేశం. తప్పు చేసినది భర్త అయినా, కొడుకు అయినా శిక్షించాల్సిందే అనే మనస్తత్వం ఉన్న ఆడవాళ్లు సమాజంలో ఉంటే సగం నేరాలు తగ్గుతాయేమో! అలాంటి ఆడవాళ్లు సమాజంలో ఉన్నారు.. కొన్ని సంఘటనలు జరిగినప్పుడు 'మా పిల్లల్ని చంపేయండి' అని బహిరంగంగా చెప్పిన తల్లిదండ్రులూ ఉన్నారు.


● విజయశాంతి

• • •

ఇక సాటి స్త్రీని అర్థం చేసుకోనివాళ్లు కూడా సమాజంలో ఉంటారు. ఆ విషయాన్ని 'పెళ్లి చేసుకుందాం' (1997) కళ్లకు కట్టినట్లు చూపించింది. అందులో సౌందర్య అత్యాచారానికి గురైతే చుట్టుపక్కల ఆడవాళ్లే హేళన చేస్తారు. అందుకే 'నువ్వేమి చేశావు నేరం.. నిన్నెక్కడంటింది పాపం' అని 'సిరివెన్నెల' సీతారామ శాస్త్రి కలం ఆ యువతిని వెనకేసుకొచ్చింది. నిజమే.. అత్యాచారం చేసినవాడు దుర్మార్గుడు. అత్యాచారానికి గురైన యువతి నిస్సహాయురాలు. అందుకే ఆ సినిమాలో సౌందర్యను చేరదీస్తాడు హీరో వెంకటేశ్.


● సౌందర్య

• • •

ఇక నేరం చేసినవాడికి ఏ శిక్షా పడకపోతే ఆ బాధ ఎలా ఉంటుందో చెప్పడానికి 'పరుత్తివీరన్' (2007) ఒక ఉదాహరణ. తెలుగులో 'మల్లిగాడు' పేరుతో విడుదలైంది. హీరో కార్తీకి ఇది మొదటి సినిమా. ప్రియమణి అప్పటికే కొన్ని సినిమాలు చేసింది. అల్లరి చిల్లర బ్యాచ్‌తో ఆవారాగా తిరుగుతాడు పరుత్తివీరన్ (కార్తీ). ఇంటర్ చదువుతుంటుంది ముత్తళగు (ప్రియమణి). ఇద్దరూ ప్రేమలో పడతారు. చివరికి ప్రియుడి అల్లరి చిల్లర బ్యాచే ఆమె పాలిట కీచకులవుతారు. అత్యాచారం చేస్తారు. చనిపోతుంది. పరుత్తివీరన్ పిచ్చివాడైపోతాడు. ఇది క్లైమాక్స్. మరి.. అత్యాచారం చేసిన


● ప్రియమణి, కార్తీ

వాళ్లు? అంటే.. దర్శకుడు వారి గురించి ప్రస్తావించలేదు. కానీ శిక్ష పడాలని ప్రేక్షకులు కోరుకుంటారు. అది సహజమే కదా. నేరం చేసినవాళ్లకు బతికే అర్హత ఉంటుందా? ఆ కథకు చిత్రదర్శకుడు అమీర్ ఆ ముగింపు ఇచ్చాడు. కానీ, మోసం చేసిన స్నేహితులను వదిలిపెట్టకూడదని దర్శకుడు సుకుమార్ తాను రాసిన కథలో శిక్ష విధించారు. పల్నాటి సూర్య ప్రతాప్ దర్శకత్వం వహించిన 'కుమారి 21 ఎఫ్' (2015)కి సుకుమార్ కథ అందించి, నిర్మించిన విషయం గుర్తుండే ఉంటుంది. కుమారి (హెబ్బా పటేల్)ని ప్రేమిస్తాడు సిద్ధు (రాజ్ తరుణ్). ఫ్రీ బర్డ్‌లా ఉండే ఆ అమ్మాయి


● హెబ్బా పటేల్, రాజ్ తరుణ్

గురించి స్నేహితులు అనుమానం వ్యక్తం చేస్తారు. ఎక్కడో మూల సిద్ధుకి కూడా అనుమానం ఉంటుంది. అయితే అనుమానించాల్సింది స్నేహితులను. చివరికి స్నేహితులే కుమారిపై అత్యాచారం జరుపుతారు. అంతే.. వారిని నరమానవుడు లేని చోట బంధించి, రోజూ ఆహారం తీసుకెళ్లి, వారికి పెట్టి మరీ కొడుతుంటాడు. ఈ చిత్రహింసలు భరించలేమని, ఒకేసారి చంపేయమని వేడుకుంటారు స్నేహితులు. చిత్రహింసలకు గురవుతున్న వారిని చూసి ప్రేక్షకులకు పైశాచికానందమే కలుగుతుంది. 'ఒకేసారి చంపేస్తే ఏం ఉంటుంది? ఇలా కదా చంపాలి' అన్నది నేడు సమాజంలో చాలామందికి ఉన్న అభిప్రాయం. అవును.. అమ్మాయి పడిన వేదన ఎలా ఉంటుందో కిరాతకులకు చూపించాలి కదా. సిద్ధుకి జరిగినట్లే గుణకూ జరుగుతుంది. నమ్మిన స్నేహితుడే గుణ ప్రేయసికి ద్రోహం చేస్తాడు. 'ఆర్‌ఎక్స్ 100' సినిమాతో ఫుల్ క్రేజ్ తెచ్చుకున్న కార్తికేయ నటించిన చిత్రం 'గుణ 369' (2019). ఏడుగురు కిరాతకుల చేతిలో బలైపోతుంది గుణ ప్రేయసి. ఆ ఏడుగురికీ గుణ ప్రాణ స్నేహితుడు అండగా ఉంటాడు. ప్రేయసికి జరిగినది తెలుసుకున్నాక గుణ రగిలిపోతాడు. ఒకరి చేతులు నరుకుతాడు. ఒకరి కాళ్లు నరికేస్తాడు. ఇంకొకరి తలను నరుకుతాడు. మరో స్నేహితుడి కాళ్లూ, చేతులూ రెండు తీసేస్తాడు. తెరపై దాదాపు పది నిమిషాల పాటు ఈ మారణకాండ సాగుతుంది. గుణ చేసిందే కరెక్ట్ అంటారు ప్రేక్షకులు. ''దిశ ఘటన తర్వాత 'గుణ 369'లోని క్లైమాక్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నా ఫేస్‌తో ఆ వీడియో వైరల్ అవుతోంది. నేను మాత్రం ఓ ట్వీట్ వేసి ఏం చేయలేకపోయానే అని గిల్టీగా ఫీలయ్యాను'' అన్నారు కార్తికేయ.


● కార్తికేయ

• • •

ఇలా ఎన్నో సినిమాల్లో 'అత్యాచారాలు' జరగడం, హీరో లేదా హీరోయిన్ ప్రతీకారం తీర్చుకోవడం చూశాం. ప్రతి స్త్రీ తన జీవితానికి తానే 'హీరోయిన్' అవ్వాలి. ఎవరో వస్తారు? కాపాడతారు? అనుకోకుండా 'నా రక్షణ నేనే' అనే భావన పెంచుకోవాలి. తల్లిదండ్రులు కూడా ఆడపిల్లలకు అలా చెప్పే పెంచాలి.

అమ్మాయిలూ... మీ బ్యాగుల్లో పెట్టుకోవాల్సింది 'ఫేస్ పౌడర్' కాదు.. 'మిర్చి పౌడర్ (కారప్పొడి), బాడీ స్ప్రే కాదు.. 'పెప్పర్ స్ప్రే'. ఇవి ఉంటే చాలదు.. ఆపదలో ఇరుక్కున్నప్పుడు సమయస్ఫూర్తితో స్పందించి, 100కి డయల్ చేయండి. ఇతర హెల్ప్‌లైన్లు ఉన్నాయని మరచిపోకండి. వీలైనంతవరకూ పోరాడండి. అయితే పోరాడే పరిస్థితులు రాకూడదు. మళ్లీ గాంధీ మాటలను గుర్తు చేసుకుందాం. ఆడది అర్ధ రాత్రి స్వేచ్ఛగా తిరగగలిగినప్పుడే అసలైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అన్నారు గాంధీ. ఆ రోజు రావాలని కోరుకుందాం.

**– డి.జి. భవాని**


● నయనతార

## వాళ్లే నిజమైన హీరోలు

నయనతార నటించిన మలయాళ చిత్రం 'పుదియ నియమమ్' (2016). 'వాసుకి' పేరుతో తెలుగులో విడుదలైంది. భర్త, కుమార్తెతో కలిసి హాయిగా జీవితం సాగిస్తుంది వాసుకి (నయనతార). ఓ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌లో ఉంటుందీ కుటుంబం. అదే అపార్ట్‌మెంట్‌లో ఇస్త్రీ బట్టలు చేసే వ్యక్తి, ఇద్దరు ఆకతాయి కుర్రాళ్లు నయనతారను రేప్ చేస్తారు. భర్తకు చెప్పుకోలేక కుంగిపోతుంది. తనకు అన్యాయం చేసినవాళ్లు కళ్లెదుటే దర్జాగా తిరుగుతుంటే తట్టుకోలేకపోతుంది. ఆ సమయంలో సరిగ్గా దీపిక అనే పోలీసాఫీసర్ సహాయం దొరుకుతుంది వాసుకికి. ఆమె సహాయంతో ఆ ముగ్గుర్నీ చంపుతుంది. అయితే పోలీసాఫీసర్‌గా గొంతు మార్చి, భర్తే (మమ్ముట్టి) వాసుకికి సహాయం చేస్తాడన్నది క్లైమాక్స్. 'శీలం పోగొట్టుకున్న భార్య' అంటూ వెలివేయకుండా తానే సహాయం చేస్తున్న విషయాన్ని బయట పెట్టని హుందా భర్త అతను. సమాజంలో ఇలాంటి భర్తలు ఉంటారా? ఉండొచ్చేమో. ఇక దిశ ఘటనపై నయనతార స్పందిస్తూ – ''సినిమాల్లో కనిపించే కొన్ని ఘటనలను నిజం చేసిన నిజమైన హీరోలు తెలంగాణ పోలీసులు. దోషులు శిక్షింపబడిన రోజును నిజమైన న్యాయం చేకూరిన రోజుగా దేశంలోని మహిళలందరూ గుర్తుపెట్టుకోవాలి. న్యాయం చేకూరిందని మనమందరం ఆనందించే కన్నా ఇలాంటి పరిస్థితులపై మన పిల్లలను చైతన్యపరచాలి. ఎడ్యుకేట్ చేయాలి. ముఖ్యంగా అబ్బాయిలను.. మహిళలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించినప్పుడే మగవారు నిజమైన హీరోలు అవుతారని వారికి చెప్పాలి'' అన్నారు.


● శ్రీదేవి

## మంచి మామ్

సవతి తల్లి అంటే కచ్చితంగా సరిగ్గా చూడదనే అభిప్రాయం సమాజంలో బలపడింది. అయితే దేవకిలాంటి మంచి సవతి తల్లి కూడా ఉంటుందని చెప్పిన సినిమా 'మామ్' (2017). దేవకి (శ్రీదేవి) ఓ స్కూల్ టీచర్. సవతి తల్లి దేవకి అంటే ఆర్యకు ఇష్టం ఉండదు. అనుకోని పరిస్థితుల్లో ఆర్య అత్యాచారానికి గురవుతుంది. అది తెలుసుకుని దేవకి తల్లడిల్లిపోతుంది. తప్పుడు సాక్ష్యాలతో నిందితులు తప్పించుకుంటారు. అప్పుడు దేవకి వాళ్లను శిక్షించే పనిని చేతుల్లోకి తీసుకుంటుంది. సామూహిక అత్యాచారానికి పాల్పడినవారిని ఒక్కొక్కరిగా ప్లాన్ చేసి తెలివిగా చంపుతుంది. చనిపోయిన వ్యక్తి తాలూకు న్యూస్ టీవీలో వచ్చినప్పుడు ఆర్య కళ్లల్లో మెరుపు కనిపిస్తుంది. చివరికి దేవకియే అంతా చేసిందని తెలుసుకుని 'మామ్' అని అప్పుడు పిలుస్తుంది. అందాల రాశి, అద్భుతమైన నటి శ్రీదేవి నటించిన చివరి చిత్రం 'మామ్'. ఇది ఆమెకు 300వ చిత్రం.

## దుష్టులు 'నిమజ్జనం' కావాలి

అత్యాచారానికి గురైతే జీవితం అంతమైపోయినట్లే? ఒకప్పటి సమాజం ఆలోచన ఇలానే ఉండేది. అందుకే ఇక బతకడం అనవసరమని ఆత్మహత్య చేసుకుంటుంది 'నిమజ్జనం' సినిమాలో భారతి (శారద). సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన యువతి ఆమె. మామగారి అస్థికలను నిమజ్జనం చేసేందుకు భర్తతో కాశీ వెళుతుంది. అయితే బండి నడిపేవాడికి ఆమెపై కన్ను పడుతుంది. భర్త లేని సమయం కోసం చూసి, ఒంటరిగా ఉన్న భారతి పై అత్యాచారం చేస్తాడు బండి వాడు. భర్తకు మొహం చూపలేక గంగా నదిలో ఆత్మార్పణం చేసుకుంటుంది భారతి. బండివాడికి పశ్చాత్తాపం మొదలవుతుంది. భారతి ఆత్మహత్యకు తానే కారణం అని ఆమె భర్తకు చెప్పి, ఎక్కడైతే భారతిని బలాత్కారం చేశాడో అక్కడే ఆత్మహత్య చేసుకుంటాడు. పశ్చాత్తాపంతో అతను చనిపోయాడు. క్షణికావేశం తప్పులు చేయిస్తుంది. నిండు జీవితాలను బలి తీసుకుంటుంది. అందుకే తప్పు చేసే ముందు దాని ప్రభావం గురించి ఆలోచించాలి. అయితే ఇక్కడ ప్రశ్న ఏంటంటే.. అత్యాచారానికి గురైతే బతికే అర్హత లేదా? ''కానే కాదు'' అంటారు శారద. ఆమె మాట్లాడుతూ– ''అత్యాచారానికి గురైన స్త్రీ ఎందుకు చనిపోవాలి? అప్పటి 'నిమజ్జనం' కథలో ఆ తీర్పు ఉంది కాబట్టి.. అలా జరిగింది. కానీ మన జీవితానికి రచయితలం మనమే. మన తప్పు లేనప్పుడు ఎందుకు చనిపోవాలి? అత్యాచారానికి గురైన స్త్రీలను చిన్న చూపు చూడకూడదు. వాళ్లను బతకనివ్వాలి. ఆ సంగతి అలా ఉంచితే.. మొన్న దిశ విషయంలో దేశవ్యాప్తంగా ఆడవాళ్లందరూ న్యాయం కోరి నడుం కట్టిన తీరు అభినందనీయం. ఈ కట్టు ఇలానే బలమైనదిగా ఉండాలి. దిశ న్యాయం కోసం గొంతెత్తిన స్త్రీలందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. ఇవాళ ఇన్ని గొంతులు మాట్లాడాయి కాబట్టి దిశపై అమానవీయ చర్యకు పాల్పడినవారికి శిక్ష పడింది. వాళ్లను అలా కాల్చి పారేయడం కరెక్ట్'' అన్నారు.


● శారద

అందమైన లోకం

# కలెక్టర్ కదిలిపోయాడు

**మూడో మనిషికి తెలియకుండా**
**కష్టం సుఖం చెప్పుకున్నట్లే..**
**డబ్బు దాచుకున్న రహస్యం ఇద్దరు**
**అక్కచెల్లెళ్లు తమ మధ్యే**
**ఉంచుకున్నారు. ఆ దాచుకున్న**
**డబ్బు కూడా బతకడానికి కాదు.**
**చనిపోతే అంత్యక్రియల కోసం!**


తంగమ్మాళ్, రంగమ్మాళ్‌లతో కలెక్టర్ విజయ్ కార్తికేయన్

తంగమ్మాళ్, రంగమ్మాల్ అక్కాచెల్లెళ్లు. తంగమ్మాల్ వయసు 78. రంగమ్మాళ్ వయసు 75. ఇద్దరూ ఒకే ఇంట్లో ఉంటారు. ఇంట్లో ఆ ఇద్దరే ఉంటారు. పిల్లలు వెళ్లిపోయారు. పిల్లల పిల్లలు రావడం మానేశారు. వాళ్లుండేది చిన్న ఊరు. తమిళనాడులోని పల్లాడం దగ్గరి పూమలూర్. తిరుప్పూర్ జిల్లా. వీళ్లను చూసేవాళ్లు లేరు. చేసేవాళ్లూ లేరు. ఎవరికి ఎవరూ ఉండరని ఒంట్లో కాస్త ఓపిక ఉన్నప్పుడే వీళ్లు గ్రహించినట్లున్నారు. పొలానికి కూలి పనికి వెళ్లినప్పుడు వచ్చే నూరూ నూటా యాభై రూపాయల్లోనే ఇద్దరూ తమ కోసం కొంత దాచుకున్నారు. దాచుకున్నది బ్యాంకులో కాదు. బొడ్లో దోపుకునే చిన్న సంచిలో కొంత, అల్యూమినియం డబ్బాలో కొంత, బియ్యం బస్తాల్లో కొంత! కొడుకులు తాగుబోతులు. డబ్బుందంటే లాగేసుకుంటారు. అందుకే మూడో మనిషికి తెలీకుండా.. కష్టం సుఖం చెప్పుకున్నట్లే.. డబ్బు దాచుకున్న రహస్యం ఇద్దరు అక్కచెల్లెళ్లు తమ మధ్యే ఉంచుకున్నారు. ఆ దాచుకున్న డబ్బు కూడా బతకడానికి కాదు. చనిపోతే అంత్యక్రియల కోసం!

ఈ మధ్య తంగమ్మాళ్‌కి జబ్బు చేసింది. వైద్యానికి డబ్బు లేదు. 'అంత్యక్రియల డబ్బు'ను బయటికి తీయక తప్పలేదు. ఇద్దరి దగ్గరా కలిపి 46 వేల రూపాయల వరకు జమ అయ్యాయి. ఇరవై ఏళ్లుగా తినీ తినకా దాచిన మొత్తం అది. అక్కవి 22 వేలు, చెల్లెలివి 24 వేలు. ''నా డబ్బు కూడా తీసేస్కో అక్కా. నీ ఆరోగ్యం కంటే ఎక్కువా'' అని చెల్లి అంది. అక్కకు కన్నీళ్లు ఆగలేదు. చెల్లిని ఆప్యాయంగా హత్తుకుంది. ఇద్దరూ కలిసి ఆసుపత్రికి వెళ్లారు. ఓ మోస్తరు ఆసుపత్రిలోనైనా ముందే డబ్బు కట్టించుకుంటున్నారుగా ఇప్పుడు. అడ్వాన్సుగా కొంత కట్టబోయారు. ఆ నోట్లను చూసి ఆసుపత్రివాళ్లు 'ఇవి చెల్లవు' అనేశారు. పాత వెయ్యినోట్లు, ఐదొందల నోట్లు అవి! మూడేళ్ల క్రితం ప్రభుత్వం రద్దు చేసిన పెద్ద నోట్లు!! అచేతనంగా నిలబడిపోయారు తంగమ్మాళ్, రంగమ్మాళ్. వాళ్లకా రద్దు సంగతి తెలీదు. పాత నోట్లు తప్ప చిల్లిగవ్వ లేదు వాళ్ల దగ్గర. ఉన్నా, ఆ చిల్లి గవ్వయినా ఈ కాలంలో ఎందుకు చెల్లుతుంది! విషయం కలెక్టర్ వరకు వెళ్లింది. చెల్లని నోట్లను చెల్లుబాటు చేయడం నేరం కదా, అందుకు వెళ్లింది.

ఇక ఇక్కడి నుంచి ఈ స్టోరీ మీకు కొంత సంతోషాన్నిస్తుంది. లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ అనుకునేలానూ చేస్తుంది. తిరుప్పూరు జిల్లా కలెక్టర్ కె.విజయ్ కార్తికేయన్. వాళ్ల కథ విని ఆ యువ కలెక్టర్ కదిలిపోయాడు. పాత నోట్ల మాట తర్వాత అని, వెంటనే ఆ అక్కాచెల్లెళ్లకు ఆర్థిక సహాయం చేశాడు. వృద్ధాప్యపు పెన్షన్ మంజూరుకు తక్షణం ఒక లెటర్ తయారు చేయించి పైకి పంపాడు. పెరుందురై మెడికల్ కాలేజీకి ఒక లేఖ రాస్తూ.. వీళ్ల ద్దరికీ ఉచిత వైద్యం అందజేయాలని విజ్ఞప్తి చేశాడు. ఆ తర్వాతే.. వీళ్ల దగ్గరున్న పాత నోట్లు తీసుకుని కొత్త నోట్లు ఇవ్వండని జిల్లా బ్యాంకుకు సిఫారసు చేశాడు. అమాయకులున్న చోట మంచివాళ్లూ ఉంటారు. అమాయకులు, మంచివాళ్ల వల్లే ఈ ప్రపంచంపై మనకింకా నమ్మకం మిగిలి ఉంటోంది.

పెద్ద మనుషులు / చిన్న విషయాలు

# అన్నిసార్లొద్దు


డొనాల్డ్ ట్రంప్

అమెరికాలో వాటర్ ప్రాబ్లమ్! అవును. అమెరికాలోనే. అమెరికాలో ఓసారెప్పుడో కరెంట్ పోయింది. అప్పుడూ ఇంతే.. అమెరికాలో కరెంటు పోయిందా అని ముక్కుమీద వేలేసుకున్నాం. అమెరికా ఆకాశంలో ఎక్కడో లేదు. ఈ భూమి మీదే ఉంది. అమెరికన్‌లు ఎవరో కాదు. మనలా మానవులే. ఆ మానవుల్లో అతి మామూలు మానవుడు డొనాల్డ్ ట్రంప్. అమెరికా అధ్యక్షుడు అయితే కావచ్చు. అతడి బాత్రూమ్‌లోనూ ట్యాప్‌లోంచి ఈమధ్య నీళ్లు రాలేదు! సిస్టమ్ ఎక్కడో దెబ్బతినిందని ట్రంప్‌కి అర్థమైంది. బాత్రూమ్ సిస్టమ్ కాదు. అమెరికన్ వాటర్ సేవింగ్ సిస్టమ్. వెంటనే ఒక ఆర్డర్ జారీ చేసి.. వాష్‌రూమ్‌లకు వెళ్లేవాళ్లంతా పనైపోయాక ట్యాప్ కట్టేయాలని సర్క్యులర్ జారీ చేయించారు. అమెరికన్‌లు ఒకసారి టాయ్‌లెట్‌కి వెళితే పదిసార్లు ఫ్లష్ కొట్టి వస్తారని, ఆ పాడు అలవాటు ఎంత త్వరగా మానుకుంటే అంత త్వరగా అమెరికాలో నీటి కొరత తీరుతుందని కూడా ట్రంప్ చిన్న టిప్ కూడా ఇచ్చారు. అలాగే ఇంకో టిప్ కూడా. సింకులూ, షవర్‌లు వాటర్‌ని వృథాగా పోనివ్వకుండా కొత్తవాటిని బిగించుకోవాలి– అని!!

epaper.sakshi.com

సాక్షి
ఫ్యామిలీ
సినిమా
నల్లగొండ
ఆదివారం
8-12-2019

# ఖుషీ ఖుషీ స్టెప్స్


● అఖిల్

హైదరాబాద్‌లో స్టెప్స్ వేస్తున్నారు అఖిల్. తనతో పాటు హీరోయిన్ పూజా హెగ్డే కూడా కాలు కదుపుతున్నారు. 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో అఖిల్, పూజా హెగ్డే జంటగా ఓ సినిమా తెరకెక్కుతోంది. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు, వాసు వర్మ నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని శివార్లలో జరుగుతోంది. ప్రస్తుతం చిత్రీకరిస్తున్నది సినిమాలో కీలక సన్నివేశంలో వచ్చే పాట అని తెలిసింది. పూజాతో కలసి ఖుషీ ఖుషీగా స్టెప్స్ వేస్తున్నారట అఖిల్. ఈ పాటకు రఘు మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. గోపీ సుందర్ సంగీత దర్శకుడు.

# అపజయం మంచికే!


● రకుల్‌ప్రీత్ సింగ్

'జీవితంలో ఎదురయ్యే వైఫల్యాలకు కుంగిపోకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లినప్పుడే మనల్ని మరిన్ని విజయాలు పలకరిస్తాయి' అంటున్నారు రకుల్‌ప్రీత్ సింగ్. దక్షిణాదిలో అగ్రకథానాయిక జాబితాలో దూసుకెళుతున్న రకుల్ ప్రస్తుతం బాలీవుడ్‌లోనూ మంచి జోరు మీద ఉన్నారు. జీవితంలో తనకు ఎదురయ్యే వైఫల్యాలను ఎలా ఎదుర్కొంటోంది? అనే విషయం గురించి రకుల్ మాట్లాడుతూ – ''నేను చేయాలనుకున్న పనిని పూర్తి ఆత్మవిశ్వాసంతో మొదలుపెడతాను. నాపై నాకు నమ్మకం ఎక్కువ. అది ఆత్మవిశ్వాసమే. కానీ మితి మీరిన విశ్వాసం కాదు. ఎంత కష్టపడ్డా కొన్నిసార్లు జీవితంలో వైఫల్యాలు మనల్ని పలకరిస్తాయి. అలాంటప్పుడు జీవితం పట్ల భయపడాల్సిన పని లేదు. అవి మన గురించి మనం ఆలోచించుకునే అవకాశాన్ని కల్పిస్తాయి. మన బలాలను గుర్తు చేస్తాయి. అపజయాలు మంచికే! అవి లేకపోతే మనం ఏమీ నేర్చుకోకుండా మిగిలిపోతాం. గమనించుకోవాలే కానీ వైఫల్యాల ద్వారానే మనకు జీవిత పాఠాలు బోధపడతాయి'' అని పేర్కొన్నారు.

# అతి నిద్ర అనారోగ్యం


● శ్రీ సింహా

అలుపు, అసహనం, ఆగ్రహం, ఆరాటం, మతిభ్రమణం.. ఏంటి ఇవన్నీ అనుకుంటున్నారా? ఇవన్నీ అతి నిద్రవల్ల వచ్చే అనారోగ్యాలు. శనివారం 'మత్తువదలరా' చిత్రం టీజర్‌ను ఫేస్‌బుక్ ద్వారా విడుదల చేశారు హీరో రామ్‌చరణ్. టీజర్‌లో శుభోదయం కార్యక్రమంలో అతినిద్ర వల్ల వచ్చే అనర్థాల గురించి డాక్టర్ సలహాలు, సూచనలు వినిపిస్తుంటాయి. టేబుల్‌పై పడుకున్న హీరో మత్తువదిలి నిద్ర లేస్తాడు. ఒక నిమిషం పాటు ఉన్న టీజర్‌లో కంటెంట్ ఇది. సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్. కీరవాణి చిన్న కుమారుడు శ్రీసింహా హీరోగా పరిచయం అవుతుండగా ఆయన పెద్ద కుమారుడు కాలభైరవ ఈ చిత్రంతో సంగీత దర్శకునిగా పరిచయం అవుతున్నారు. రితేష్ దర్శకునిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. చిరంజీవి (చెర్రీ), హేమలతలు నిర్మిస్తున్నారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ – ''రంగస్థలం' సినిమా టైమ్‌లో నేను సింహాతో కలిసి వర్క్ చేశాను. ఆ ప్రయాణం మరచిపోలేనిది. మా నటుల ప్రపంచంలోకి సింహాకు స్వాగతం పలుకుతున్నా. కాలభైరవ విలక్షణ గాత్రానికి నేను పెద్ద అభిమానిని. తన పాటలను వినాలని ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను'' అని అన్నారు. డిసెంబర్ 25న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ– ''యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ చిత్రం నిర్మించాం. హాస్యంతో కూడిన మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ ఇది. ఈ చిత్రం ద్వారా ఎంతో మంది నటీనటులు, సాంకేతిక నిపుణులు పరిచయం కాబోతున్నారు'' అన్నారు.

# డేట్ ఫిక్స్

రామ్‌గోపాల్ వర్మ టైగర్ కంపెనీ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రేక్షకుల ముందుకు రానున్న తాజా చిత్రం 'అమ్మ రాజ్యంలో కడప బిడ్డలు'. రామ్ గోపాల్‌వర్మతో కలిసి సిద్దార్థ తాతోలు దర్శకత్వం వహించిన చిత్రం ఇది. టి. అంజయ్య


● రామ్‌గోపాల్ వర్మ

సమర్పణలో అజయ్ మైసూర్, టి. నరేష్ కుమార్, టి. శ్రీధర్ నిర్మించారు. రివైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ నెల 12న ఈ చిత్రం విడుదల కానుంది. ''ఏ వర్గాన్నీ టార్గెట్ చేసిన చిత్రం కాదు ఇది. ఫ్యాక్షనిజమ్, రౌడీయిజమ్, రాజకీయాల నేపథ్యంలో సాగే కమర్షియల్ ఎంటర్‌టైనర్ ఇది'' అని చిత్ర బృందం వెల్లడించింది. నట్టి క్రాంతి, నట్టి కరుణ ఈ చిత్రానికి సహనిర్మాతలు.

# శుక్రవారం మూడు మ్యాచ్‌లు గెలిచాయి

**- ఉదయ్ శంకర్**


● భూపతిరాజా, ఉదయ్‌శంకర్, నిర్మల్‌కుమార్, శ్రీరామరాజు

''చిన్న సినిమా, పెద్ద సినిమా అనే తేడా లేకుండా కాన్సెప్ట్, కంటెంట్ కొత్తగా ఉంటే ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారు. నాని, శర్వానంద్, విజయ్ దేవరకొండ, వంటి వారు డిఫరెంట్ సినిమాలు చేసి ప్రేక్షకుల ప్రోత్సాహంతోనే ఇప్పుడు మంచి స్థాయిలో ఉన్నారు. వీరిలానే నన్ను కూడా ఆదరించాలని కోరుకుంటున్నా'' అన్నారు ఉదయ్ శంకర్. ఎన్వీ నిర్మల్‌కుమార్ దర్శకత్వంలో ఉదయ్‌శంకర్, ఐశ్వర్యా రాజేష్ జంటగా జి. శ్రీరామరాజు, భరత్ రామ్ నిర్మించిన చిత్రం 'మిస్ మ్యాచ్'. ఈ నెల 6న విడుదలైన ఈ సినిమా సక్సెస్‌మీట్ శనివారం జరిగింది. ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ– ''డిసెంబరు 6న మూడు మ్యాచ్‌లు గెలిచాయి. ఒకటి దిశ ఘటనలో దోషులకు సరైన శిక్ష పడింది. రెండు... టీ20 మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై భారత్ విజయం సాధించింది. మూడు.. 'మిస్ మ్యాచ్' చిత్రం విజయం సాధించింది. మా చిత్రంపై పాజిటివ్ మౌత్‌టాక్ నడుస్తోంది. మా సినిమాకు మంచి రివ్యూస్ వచ్చాయి. ప్రతి రివ్యూలోనూ కంటెంట్, కాన్సెప్ట్ కొత్తగా ఉన్నాయని రాశారు. ఈ క్రెడిట్ కథ అందించిన భూపతిరాజాగారికి దక్కుతుంది. కథను చక్కగా తెరకెక్కించారు నిర్మల్ కుమార్'' అన్నారు. ''నేనీ వేదికపై ఉన్నానంటే కారణం జీవీజీ రాజుగారు. తెలుగులో నేను చేసిన స్ట్రయిట్ మూవీ ఇది. భూపతిరాజాగారు మంచి కథ అందించారు'' అన్నారు నిర్మల్ కుమార్. 'కుటుంబంతో సరదాగా చూసే చిత్రం ఇది. సినిమాలో మంచి సందేశం కూడా ఉంది'' అన్నారు శ్రీరామరాజు. ''అమ్మాయి లక్ష్యం కోసం ఓ అబ్బాయి ప్రేమికుడిగా ఎంత తాపత్రయ పడ్డాడు? అనే అంశం సినిమాలో ఒక హైలైట్ పాయింట్. రెండు కుటుంబాల కథ ఇది'' అన్నారు భూపతిరాజా. నిర్మాత జీవీజీ రాజు, సంగీత దర్శకుడు గిఫ్టన్, కెమెరామేన్ గణేష్, ఎడిటర్ రాజా, రచయిత రాజేంద్రకుమార్ తదితరులు మాట్లాడారు.

# సేఫ్ జానర్‌లో వెళ్లాలనుకోను


● కార్తికేయ

''విభిన్న జానర్స్‌లో సినిమాలు చేయడానికి ఇష్టపడతా. సేఫ్ జానర్ అంటూ ఒకే రకమైన పాత్రలు చేయాలనుకోవడం లేదు. ఎలాంటి పాత్రకైనా కార్తికేయ నటుడిగా న్యాయం చేయగలడు అని రచయితలు నమ్మాలన్నదే నా లక్ష్యం '' అన్నారు కార్తికేయ. శేఖర్‌రెడ్డి ఎర్ర దర్శకత్వంలో కార్తికేయ హీరోగా రూపొందిన చిత్రం '90ఎమ్ఎల్'. అశోక్ రెడ్డి గుమ్మకొండ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న రిలీజైంది. ఈ సందర్భంగా కార్తికేయ చెప్పిన విశేషాలు.

- ఈ చిత్రానికి మంచి స్పందన లభిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ప్రతి రివ్యూలోనూ కార్తికేయ పెర్ఫార్మెన్స్ బాగుందంటున్నారు. సోషల్ మీడియాలోనూ సినిమా గురించి పాజిటివ్ కామెంట్స్ కనిపిస్తున్నాయి. విడుదల రోజు రెండు థియేటర్స్‌కు వెళ్లాను. అక్కడ ఆడియన్స్ క్లాప్స్ కొడుతూ, విజిల్స్ వేస్తూ ఎంజాయ్ చేయడం చూశాక చాలా హ్యాపీ ఫీలయ్యాను. థియేటర్‌లో సినిమా చూడటానికి వచ్చిన ఆడియన్స్ లాజిక్‌లు గురించి ఆలోచించకుండా నవ్వుకోవాలనుకుని ఈ సినిమా తీశాం. అందులో సక్సెస్ అయ్యామనే అనుకుంటున్నాం.
- '90 ఎమ్ఎల్' అని టైటిల్ పెట్టడం వల్ల ఫ్యామిలీ ఆడియన్స్ దూరం అవుతారనుకోవడం లేదు. టైటిల్ ఆసక్తిగా ఉంటుందని సినిమా చూస్తారనుకున్నాం. అలాగే చూస్తున్నారు. ఆర్ఎక్స్ 100, హిప్పి, గుణ 369 చిత్రాల్లో నాకు పెద్దగా డ్యాన్స్ చేసే అవకాశం రాలేదు. అది ఈ చిత్రంతో కుదిరింది. చిన్న సెన్సార్ సమస్య వల్ల సినిమా ఒక రోజు ఆలస్యంగా విడుదలైంది. సినిమాలో ఆల్కహాల్ బ్రాండ్ పేర్లు చెప్పాల్సిన సన్నివేశాల్లోని పదాలను బీప్ చేశాం. ఎటువంటి అసభ్యకరమైన పదజాలం సినిమాలో లేదు.
- నాకు కథ నచ్చే సినిమాను స్టార్ట్ చేస్తా. నా జడ్జ్‌మెంట్ అన్నిసార్లూ సరైన ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు. అప్పుడు తప్పు ఎక్కడ జరిగిందో విశ్లేషించుకుంటాను. నేను ఎంపిక చేసుకున్న కథలతో తెరకెక్కిన సినిమాలు విజయం సాధించినా, సాధించకపోయినా నా ఎంపికల్లో ఒక సర్‌ప్రైజ్ మాత్రం ఉంటుంది.
- 'నానీస్ గ్యాంగ్‌లీడర్'లో నేను చేసిన విలన్ పాత్రకు మంచి స్పందన వచ్చింది. మరిన్ని విలన్ పాత్రలు చేయాలని ఉంది. కానీ అవి నన్ను ఎగ్జైట్ చేసేలా ఉండాలి. ప్రస్తుతం 2 సినిమాల్లో హీరోగా నటిస్తున్నా.













# భగవద్గీత... సన్మార్గానికి చేయూత

**జీవితమంటే ఏమిటి? జీవితం ఇలాగే ఎందుకుంది? ఈ నక్షత్రాలు, గ్రహాలూ ఎందుకున్నాయి? కాలం ఎంతో శక్తిమంతమైనదా? అసలీ ప్రపంచం ఎందుకు సృష్టించబడింది? దేవుడంటే ఎవరు? ఇంత మంది దేవుళ్ళు ఎందుకున్నారు? సమాజంలో మంచివాళ్లకు చెడు ఎందుకు జరుగుతుంది? చెడు చేస్తున్న వారిని నిగ్రహించేవారే లేరా? ఈ ప్రకృతి ఏమిటి? ఇంకా ఎన్నో, ఎన్నెన్నో ప్రశ్నలు...**


నేడు గీతాజయంతి

ఎపుడైనా ఇటువంటి ప్రశ్నలు మీ మదిలో మెలిగాయా? వాటికి సమాధానాలు తెలుసుకోవాలని ప్రయత్నించారా? అవునో, లేదో కానీ ఇటువంటి మరెన్నో సందేహాలకు సంతృప్తికర సమాధానాలతో తాత్వికదర్శనాన్ని అందించే గ్రంథమే శ్రీమద్భగవద్గీత.

వేదసారాన్ని అందించే ఉపనిషత్తులలో మేటియైన ఈ గ్రంథమే గీతోపనిషత్తుగా కూడా ఖ్యాతినొందింది. అసలెందుకు భగవద్గీతకు ఇంత ప్రాముఖ్యత అని అడిగితే అందుకు సమాధానమొక్కటే, అది ఈ సకల చరాచర సృష్టికి మూలకారణమైన దేవాదిదేవుడు సాక్షాత్తు శ్రీ కృష్ణునిచే స్వయంగా ఉపదేశించబడినందుకే. 'కృష్ణస్తు భగవాన్ స్వయం' అంటుంది శ్రీమద్భాగవతం. ధర్మాచరణయందు సందిగ్ధతలో పడి, మనస్తాపంతో చింతామగ్నుడైన అర్జునునికి కర్తవ్యబోధ చేసి అజ్ఞానాన్ని తొలగిస్తూ ఉపదేశించినదే భగవద్గీత. అలా భగవద్గీతను విన్న అర్జునుడు చివర్లో ఈ విధంగా అన్నాడు –

ఓ అచ్యుతా! నా మోహం ఇప్పుడు నశించింది. నీ కరుణతో నా స్మృతిని తిరిగి పొందాను. ఇప్పుడు నేను స్థిరుడను, సందేహరహితుడను అయి నీ ఆజ్ఞానుసారం వర్తించుటకు సిద్ధంగా ఉన్నాను.''**- భగవద్గీత 18.73**

మనం జీవితంలో ఎటువంటి పరిస్థితులలో వున్నా, భగవద్గీతలోని ఉపదేశాలను అనుసరిస్తే మన కర్తవ్య నిర్వహణయందు గల సందేహాలు నివృత్తి అవడమేగాక, దృఢమైన ఆత్మవిశ్వాసంతో జీవితంలో ముందుకెళ్ళగలం. భగవద్గీత అందించే ఆత్మవిశ్వాసం, చేసే పనుల్లో స్పష్టత మరే ఇతర వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలంటూ నేడు నిర్వహిస్తున్న పలు తరగతుల పాఠ్యాంశాలలో సైతం లభించదు. అసలు జీవన నిర్మాణ మూల ఉద్దేశమేమిటో తెలుసుకున్నప్పుడే వ్యక్తిత్వ వికాసమన్నది సాధ్యపడుతుంది. ఆ విషయాలను గీత విపులంగా వివరిస్తుంది.

సమస్త వేదసారాన్ని, భగవతత్త్వాన్ని సమగ్రంగా అందించేదే భగవద్గీత. క్రమం తప్పకుండా పఠించినవాడు ఖచ్చితంగా విజయం సాధిస్తాడు. అయితే వందల రకాల భగవద్గీతలు అందుబాటులో వున్న నేటి తరుణంలో ఒక విశుద్ధభక్తుడు రచించిన గీతను ఎంచుకోవటమే సకల విధాలా శ్రేయస్కరం. బ్రహ్మ–మధ్వ–గౌడీయ పరంపరలో 32వ ఆచార్యులైన శ్రీల ప్రభుపాదులవారు చిన్ననాటినుండే శ్రీ కృష్ణుని విశుద్ధ భక్తులు. శ్రీల భక్తిసిద్ధాంత సరస్వతి ఠాకూరులచే దీక్షను పొందిన వీరు కృష్ణ పరంపర సందేశాన్ని 'భగవద్గీత యథాతథం' గ్రంథంగా రచించారు. భగవద్గీత సందేశాన్ని ప్రపంచమంతటా వ్యాపింపజేశారు

అత్యంత విలువైన భగవద్గీతలోని 700 శ్లోకాలను పారాయణ చేయడం ద్వారా విశ్వశాంతి, లోక కళ్యాణం కలుగుతాయి. అలానే విశ్వమానవ సౌభ్రాతృత్వం, స్నేహభావనలు పెరుగుతాయి. మన లోపల ఉండే ఈర్ష్య, అసూయ, ద్వేషం లాంటి వాటిని జయించగలం. ఈ గీతాజయంతి రోజున ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవడం, చదివించడం వంటి సంకల్పాన్ని పాటించండి.

(5054 సంవత్సరాల క్రితం ఇదే రోజున శ్రీ కృష్ణుని అత్యంత ప్రీతిపాత్రుడైన భక్తుడు అర్జునుడికి భగవద్గీతను ఉపదేశించడం వల్ల దీనిని గీతాజయంతి పర్వదినంగా జరుపుకుంటున్నాం).



భగవద్గీతలోని ముఖ్యమైన 108 శ్లోకాలను తాత్పర్య సహితంగా పారాయణ చేయడం ద్వారా దేవాది దేవుడైన శ్రీ కృష్ణభగవానుడి అనుగ్రహం పొంది శాంతి సౌఖ్యాలు పొందుతారు. గీతా సందేశం ఏదో ఒక మతానికే కాకుండా ఈ విశ్వంలోనే అందరూ సమతా భావాన్ని కలిగి ఐకమత్యంతో కలిసి మెలిసి పని చేసేలా చేయగలదు. నేడు గీతా జయంతి సందర్భంగా ప్రపంచమంతటా ఉత్సవాలు నిర్వహించబడతాయి. 'యత్ర యోగేశ్వరో కృష్ణో...' అని భగవద్గీతలో చెప్పినట్లుగా ప్రతి రోజూ భగవద్గీతను పఠిస్తే సంపద, విజయం, అసాధారణ శక్తి, నీతి నిశ్చయంగా సంప్రాప్తిస్తాయి. భగవద్గీతపై వివిధ రకాలుగా వ్యాపించి ఉన్న అపోహలను విడనాడి, జీవితంలో ఆచరించవలసిన సన్మార్గానికి చేయూతనిచ్చే భగవద్గీతను ఇంటిల్లిపాదీ చదువుకోవచ్చు. కావున, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోగలరని ఆశిస్తున్నాము.

**– సత్యగౌర చంద్ర ప్రభు,**
హరేకృష్ణమూవ్ మెంట్ హైదరాబాద్ అధ్యక్షులు,
అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రాంతీయ అధ్యక్షులు.

నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

# దీప కాంతుల శోభితం అరుణాచలం

తిరుమలలో బ్రహ్మోత్సవాలు, శబరిమలైలో మకరజ్యోతి ఉత్సవం ఎంత వైభవంగా జరుగుతాయో ..... ప్రసిద్ధ శైవక్షేత్రం అరుణాచలంలో కార్తీగ దీపోత్సవాలు అంతటి వైభవంగా జరుగుతాయి. ఈ ఏడాది డిసెంబర్ ఒకటిన మొదలైన ఉత్సవాలు 14వ తేదీ దాకా జరుగుతాయి. అతి ముఖ్యమైన భరణీ దీపాన్ని ఈ నెల 10వ తేదీన అంటే వచ్చే మంగళవారం వెలిగిస్తారు. ఆ రోజు సాయంత్రం అరుణాచలం కొండ మీద అత్యంత భారీగా దివ్య జ్యోతి దర్శనం ఇస్తుంది. పున్నమి రాత్రుల వెన్నెలతో పోటీ పడుతూ వెలిగిపోయే దివ్య జ్యోతి కాంతుల్ని దర్శించుకొనేందుకు లక్షల సంఖ్యలో భక్తులు అరుణగిరికి పయనం అవుతున్న తరుణం ఇది. దాదాపు 10, 12 కిలోమీటర్ల దూరం వరకు ఈ జ్యోతి దర్శనం ఇస్తుందంటే అతిశయోక్తి కాదు.



దాదాపు రెండు వారాల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో అనేక విశిష్టతలు గోచరిస్తాయి. వీటినే కార్తీక బ్రహ్మోత్సవాలు అనికూడా అంటారు. ఇందులో మొదటి రోజున అంటే ఈ ఏడాది డిసెంబర్ ఒకటిన .. అరుణాచలేశ్వర ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం ప్రారంభమయింది. అనంతరం పంచమూర్తుల ఊరేగింపు. అంటే వినాయకుడు, కుమారస్వామి, చండీశ్వర స్వామి సహా పార్వతీ పరమేశ్వరుల ఊరేగింపు జరిగింది. అదే రోజు రాత్రి అధికార నంది వాహనంపై సోమస్కందమూర్తి మాడ వీధులలో ఊరేగింపు నిర్వహించారు. ఇక ప్రతీ రోజూ రెండు పూటలా ఉదయం సమయంలో చంద్రశేఖరమూర్తిగా, రాత్రి సోమస్కంధ మూర్తిగా ఊరేగింపు నిర్వహిస్తూ వచ్చారు.

ఇక ఎనిమిదో రోజు వచ్చేసరికి ఉత్సవాలు ఊపందుకోవటం జరుగుతుంది. పదో రోజు కార్యక్రమాన్ని దృష్టిలోపెట్టుకొని చాలా మంది భక్తులు ముందుగానే విచ్చేస్తుంటారు. ఎనిమిదో రోజు అంటే నేటి ఉదయం అశ్వవాహనంపై చంద్రశేఖర మూర్తి మాడవీధులలో ఊరేగింపు. సాయంత్రం 4 గంటల నుండి భిక్షాటనమూర్తి మాఢవీధులలో ఊరేగింపు జరుగుతుంది. అదేరోజు రాత్రి పంచ కళ్యాణివాహనంపై సోమస్కందమూర్తి మాడవీధులలో ఊరేగింపు జరుగుతుంది. ఇందులో నాలుగు కాళ్ల కిందకు ఆనని రీతిలో దీన్ని రూపొందించారు. తొమ్మిదోరోజు ఉదయం పురుష మృగ వాహనంపై చంద్రశేఖరమూర్తి మాడవీధులలో ఊరేగింపు. రాత్రి కైలాస రావణ వాహనంపై సోమస్కందమూర్తి మాడవీధులలో ఊరేగింపు జరుగుతుంది. ఇక ఈ సమయానికి నెమ్మదిగా అరుణాచల క్షేత్రం భక్తులతో పోటెత్తుతుంది.



డిసెంబరు 10న ఉదయం 4 గంటలకు అరుణాచలేశ్వర ఆలయంలో భరణీదీపం వెలిగిస్తారు. ఈ రోజంతా భక్తుల పూజలతో క్షేత్రం మార్మోగిపోతుంది. అదేరోజు సాయంత్రం 6 గంటలకు అరుణగిరి మీద మహాదీపం వెలుగుతుంది. దీనిని దీపనాడార్ వంశస్తులు తీసుకొని రావటం సాంప్రదాయం. 600 మీటర్ల ఒత్తితో 2500 కేజీల ఆవు నెయ్యితో అత్యంత వైభవంగా మహాదీపోత్సవం కాగానే అరుణగిరి కోటి కాంతులతో ధగధగాయమానంగా వెలిగిపోతుంది. ఈ వైభవాన్ని చూసేందుకు వెయ్యికనులు చాలవంటే అతిశయోక్తి కాదు. ఈ రోజున జరిగే ఊరేగింపును చూస్తుంటే ఒడలు పులకించిపోవటం ఖాయం. అగ్ని రూపుడైన అరుణాచలేశ్వరుడు దేవేరితో కలిసి అరుణ కాంతులతో వెలిగిపోతూ దర్శనం ఇస్తారు. అరుణాచల శివ అంటూ భక్తులు స్వామి వారిని పిలుస్తూ ఊరేగింపులో పాల్గొంటారు. ఆ సమయంలో జరిగే గిరి ప్రదక్షిణ అద్భుతమైనది. వేలమంది ఒక్కసారిగా కదులుతూ గిరిని ప్రదక్షిణం చేసుకొంటారు.

తర్వాత 11వ రోజున అయ్యాన్ కొలనులో చంద్రశేఖరమూర్తి తెప్పోత్సవం. 12వరోజున పరాశక్తి తెప్పోత్సవం, 13వ రోజున సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తెప్పోత్సవం, 14వ రోజున చండికేశ్వరుని తెప్పోత్సవంతో కార్యక్రమం ముగుస్తుంది. వాస్తవానికి అరుణాచల క్షేత్రంలో ఎన్నెన్నో అద్భుతాలు గోచరిస్తాయి. అగ్ని లింగ రూపంలో స్వామివారు, అందరినీ అనుగ్రహించే అమ్మవారు, పర్వత రూపంలో నిలిచిన పరమాత్మ, కలియుగంలో మార్గదర్శనం చేసిన రమణ మహర్షి ఆశ్రమం కనిపిస్తాయి. కావ్యకంఠ మహాముని ముక్తినొందిన క్షేత్రం ఇది. అందుచేత అరుణాచల దర్శనం సకల పాప హరణం అని చెప్పుకోవచ్చు.

**– వై. రమ విశ్వనాథన్**
సీనియర్ పాత్రికేయులు

సువార్త

# పరలోకపు తండ్రి చేసేది వ్యవసాయం!!

యేసుప్రభువు వ్యవసాయ పరిభాషను తన బోధల్లో విస్తృతంగా వాడాడు. ఆయన బోధలు ప్రజల్లో అందుకే అంత బలంగా నాటుకున్నాయి. సిలువశిక్షకు తాను సిద్ధపడుతూ తదనంతర పరిణామాలకు తన శిష్యులను కూడా సిద్ధం చేస్తున్న కీలక సమయంలో 'నా తండ్రి వ్యవసాయదారుడు' అంటూ ఒక అద్భుతమైన పరలోక వివరణను యేసుప్రభువిచ్చాడు(యోహాను15:1). పగలనక, రాత్రనక తాను ఎందుకు అంతగా శ్రమిస్తున్నాడో ఆ ఒక్క మాటలో యేసుక్రీస్తు వివరించాడు. ఆధునికత ఎంతగా ప్రబలినా, మనిషికి ఆకలెయ్యక మానదు, దాన్ని తీర్చే ధాన్యాన్ని రైతు పండించకా తప్పదు. అందువల్ల రైతు లేని ప్రపంచాన్ని ఇంకొక లక్ష ఏళ్ళ తర్వాత కూడా మనం ఊహించుకోలేం. కష్టాలు, కన్నీళ్లు, శ్రమ, త్యాగం లేని రైతు నిస్వార్థ జీవితాన్ని కూడా మనం ఊహించుకోలేము. ఈ లోకంలో రైతుకొక్కడికే అందరిలాగా వారాంతపు సెలవులుండవు, నిర్ణీత పనివేళలూ ఉండవు. అతని ఆరోగ్యానికి భరోసా ఉండదు, కాయకష్టానికి పరిమితులుండవు, పొలంలో రాత్రి పూట విషసర్పం కాటేసినా పట్టించుకునే నాథుడుండడు. ఎండా, వానా, చలి, వరదలు, భూకంపాల పేరిట అంతటా, అందరికీ సెలవులుంటాయి, ఒక్క రైతుకు తప్ప. చంటి బిడ్డలను రెండేళ్లు జాగ్రత్తగా సాకితే, పెరిగి ప్రయోజకులై తమకు ఆసరాగా ఉంటారన్న భరోసా తల్లిదండ్రులకు ఉండొచ్చు. రైతుకా భాగ్యం లేదు. దుక్కి, దున్ని, విత్తనం వేసిన నాటి నుండి, కోతలు ముగిసి ధాన్యం ఇంటికి చేరేదాకా, అంటే మొదటి నుండి చివరి దాకా నిద్రాహారాలు మానేసి రైతు తన పంటను చంటి బిడ్డ లాగా సాకవలసిందే. ఇంత కష్టపడ్డా, పంట చేతికొచ్చే సమయానికి అకాల వర్షం, వరదలొస్తే, భోరున ఏడవాల్సిందే. చేసిన అప్పు తీర్చలేక, మరోవైపు లోకమంతటికీ అన్నం పెట్టేవాడై ఉండీ, తన ఇంట్లోనే భార్యాపిల్లలు పస్తులుండటం చూడలేక కుమిలిపోతూనే, మరో పంట కోసం శ్రమించేందుకు రైతు సిద్ధపడాల్సిందే!!



'నేను నా పరలోకపు తండ్రి అలాంటి రైతులం, కాబట్టి నా నామాన్ని ధరించిన మీరంతా రైతులే!! అన్నది విశ్వాసులకు ప్రభువు ఆనాడు చేసిన బోధ సారాంశం. ఎందుకంటే, తమ రక్షకుడి లాగే, ఆయన శిష్యులు కూడా రైతుల్లాగా కష్టపడకపోతే, 'ప్రేమసువార్త' భూదిగంతాలకు చేరదు. పంటను కాపాడుకోవడానికి రైతు ఎంతటి త్యాగానికైనా, శ్రమకైనా సిద్ధపడినట్టే, ఈ లోకాన్ని శాంతితో, సదాశయాలతో నిండిన పరలోకానికి సాదృశ్యమైన దేవుని రాజ్యంగా మార్చడానికి తన కుమారుడైన యేసుప్రభువును ఈ లోకానికి పంపేందుకు పరమతండ్రి త్యాగం చేసినట్టే, పాపుల కోసం సిలువలో తన ప్రాణాన్నే బలియాగంగా సమర్పించే త్యాగం చేసి రక్షకుడైన యేసుక్రీస్తు తన ప్రేమను చాటుకున్నాడు. ఎటొచ్చీ ఈ రైతులిద్దరిలాగే, నిండా త్యాగాలుండాల్సిన విశ్వాసులు, పరిచారకుల జీవితాలు, పరిచర్యలు ఈ రోజుల్లో విలాసాలు, భోగాల్లో మునిగి తేలుతున్నాయి. నక్కలకు బొరియలున్నాయి, ఆకాశ పక్షులకు గూళ్లున్నాయి కాని నాకు తల దాచుకోవడానికి కూడా స్థలం లేదని ఎంతో సంతృప్తి, ఆత్మానందం, జీవన సాఫల్యంతో గౌరవప్రదంగా, పారదర్శకంగా ప్రకటించిన యేసుప్రభువు అనుచరులుగా చెప్పుకునే వాళ్ళు. ఈనాడు కోట్లకు పడగెత్తుతూ, వస్త్రధారణలో, జీవన శైలిలో, ధనార్జనలో పోటీపడుతూ 'టచ్ మీ నాట్' అన్నట్టు తారల్లాగా వ్యవహరించడం ఎంతో బాధ కలిగించే విషయం. ఇలాంటి వాళ్ళతో ప్రకటించబడేది దేవుని రాజ్యమా, శత్రువు రాజ్యమా? శ్రమ తెలియకుండా తమ కోసం తామే స్వార్థంగా బతికే సెలెబ్రిటీలకు, 'నేను' 'నా' అనే మాటలే ఉండకూడని దేవుని సేవకులకు పోలిక ఏమైనా ఉందా??

**– రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్**
ఈ మెయిల్: prabhukirant@gmail.com

ఇస్లాం వెలుగు

# దయాగుణం

11న గ్యార్వీ సందర్భంగా..

షేఖ్ అబ్దుల్ ఖాదిర్ జీలానీ (ర) దయార్ద్ర హృదయులు. ప్రవక్త (స) బోధలు ఆయన ఆచరణలో ఉట్టిపడేవి. బలహీనులు, అభాగ్యులను ఎంతగానో ఆదరించేవారు. అతిథులు, శిష్యులతో కలిసి కూర్చున్నప్పుడు ఎంతో నిగ్రహంతో వ్యవహరించేవారు. ఒకసారి ఆయన హజ్యాత్రకు బయలుదేరారు. బాగ్దాద్ నగరానికి కొంత దూరాన ఒక ప్రదేశానికి చేరుకున్న తరువాత ఆయన ఒకచోట విడిది చేయాలనుకున్నారు. గ్రామంలో అందరికన్నా ఎక్కువ పేదవాడు, అందరికన్నా ఎక్కువ బలహీనుడు ఎవరో విచారించమని శిష్యుల్ని ఆదేశించారు. ఆ గ్రామంలో ఎందరో భూస్వాములు, శ్రీమంతులు ఆయనకు ఎదురై తమ ఇంట్లో విశ్రాంతి తీసుకోమని స్వాగతించారు. కాని హజ్రత్ ఆ ధనికుల ఆహ్వానాన్ని స్వీకరించలేదు. చాలాసేపు అన్వేషణ జరిపిన తరువాత ఆ ప్రాంతంలో ఒక నిరుపేద ముసలివాడున్నాడని, అతనింట ఒక వృద్ధురాలు, ఒక ఆడపిల్ల తప్ప మరెవరూ లేరని తెలిసింది. ఆయన ఆ వృద్ధుని అనుమతితో అతనింటికి దగ్గర్లో మకాం చేశారు. ఆ ప్రాంతవాసులు నగదు రూపంలో, ధాన్యం రూపంలో, పశువుల రూపంలో షేక్ కు నజరానాలు సమర్పించుకున్నారు. అప్పుడు షేక్ అబ్దుల్ ఖాదిర్ జీలానీ 'నాకు పంపిన ఈ కానుకలన్నీ నేను ఈ వృద్ధ దంపతులకు ఇచ్చేస్తున్నాను' అని అన్నారు. ఆ విధంగా షేక్ ఖాదర్ జీలానీ పుణ్యమా అని ఆ ముసలి దంపతులు రాత్రికిరాత్రే ధనికులుగా మారారు.



**–ముహమ్మద్ ముజాహిద్**
అబ్దుల్ ఖాదర్ జీలానీ (రహ్మలై) వర్ధంతి

ఆలయం ఆగమం

# దేవాలయ వ్యవస్థ

ఆలయాన్ని దర్శించే భక్తులు ఆలయవ్యవస్థ గురించి తెలుసుకోవడం కనీసధర్మం. అందులో ముందుగా.. ఆలయాన్ని నిర్మించే శిల్పులు, స్థపతుల గురించి తెలుసుకోవాలి. వీరి తోడ్పాటు లేనిదే ఆలయనిర్మాణం అసాధ్యం. విశ్వకర్మ సంప్రదాయ పరంపరలోని వీరు శాస్త్రం, సంప్రదాయం అనుసరించి ఆలయం నిర్మించి.. అందులో విగ్రహం స్థాపిస్తారు. అందుకే వారిని స్థపతి అంటారు. శిల్పాచార్యులనే పేరుతో కూడా వీరు ప్రసిద్ధులు. భక్తుడు ఆలయానికి చేసే ఒక ప్రదక్షిణ ఫలం శిల్పాచార్యుడికి చేరుతుందని మయుడు చెప్పాడు. ఆలయనిర్మాణం.. ప్రతిష్ఠ జరిగాక ఆలయాభివృద్ధికి తోడ్పడేవారిలో అర్చకులు ముందుంటారు. లోకహితం కోరి అర్చనాది కైంకర్యాలు జరుపుతూ అర్చకుడే దేవుడి ప్రతినిధి అని.. ప్రజలతో మన్ననలందుకునే అర్చక వ్యవస్థను.. అర్చకులను గౌరవించడం భక్తుల విధి. ఇంకా వేద పారాయణదారులు.. శాస్త్రవిద్వాంసులు.. స్థానాచార్యులు... జ్యోతిష విద్వాంసులు.. గాయకులు.. నృత్యకారులు.. వాద్యకారులు...వైద్యులు..అలంకారికులు.. పరిచారకులు మొదలైన ఎందరో ఆలయవ్యవస్థలో భాగస్వాములు.



**– కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య**
ఆగమ, శిల్పశాస్త్ర పండితులు, ఆగమ, శిల్పశాస్త్ర పండితులు

సత్‌గ్రంథం

## భగవంతునికి అరుదైన అక్షర పుష్పం



భగవంతునికి చేసే పూజను షోడశోపచార పూజ అంటాం. రాజుకు చేసే శుశ్రూష లేక సేవలను రాజోపచారం అంటారు. వేదాంగాలలో కల్పం ఒకటి. పూజలోని విధి విధానాలను తెలిపేదాన్ని కల్పం అంటారు. రాజోపచార పూజాకల్పం అనే పుస్తకంలో వేదాలతో సహా వివిధ రకాల గ్రంథాల ద్వారా భగవంతుని పూజ చేశారు. దైవానికి రకరకాలైన పూజలు చేస్తారు కానీ ఇలా గ్రంథాల ద్వారా సేవ చేయడం చాలా అరుదు. అటువంటి అరుదైన సేవ చేశారు మహాకవి, పండితులైన శాస్త్రుల విశ్వనాథ శర్మ. పూజ చివరలో దైవానికి నీరాజనం సమర్పించినట్టే ఆయన ఈ పుస్తకం చివరలో ఉత్తర నీరాజనం ద్వారా పరమాత్మకు అక్షరాంజలి సేవ సమర్పించారు. అన్నమయ్య సాహితీ పరిశోధకులు డా. తాడేపల్లి పతంజలి వ్యాఖ్యానం చేశారు ఈ పుస్తకానికి. ఇలా కూడా భగవంతునికి పూజ లేదా సేవ చేయవచ్చునని ఈ పుస్తకం ద్వారా రచయిత తోటి సాహితీవేత్తలకు, పండితులకు మార్గదర్శనం చేసినట్లయింది.

శ్రీరాజోపచారపూజాకల్పము
రచన: శాస్త్రుల విశ్వనాథ శర్మ
పుటలు: 80 ; వెల రూ. 51 (తపాలా ఖర్చులతో సహా)
ప్రతులకు: డా. తాడేపల్లి పతంజలి;
ఫోన్ నం. 77805 41502

గురు సన్నిధి

# శ్రీ గురుదత్తాత్రేయుడు


నేడు దత్తజయంతి

లోకానికి జ్ఞానకాంతులను ప్రసరింపజేసేందుకు అవతరించిన గురుమూర్తి దత్తాత్రేయుడు. జన్మసంసార బంధనాలను సులువుగా వదిలించి, జ్ఞానానందాన్ని పంచుతూ, ముక్తి పథంలో నడిపించి మోక్షాన్ని ప్రసాదించగలిగిన పరమ యోగీశ్వరుడు దత్తాత్రేయుడు. ఈయన అవతార వర్ణన నారదపురాణం, శాండిల్యోపనిషత్తు, అవధూతగీత, జీవన్ముక్తిగీత తదితరాలలో కనపడుతుంది.

**అత్రికుమారా.... దత్తాత్రేయ**

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురు వేరు కారని నిరూపించిన సన్నివేశమే దత్తాత్రేయ ఆవిర్భావం. త్రిమూర్తులే తనకు పుత్రులుగా జన్మించాలంటూ అత్రిమహర్షి–అనసూయ దంపతులు చేసిన తపస్సుకు మెచ్చి బ్రహ్మ అంశతో చంద్రుడు, రుద్రాంశతో దూర్వాసుడు జన్మించగా, విష్ణు అంశతో అవతరించినవాడే దత్తాత్రేయుడు! 'దత్తా' అనే పదానికి 'సమర్పించిన' అని అర్థం. త్రిమూర్తులు అత్రి–అనసూయ దంపతులకు పుత్రుడి రూపంలో తమను తాము సమర్పించుకున్నారు కనుక దత్తా అని పేరు వచ్చింది. అత్రిపుత్రుడు కాబట్టి 'ఆత్రేయ' అయింది.

**త్రిమూర్తులే శిరస్సులై...**

దిక్కులనే అంబరముగా చేసుకుని, భక్తులనుద్ధరించేందుకు అనేక రూపాలను ధరించిన దత్తాత్రేయుడి మూడుతలలలో నడిమి శిరస్సు విష్ణువుదికాగా.. కుడివైపున శివుడు సద్గురు స్వరూపంగా, ఎడమవైపు బ్రహ్మదేవుడు పరబ్రహ్మస్వరూపమైన శిరస్సుతో భాసిస్తారు. మధ్యభాగంలో అజ్ఞానాన్ని తొలగించే గురుమూర్తిగా శ్రీదత్తుడు ముల్లోకాలను రక్షిస్తాడు.

**ఆధ్యాత్మ సిద్ధి-నిష్కామబుద్ధి**

దేహంపై వ్యామోహాన్ని వదిలి, జడ పదార్థంలా ఉండేవారిని అవధూత అంటారు. ఈ పదానికి అసలైన నిర్వచనంగా మారి దత్తావధూత అయ్యాడు. ఒకానొక సందర్భంలో పద్మాసనుడై, ధ్యానముద్రలో ప్రకాశిస్తూ యోగ విద్యను సాంకృతిమహర్షికి ఉపదేశించి దానిని భోగ–విలాసాలకు ఉపయోగించకూడదని, పరబ్రహ్మను పొందడమే యోగం అంతిమలక్ష్యం అని వివరిస్తాడు. ఆధ్యాత్మ సిద్ధి, నిష్కామబుద్ధి, యోగవిద్య ఇవన్నీ దత్తాత్రేయుని ఉపదేశాల్లో ప్రధానమైనవి.

**దత్తజయంతి**

దత్తుడు ఉదయించిన మార్గశిర పౌర్ణమినే దత్తజయంతిగా జరుపుకుంటారు.'దిగంబరా దత్త దిగంబరా' అంటూ దత్తనామ స్మరణలో గడుపుతారు. దత్తచరిత్ర, అవధూతగీత మొదలైన గ్రంథాల్ని పారాయణ చేస్తారు. భజనలు, సత్సంగాలు నిర్వహిస్తారు.

త్రిపురారహస్యం పేరుతో పరశురాముడికి త్రిపురసుందరీ తత్త్వాన్ని ఉపదేశించాడు దత్తాత్రేయుడు. ఉపాసకులకు ఇది ఎంతో ఉపయుక్తమైన గ్రంథం. దత్తాత్రేయ వజ్రకవచం పఠించడం వలన అన్నిరకాల రక్షణ లభిస్తుంది. దత్తుడి ఆరాధన పితృదోషాలను తొలగిస్తుంది. ధర్మబద్ధంగా ఇహలోక సుఖాలను కోరుకునేవారికి వాటిని అనుగ్రహిస్తూ, వారిని యోగమార్గంవైపు పయనింపజేసే విశ్వగురు దత్తాత్రేయుడు. ఆయన అనుగ్రహిస్తే గురువుతోబాటుగా దైవానుగ్రహమూ లభించినట్లే!

**– అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని**
వేదపండితులు

స్త్రీ వైశిష్ట్యం - 20

# అమ్మ అమ్మే


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

లోకంలో మాతృత్వమనేది సమస్త ప్రాణులలో ప్రకాశిస్తుంది. ఒక ఆడపిల్లి పిల్లల్ని పెడుతుంది. మగపిల్లి వచ్చి ఎక్కడ చెనుకుతుందోనని తన పిల్లల్ని నోట కరుచుకుని వాటికి ఏ మాత్రం అపాయం కలుగకుండా గోడల్ని కూడా ఎక్కి దూకుతూ చాలా ప్రదేశాల్ని మారుస్తూ వాటికి కాపకాస్తూ వాటిని వృద్ధిలోకి తెస్తుంది. ఎవరు నేర్పారు తల్లి పిల్లికి నీ బిడ్డల్ని ఇలా కాపాడుకోవాలని? ఇది మగపిల్లికి చేతకాదు. కోడిపుంజుకు పొదగడం కానీ, ఆపద సమయాల్లో తన ప్రాణాలను అడ్డుపెట్టి పిల్లలను తన రెక్కల కింద భద్రపరచడం కానీ తెలియదు. అది కోడిపెట్టకే సాధ్యం. ఎద్దు పాలివ్వదు, దూడను పోషించదు. కానీ ఆవుకు మాత్రమే అది సాధ్యపడుతుంది. పాల్కురికి సోమనాథుడు చెప్పినట్లుగా... మొగ్గగా ఉన్నప్పుడు బలవంతంగా విప్పి వాసన చూస్తే పసరిక వాసన వస్తుంది. ఆ మొగ్గే పువ్వయ్యేటప్పటికి అందులోంచి సువాసనలు ఎలా వస్తాయో ఎవ్వరికీ తెలియదు.



కన్యగా ఉండగా ఏమీ తెలియని ఒక ఆడపిల్ల మాతృత్వాన్ని పొంది 'అమ్మా' అని పిలిపించుకునేటప్పటికి ఆ బిడ్డని సాకడంలో అన్ని విశేష గుణాలు ఎలా వస్తాయో ఎక్కడినుంచి ఆ వాత్సల్యం వస్తుందో అర్థం కాదు. ఆ మాతృత్వం అనేది స్త్రీలలో లేకపోతే లోకం ఎలా నిలుస్తుంది?

బాల్యంలో బిడ్డడు చేసే దోషాలు అన్నీ ఇన్నీ కావు. స్త్రీకి మంగళసూత్రం ప్రాణంతో సమానం. దాన్ని ఎవడన్నా ముట్టుకున్నాడో చెయ్యి నరికేస్తుంది. అటువంటిది స్తన్యమిచ్చి బిడ్డను పోషించే సమయంలో వాడు అమ్మపాలు తాగుతూ అమ్మమెడలోని మంగళసూత్రాన్ని చేతితో పట్టుకుని గుంజుతుంటాడు. పువ్వుల పొట్లంలోంచి తీసినట్లు వాడిచేతిని విప్పి ముద్దుపెట్టుకుని విడిచిపెట్టేస్తుంది. ఏ గుండెలోంచి స్రవించిన పాలు తాగుతున్నాడో ఆ గుండెల్ని కాలు పెట్టి తంతాడు. అరికాలు ముద్దుపెట్టుకుని క్షమించేస్తుంది మాతృత్వం సమస్త అపరాధాలను క్షమించేస్తుంది.

అందుకే శంకర భగవత్పాదులు ఈ లోకంలో దుర్మార్గుడైన కొడుకుంటాడేమో కానీ, దుర్మార్గురాలైన తల్లి ఉండదంటారు. ఎక్కడ ఉన్నా అమ్మ అమ్మే. ఈ లోకంలో బిడ్డ ఆకలి తల్లి గ్రహించినట్టుగా మరెవ్వరూ గ్రహించలేరు, చివరకు తండ్రి కూడా. బిడ్డడు ఏడిచిన ఏడుపులోని ఆర్ద్రతను బట్టి వాడికి ఆకలేస్తున్నదని పసిగట్టగలుగుతుంది. బిడ్డడు ఆర్తితో పిలిచిన పిలుపు అమ్మకు మాత్రమే వినిపిస్తుంది. కంటికి కనబడే 8 భూతాలతో సహా అన్ని స్వరూపాల్లో ఆయనే ప్రకాశిస్తున్నా అన్నం పెట్టే అధికారాన్ని మాత్రం ఆయన తన భార్య పార్వతీదేవికిచ్చి 'నువ్వు అన్నపూర్ణవి.. లోకాలకు అన్నం పెట్టు' అన్నాడు. కారణం – బిడ్డల ఆకలిని చెప్పకుండానే అమ్మ గ్రహిస్తుంది కనుక. మాతృత్వానికున్న అద్భుత లక్షణం అది. ఇది శిక్షణా కేంద్రాల ద్వారా లభించేది కాదు.

## వార్తల్లో వ్యక్తులు

### సుందర్ చేతికి గూగుల్ రాజ్యం



సరిహద్దులను చెరిపేస్తూ ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చిన ఘనత గూగుల్‌దే. అలాంటి ప్రతిష్టాత్మక కంపెనీ సీఈఓగా ఉన్న భారతీయుడు సుందర్ పిచాయ్.. మరో మెట్టు పైకెక్కారు. గూగుల్‌తో పాటు దాని గ్రూపులోని వివిధ కంపెనీలకు మాతృ సంస్థగా ఉన్న అల్ఫాబెట్‌కు సీఈఓగా కీలక బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటిదాకా అల్ఫాబెట్‌కు సారథ్యం వహిస్తున్న గూగుల్ వ్యవస్థాపకులు సెర్గీ బ్రిన్, లారీ పేజ్ ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నారు.

### ప్లాగింగ్ అంబాసిడర్... బేద్లీ



ప్లాగ్ మెన్ ఆఫ్ ఇండియాగా పిలుస్తున్న రిపూ దామన్ బేద్లీ... ప్లాగింగ్ అంబాసిడర్ ఆఫ్ ఇండియాగా నియమితులయ్యారు. ఫిట్ ఇండియా ఉద్యమానికి స్వచ్ఛభారత్ లక్ష్యాన్ని కూడా చేర్చి... జాగింగ్ చేస్తూ పరిసరాలను పరిశుభ్రం చేస్తూ ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమాన్ని ప్లాగ్ రన్‌గా పిలుస్తున్నారు. 2017లో బేద్లీ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికి 50 నగరాలను చుడుతూ రెండు నెలల్లో 1,000 కి.మీ. కవర్ చేశారు బేద్లీ. 2.7 టన్నుల చెత్తను సేకరించారు.

### మారిషస్ కొత్త అధ్యక్షుడు.. ప్రదీప్ రూపన్



ద్వీపరాజ్యం మారిషస్‌కు కొత్త అధ్యక్షుడిగా పృథ్వీరాజ్‌సింగ్ (ప్రదీప్) రూపన్‌ను జాతీ య అసెంబ్లీ ఎన్నుకుంది. నిజానికి క్కడ ప్రధానిదే అధికారం కాగా.. అధ్యక్షుడ నేది అలంకారప్రాయం మాత్రమే. రూపన్ గతంలో కళలు, సాంస్కృతిక మంత్రిగా పనిచేశారు. ప్రధాని ప్రవింద్‌కుమార్ జగన్నాథ్ సహా మంత్రులంతా రూపన్ పేరును ప్రతిపాదించటంతో... అసెంబ్లీ ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

● జాతీయం

# మానం తీశారు... ఎదిరిస్తే ప్రాణం కూడా!

**ఉన్నావ్ ఘటనపై అట్టుడుకుతున్న దేశం ● సత్వర న్యాయం కోసం నినదిస్తున్న జనం**




ఈ ఘోరాన్ని వర్ణించడానికి అక్షరాలు సరిపోవేమో!!. అత్యాచారానికి గురైనా... చట్టం మీద నమ్మకం కోల్పోలేక న్యాయపోరాటానికి దిగిన ఓ అబల... అందుకు భారీ మూల్యమే చెల్లించింది. మొదట మానాన్ని... చివరకు మంటల్లో ప్రాణాన్ని కూడా కోల్పోయింది. ఏడాది కిందట 2018లో ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో అత్యాచారానికి గురైన ఓ అమ్మాయి ఈ గురువారం ముష్కరుల చేతుల్లో కాలిపోయింది. ఒళ్లంతా కాలి... చికిత్స పొందుతూ... 24 గంటలు తిరక్క ముందే కన్నుమూసింది. ఈ ఘటన మన న్యాయ వ్యవస్థలోని ఎన్నెన్నో లొసుగులను కళ్లకు కట్టింది. ఇలాంటి కేసుల్లోని నిందితులకు బెయిల్ వస్తే... ఎలాంటి దారుణాలకు తెగిస్తారో తెలియజెప్పే చర్చకూ తావిచ్చింది.

గురువారం తెల్లవారుఝామున ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ అత్యాచార బాధితురాలిని ఐదుగురు వ్యక్తులు పెట్రోల్ పోసి తగలబెట్టారంటూ వచ్చిన వార్తలు యావద్భారతాన్నీ దిగ్భ్రాంతికి గురిచేశాయి. ఏడాది కిందట లైంగిక దాడి చేసిన వ్యక్తులు... ఎదురు తిరిగి న్యాయపోరాటం చేస్తోందన్న కక్షతో పెట్రోల్ పోసి తగలబెట్టడానికి తెగబడ్డారంటే మనం ఏ యుగంలో ఉన్నామన్న ప్రశ్నలు తలెత్తక మానవు. 2018 నాటి అత్యాచారానికి... భారీ ఆందోళనల అనంతరం మార్చిలో ఎఫ్ఐఆర్ నమోదు చేయగా... 10 రోజుల కిందటే ప్రధాన నిందితుడు సుభామ్ బెయిలుపై బయటకు వచ్చాడు. గురువారం తన కేసు విషయమై స్వగ్రామం నుంచి రాయ్‌బరేలీ వెళుతున్న బాధితురాలిని... కాపుకాసి ఆమె ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు కొందరు వ్యక్తులు. మంటల్లో చిక్కుకుని 112కి ఫోన్ చేసి రక్షించమంటూ ఆర్తనాదాలు చేశారామె. కాలిన గాయాలతో లక్నో ఆసుపత్రికి... అక్కడి నుంచి ఢిల్లీలోని సప్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. శుక్రవారం రాత్రి కన్నుమూశారామె. తనపై పెట్రోలు పోసి నిప్పంటించిన వారిలో... అత్యాచార నిందితులు ఇద్దరు ఉన్నారని మరణశయ్యపై వాంగ్మూలం కూడా ఇచ్చారు. వారిని పోలీసులు అరెస్టు చేశారు. సంఘటనపై దర్యాప్తునకు ప్రత్యేక బృందాన్ని (సిట్) ప్రభుత్వం నియమించింది.

**మిన్నంటిన ఆందోళనలు...**

నిర్భయ తరువాత ఉన్నావ్ ఘటనపై ఆందోళనలతో దేశ రాజధాని ఢిల్లీ దద్దరిల్లింది. రాజకీయాలకతీతంగా మహిళలు, యువతులు, రాజకీయనాయకులు గొంతు విప్పారు. పార్లమెంటులోనూ, వెలుపలా ఉన్నావ్ ఘటనపై ఆందోళనలు వెల్లువెత్తాయి. ఈ ఘటన పార్లమెంటు ఉభయ సభలనూ కుదిపేసింది. ఉన్నావ్ బాధితురాలికి న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్న ప్రతిపక్షాల ఆందోళనతో పార్లమెంటు అట్టుడికిపోయింది. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఘటనకి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విధాన్ భవన్ వెలుపల ధర్నా చేశారు. ఓ యువతికి రక్షణ కల్పించలేని రోజుని బ్లాక్ డేగా వర్ణించారు. ఘటనపై మాయావతి తీవ్రంగా స్పందించారు. సత్వర న్యాయం జరగాలని డిమాండ్ చేశారు.

**పాతిక లక్షల సాయం...**

ఉన్నావ్ అత్యాచార బాధితురాలి మృతికి నష్టపరిహారంగా ప్రభుత్వం పాతిక లక్షలు ప్రకటించింది. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద ఇల్లు ఇస్తామని కూడా పేర్కొంది. రాజకీయాలతో సంబంధం లేకుండా దోషులెవ్వరైనా కఠినంగా శిక్షిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో పాటు మృతురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా సత్వర చర్యలు తీసుకుంటామని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు. తక్షణ పరిష్కారం కోసం కేసుని ఫాస్ట్ ట్రాక్ కోర్టుకి అప్పగించారు. ఆమె మరణం తీవ్ర విషాదకరమని ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు.

**'దిశ'కి జరిగిన న్యాయం నా కూతురికీ కావాలి..**

హైదరాబాద్‌లో 'దిశ' కేసులో నిందితులను ఎన్‌కౌంటర్లో చంపేసిన విధంగానే... తన కూతురిపై అత్యాచారం చేసి, సజీవ దహనం చేసిన వారినీ శిక్షించాలని ఉన్నావ్ మృతురాలి తండ్రి డిమాండ్ చేశారు. తనకి ఏ సాయమూ అక్కర్లేదనీ, తనకి ఏ ఆర్థిక తోడ్పాటూ అక్కర్లేదని అతను స్పష్టం చేశాడు.

● తెలంగాణ

# అత్యాచారం నుంచి ఎన్‌కౌంటర్ దాకా..!

సాక్షి, హైదరాబాద్

**'దిశ' ఘటనపై ఆగని ప్రకంపనలు**



వెటర్నరీ డాక్టర్ దిశ హత్యాచార ఘటన జరిగి పది రోజులైనా ప్రకంపనలు ఇంకా కొనసాగుతున్నాయి. ఘటన జరిగిన 24 గంటల్లోపే నిందితులను పట్టుకుని రిమాండుకు తరలించిన పోలీసులు, దిశ కుటుంబసభ్యుల నుంచి ఫిర్యాదు స్వీకరణలో అలసత్వంపై విమర్శలు ఎదుర్కొన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు పోలీసులపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. నిందితులు పట్టుబడినా ఘటన జరిగిన తీరుపై రాష్ట్రంతో పాటు దేశ వ్యాప్తంగా నిరసన వెల్లువెత్తింది. 2012లో ఢిల్లీలో జరిగిన నిర్భయ ఘటనను పోలి ఉండటం, నిర్భయ కేసులో ఏడేళ్లుగా నిందితులకు శిక్ష అమలు కాకపోవడంతో దిశ ఘటనలో కఠినంగా వ్యవహరించాలనే డిమాండుకు దేశవ్యాప్త మద్దతు లభించింది. నిందితులను సత్వరమే కఠినంగా శిక్షించాలంటూ రాజధాని ఢిల్లీ మొదలుకుని దేశ వ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. మరోవైపు బాధిత కుటుంబాన్ని సీఎం కేసీఆర్ పరామర్శించకపోవడం విమర్శలకు దారితీయగా, భారత శిక్షాస్మృతిని సవరించాలని మంత్రి కేటీఆర్.. ప్రధానమంత్రి మోదీని కోరడం గమనార్హం. పార్లమెంటులోనూ ఈ ఘటన చర్చకు రాగా, అన్ని పార్టీలు ముక్తకంఠంతో ఖండించాయి. నిందితుల అరెస్టు సమయంలో షాద్‌నగర్ పోలీసుస్టేషన్ ఎదుట గుమికూడిన వేలాది మంది ప్రజలు నిందితులను తమకు అప్పగించాలని, బహిరంగంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉద్రిక్తతల నడుమ కోర్టు ఆదేశాలతో నిందితులను చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు.

**'ఫాస్ట్‌ట్రాక్' పరిణామాలు..**

దిశ ఘటనపై వేగంగా విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసింది. మూడు రోజుల క్రితం విచారణ కోసం నలుగురు నిందితులను కస్టడీకి తీసుకున్న పోలీసులు శుక్రవారం తెల్లవారుఝామున దిశను దహనం చేసిన చటాన్‌పల్లి బ్రిడ్జి సమీపంలో ఎన్‌కౌంటర్‌లో హతమార్చారు. ఘటనపై వివరాలు సేకరించే క్రమంలో దిశను దహనం చేసిన చోట నిందితులు పిస్టల్స్, కర్రలు, రాళ్లతో దాడి చేయడంతో ఆత్మరక్షణ కోసం కాల్పులు జరపాల్సి వచ్చిందని సైబరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనార్ ప్రకటించారు. ఇదిలా ఉంటే ఎన్‌కౌంటర్ ఘటన స్థలంలో గుమికూడిన ప్రజలు పోలీసులపై పూల వర్షం కురిపించగా, దేశ వ్యాప్తంగా తెలంగాణ పోలీసులను ప్రశంసిస్తూ అభినందనలు వెల్లువెత్తాయి. ఎన్‌కౌంటర్‌తో తమకు న్యాయం దక్కకున్నా, ఉపశమనం కలిగిందని దిశ కుటుంబసభ్యులు వ్యాఖ్యానించారు. పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నారంటూ కొన్ని పౌర, మహిళా సంఘాల నుంచి నిరసన వ్యక్తమైంది.

**ఇంకా కొనసాగుతోన్న ఉత్కంఠ**

పంచనామా, పోస్ట్‌మార్టం అనంతరం నిందితుల శవాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించే క్రమంలో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రానికి చెందిన కొన్ని మహిళా, పౌర సంఘాల ప్రతినిధుల లేఖను ప్రజాహిత వ్యాజ్యంగా స్వీకరించిన హైకోర్టు నిందితుల శవాలను ఈ నెల 9వ తేదీ రాత్రి వరకు భద్రపరచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. మరోవైపు జాతీయ మానవ హక్కుల కమిషన్ శనివారం నిందితుల శవాలను చూడటంతో పాటు, ఘటనా స్థలాన్ని సందర్శించింది. దిశ హత్యాచారంతో మొదలైన ప్రకంపనలు నిందితుల ఎన్‌కౌంటర్ తర్వాత కూడా కొనసాగుతున్నాయి.

### రెండు నెలల్లో దర్యాప్తు పూర్తి చేయాలి...



మైనర్లకు సంబంధించిన అత్యాచార కేసుల్లో రెండు నెలల్లో దర్యాప్తు పూర్తి చేయాలంటూ అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకూ, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకూ లేఖలు రాయాలని నిర్ణయించాం. దేశ వ్యాప్తంగా 1023 ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే దేశ వ్యాప్తంగా 704 ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్లో కేసులు విచారణలో ఉన్నాయి.

– రవిశంకర్ ప్రసాద్, న్యాయశాఖ మంత్రి

### మరో ఆడబిడ్డ బలైంది



'న్యాయం కోసం పోరాడే క్రమంలో దేశంలో మరో కూతురు బలైంది. హృదయం ద్రవించుకుపోయే ఘటన ఇది' అని రాహుల్‌గాంధీ ట్వీట్ చేశారు. కాగా, ఉన్నావ్ ఉదంతం నేపథ్యంలో ప్రియాంకా గాంధీ బాధితురాలి కుటుంబాన్ని కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధితురాలికి రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కాగా రేపిస్ట్‌లకు ఉరిశిక్ష కన్నా పెద్ద శిక్ష లేదని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ వ్యాఖ్యానించారు.

### యోగి ఆదిత్యనాథ్ బాధ్యత వహించాలి...



ఉన్నావ్ అత్యాచార బాధితురాలి మృతికి యూపీ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ బాధ్యత వహించాలి. అత్యాచార బాధితురాలు ఎఫ్ఐఆర్ నమోదు చేయమని కోరినప్పుడు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, పోలీసులు ఏమయ్యారు? ఏం చేస్తున్నారు? అత్యాచార నిందితులు ధనికులు కనుకనే పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఈ విషయాన్ని బాధితురాలి సోదరి నాతో తెలిపారు.

– సీపీఎం సీనియర్ నాయకురాలు బృందాకారత్



● ఆంధ్రప్రదేశ్

# అతివలకు అండగా కొత్త చట్టం

**మహిళలపై నేరాలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక చర్యలు**



**సాక్షి, అమరావతి:** మహిళల రక్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టింది. ఇప్పటికే పోలీసు శాఖలో ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. తెలంగాణలో 'దిశ' ఘటన నేపథ్యంలో చట్టాలకు మరింత పదును పెట్టేందుకు కసరత్తు ప్రారంభించింది. డిసెంబర్ 9 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఈ మేరకు 'దిశ' నిర్దేశం చేయనుంది. మహిళలపై నేరాలను పూర్తిగా అరికట్టేందుకు వీలుగా పదునైన చట్టం తీసుకురావాలని ప్రభుత్వం సంకల్పించింది. కీచకుల పీచమణచాలని నిర్ణయించింది. నేరగాళ్లపై కేసుల నమోదు, దర్యాప్తు, విచారణను వేగవంతం చేసేందుకు ఈ కొత్త చట్టం దోహదపడనుంది. మహిళలపై జరుగుతున్న నేరాల నమోదుకు ప్రత్యేకంగా పోలీస్ కౌంటర్లు, కేసుల తీవ్రతను బట్టి ప్రత్యేక దర్యాప్తు బృందాలు, విచారణకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు తదితర అంశాలను ఈ చట్టంలో చేర్చనున్నట్లు సమాచారం.

**మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు**

- ఆపద సమయంలో మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని పోలీసులు కోరుతున్నారు. డయల్ 100, 112, 181 వంటి టోల్ ఫ్రీ నంబర్ల ద్వారా మహిళలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. వాటిపై వెంటనే ప్రతిస్పందిస్తున్నారు.
- మహిళలు సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తం చేసేందుకు ఏపీ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'సైబర్ మిత్ర' కార్యక్రమాన్ని ప్రారంభించారు. సైబర్ నేరాలపై మహిళలు వాట్సాప్ నంబర్ 9121211100 ద్వారా ఫిర్యాదు చేయొచ్చు.
- మహిళామిత్ర, సైబర్ మిత్ర వంటి వినూత్న కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేస్తున్నారు.
- మహిళలపై నేరాలను నియంత్రించే దిశగా పోలీసు శాఖ రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇప్పటికే వెలగపూడి, విశాఖపట్నం, విజయవాడలో సదస్సులు నిర్వహించారు.

# పేద రోగులకు పెద్ద 'ఆసరా'



**సాక్షి, అమరావతి:** దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే అమల్లోకి వచ్చిన సరికొత్త పథకం ఇది. 'ఆరోగ్య ఆసరా' పేరుతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 డిసెంబర్ 2వ తేదీన ప్రారంభించిన ఈ పథకం లక్షలాది మంది పేదలకు పెద్ద వరంగా మారింది. చికిత్స అనంతరం కోలుకునే సమయంలోనూ రోగులకు ఆర్థిక సాయం అందజేయడమే ఆరోగ్య ఆసరా ఉద్దేశం. రోగులకు మెరుగైన వైద్యం అందించడమే కాకుండా కోలుకునే సమయంలో రోజుకు రూ.225, నెలకు రూ.5,000 చొప్పున అందజేస్తున్నారు. ఈ పథకంతో పేద రోగులకు ఎంతో ఊరట లభిస్తోంది.

**48 గంటల్లోనే ఖాతాల్లో సొమ్ము జమ**

పేదలకు పెద్ద పెద్ద జబ్బులొస్తే ఖరీదైన చికిత్సలు పొందలేక ఇక్కట్లపాలయ్యేవారు. ఇప్పుడు ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా చికిత్స పొందగలుగుతున్నారు. చికిత్స తర్వాత నెలల తరబడి విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. వారు కోలుకోవడానికి చాలా సమయం పడుతుంది. అలాంటప్పుడు పనులేవీ చేసుకోలేక, కుటుంబ పోషణ భారమై నానా ఇబ్బందులు పడేవారు. వారి కష్టాలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆరోగ్య ఆసరా' అమలుకు శ్రీకారం చుట్టారు. ఫలానా జబ్బుకు శస్త్రచికిత్స చేస్తే ఎన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలి అనేది ముందే వైద్యులు నిర్ణయిస్తారు. వైద్యులు నిర్ణయించిన మేరకు ఆ రోగి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన 48 గంటల్లోనే అతడి బ్యాంకు ఖాతాలో అధికారులు సొమ్ము జమ చేస్తారు. చికిత్స తర్వాత పనులకు వెళ్లలేక, కుటుంబ పోషణ భారమయ్యే పరిస్థితి ఇక ఉండదని రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నెల నెలా ఇచ్చే సొమ్ముతో తమ అవసరాలు తీరుతాయని చెబుతున్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద అర్హులయ్యే వారంతా 'ఆరోగ్య ఆసరా' సాయం పొందడానికి అర్హులే. 26 స్పెషాలిటీ చికిత్సలు, 836 ఇతర చికిత్సలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తోంది.



**'ఆరోగ్య ఆసరా' పథకం కింద విశ్రాంతి సమయంలో రోగులకు ప్రభుత్వం అందజేసే ఆర్థిక సాయం**

| | | |
|---|---|---|
| రోజుకు | : | 225 |
| 30 రోజులకు | : | 5,000 |
| 40 రోజులకు | : | 7,250 |

● అంతర్జాతీయం

## తీవ్రస్థాయికి వాణిజ్య పోరు!

అదిగదిగో సమసిపోతోందని భావించిన అమెరికా– చైనా వాణిజ్య యుద్ధం మరింత తీవ్రమవుతోందే తప్ప ఉపశమించటం లేదు. చివరకు ఇరువురూ దౌత్య కార్యాలయాలపై ఆంక్షలు విధించుకునే స్థాయికి వెళ్లారు. చైనాకు ప్రపంచబ్యాంకు తక్కువ వడ్డీకి రుణాలివ్వకూడదని ట్రంప్ వ్యాఖ్యానించటం... అమెరికాలోని చైనా ఎంబసీపై ఆంక్షలు విధించటం వంటి చర్యలతో చైనా కూడా అందుకు తగ్గట్టే స్పందించి దౌత్యపరమైన ఆంక్షలు విధించింది. నిజానికి చైనా నుంచి అమెరికా దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై అదనపు సుంకాన్ని విధిస్తూ అమెరికా నిర్ణయం తీసుకోవటంతో ఇరువురి మధ్యా వాణిజ్య యుద్ధం మొదలయింది. చైనా కూడా అదే రీతిలో సమాధానం చెప్పింది. ఈ వాణిజ్య యుద్ధాన్ని తారస్థాయికి చేరుస్తూ... డిసెంబర్ ఆఖరు నుంచి చైనా నుంచి దిగుమతి చేసుకొనే పలు వస్తువులపై అమెరికా నిషేధం కూడా విధించడానికి సిద్ధమయింది.



**రాజకీయాలపైనా ప్రభావం...**

హాంకాంగ్ స్వయం పాలనను సమర్థిస్తూ అమెరికా ప్రభుత్వం తీర్మానం చేసింది. ఇప్పటికే అంతంతమాత్రంగా ఉన్న అమెరికా– చైనా దౌత్య సంబంధాలు... హాంకాంగ్ ప్రజల ఉద్యమానికి అమెరికా మద్దతుతో మరింత క్షీణించాయి. అమెరికా నుంచి చైనాకి ఎలాంటి సహాయ సహకారం అందించేది లేదని ట్రంప్ తేల్చి చెప్పడం చైనాను మరింత రెచ్చగొట్టినట్టయింది. మున్ముందు ఇది ఏ స్థాయికి చేరనున్నదనే అంశాన్ని బట్టి... వాణిజ్య యుద్ధం ఇతర దేశాలకు విస్తరిస్తుందా? లేదా? అన్నది కూడా తేటతెల్లమవుతుంది.

● వీకెండ్ సైన్స్

## మెడి'సీన్' మార్చాలి

మీకు తెలుసా? జబ్బు చేసినప్పుడు మీరేసుకునే యాంటీ బయాటిక్ మాత్రకు లవంగం జోడిస్తే వేగంగా కోలుకోవచ్చు అని! అదెలా అంటారా? ఆ లవంగంలోని కొన్ని రసాయనాలు మందుల సామర్థ్యాన్ని పెంచడం వల్ల అంటారు అర్నా ఇమ్యూనో ఇన్‌గ్రేడియంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ సైంటిఫిక్ అడ్వయిజర్ డాక్టర్ కె.అనిల్ కుమార్. ఇలాంటివే మరిన్ని ఐడియాలు పంచుకుంటూ ఆయనేమన్నారంటే..

'రోజువారీ సమస్యలకు వెంటవెంటనే మందులేసుకోకండి. అందుబాటులో ఉన్న ఏ మందైనా సరే.. కొద్దోగొప్పో దుష్ప్రభావాలు ఉంటాయి. కాబట్టి ముందు వంటింటి చిట్కా వైద్యం ఉపయోగించండి. ఎంతకూ తగ్గడం లేదా? అప్పుడే వైద్యుడి దగ్గరకు వెళ్లి వారి సూచనల మేరకే మందులు వాడండి. ఇక్కడ ఒక్క విషయం చెప్పాలి. రోగం వచ్చిన తరువాత ఏ మందు వేసుకోవాలో తెలుసుకోవడం కంటే సమస్య రాకుండా నిరోధించడం మేలన్నది నేను పనిచేసే షాపూర్‌జీ పల్లోంజి గ్రూపు అనుబంధ సంస్థ అయిన మిస్త్రీ వెంచర్స్ ఉద్దేశం. అందుకే ఈ రంగంలో మేం రెండేళ్లుగా పరిశోధనలు చేస్తున్నాం. ఆహారం ద్వారా శరీరానికి అందే విటమిన్లు, ఖనిజాలతోపాటు న్యూట్రాస్యూటికల్స్ (సూక్ష్మ పోషకాలు) ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయి. వీటికి ఔషధ మొక్కల నుంచి తీసే ఫైటో ఆక్టివ్ మూలకాలకూ తేడా ఉంది. న్యూట్రాస్యూటికల్స్ రోజువారీ ఆహార పదార్థాల నుంచి సేకరించిన రసాయనాలు. ఆయుర్వేదంలో అనుపానం అనే ఓ మాట వాడతారు. మరో పదార్థంతో చేరినప్పుడు దాని పనితీరులో మార్పులు చేసేదాన్ని అనుపానమంటారు. ఆయుర్వేదంలో మందుతోపాటు పథ్యం కూడా చేయాలి. దీనివల్ల మందు ప్రభావం పెరుగుతుంది. న్యూట్రాస్యూటికల్స్‌లో ఇలా మందు ప్రభావాన్ని పెంచేవి ఏమేమున్నాయో మేం ఆధునిక సైన్స్ పరిధిలో గుర్తిస్తున్నాం.'

**‘స్పెషలిస్ట్’ ముద్ర నాకొద్దు: కోహ్లి**

తొలి టి20లో అద్భుత ఇన్నింగ్స్‌తో పొట్టిఫార్మాట్‌లో తన అత్యధిక స్కోరు నమోదు చేసిన భారత కెప్టెన్ విరాట్ కోహ్లి ఇన్నింగ్స్ ఆరంభంలో కాస్త నెమ్మదిగా ఆడిన సంగతి తెలిసిందే. అయినంత మాత్రానా తన బ్యాటింగ్‌లో ఎలాంటి మార్పులు చేసుకోనని అంటున్నాడు. తాను మూడు ఫార్మాట్లలో ఆడే ప్లేయర్‌నని, ప్రత్యేకంగా ఒక ఫార్మాట్ కోసం బ్యాటింగ్ స్టయిల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చుకోనని స్పష్టం చేశాడు. ‘నా ఆట తీరును మార్చుకోవాలని అనుకోవట్లేదు. నేను వన్డే, టెస్టు, టి20 ఇలా మూడు ఫార్మాట్లలోనూ రాణించాలనుకుంటా. కాబట్టి ప్రత్యేకంగా ఒక ఫార్మాట్ కోసమంటూ ఆటతీరులో మార్పులు చేసుకోలేను. ‘ఫార్మాట్ స్పెషలిస్టు’గా ఉండాలనుకోవట్లేదు. భారీ లక్ష్యాన్ని ఛేదిస్తున్నప్పుడు కచ్చితంగా ఒత్తిడి ఉంటుంది. వరుసగా కొన్ని బంతులకు పరుగులు రానప్పుడు.... కచ్చితంగా చివర్లో ధాటిగా షాట్లు ఆడాలి. అదే నేను చేస్తుంటా’ అని కోహ్లి వివరించాడు. టి20 ఫార్మాట్‌లో మొత్తం 12 ‘మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డులను అందుకున్న కోహ్లి, అఫ్గానిస్తాన్ ప్లేయర్ నబీతో కలిసి ఈ జాబితాలో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు.

# విజేత ప్రజ్ఞానంద

**లండన్ క్లాసిక్ ఓపెన్ చెస్ టోర్నీ**



**చెన్నై:** భారత చెస్ వండర్‌కిడ్ ప్రజ్ఞానంద అంతర్జాతీయ వేదికపై మరోసారి మెరిశాడు. తమిళనాడుకు చెందిన 14 ఏళ్ల ఈ కుర్రాడు ప్రతిష్టాత్మక లండన్ క్లాసిక్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో చాంపియన్‌గా అవతరించాడు. నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద, ఆంటోన్ స్మిర్నోవ్ (ఆస్ట్రేలియా) 7.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంక్‌ను వర్గీకరించగా ప్రజ్ఞానందకు టాప్ ర్యాంక్ ఖాయమైంది. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ అరవింద్ చిదంబరం 7 పాయింట్లతో మూడో స్థానాన్ని సంపాదించాడు. ఈ ఏడాది ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్ అండర్–18 విభాగంలో విజేతగా నిలిచిన ప్రజ్ఞానంద లండన్ క్లాసిక్ టోర్నీలో అజేయంగా నిలిచాడు. ఆరు గేముల్లో గెలిచిన అతను, మిగతా మూడు గేమ్‌లను ‘డ్రా’ చేసుకున్నాడు. ఎచ్ సిల్వయిన్, బ్రోజెల్ సాచా, రిచర్డ్ బేట్స్, రేమండ్ సాంగ్, మార్టిన్ పెట్రోవ్, జూల్స్ ముసార్డ్‌లపై నెగ్గిన ప్రజ్ఞానంద... ఆంటోన్ స్మిర్నోవ్, అరవింద్ చిదంబరం, సహజ్ గ్రోవర్‌లతో గేమ్‌లను ‘డ్రా’ చేసుకున్నాడు.

# మాల్దీవులు 8 ఆలౌట్

- మహిళల టి20 చరిత్రలో రెండో అత్యల్ప స్కోరు
- తొమ్మిది మంది ‘0’కే అవుట్

*పొఖారా (నేపాల్): దక్షిణాసియా క్రీడల మహిళల క్రికెట్ టోర్నమెంట్‌లో మరో అరుదైన ఘనత నమోదైంది. మహిళల టి20 క్రికెట్ చరిత్రలో రెండో అత్యల్ప స్కోరు చేసిన జట్టుగా మాల్దీవులు నిలిచింది. నేపాల్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో మాల్దీవులు జట్టు 11.3 ఓవర్లలో కేవలం 8 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ ఐమా ఐషత్ (1) ఒక్క పరుగు చేయగా... 9 మంది ‘సున్నా’కే అవుటయ్యారు. మిగతా ఏడు పరుగులు ‘ఎక్స్‌ట్రా’ల రూపంలో వచ్చాయి. నేపాల్ బౌలర్ అంజలి చంద్ ఒక పరుగు ఇచ్చి 4 వికెట్లు తీసింద. నేపాల్ 7 బంతులు ఆడి వికెట్ నష్టపోకుండా 9 పరుగులు చేసి గెలిచింది. జూన్‌లో రువాండాతో జరిగిన మ్యాచ్‌లో మాలి జట్టు కేవలం 6 పరుగులకే ఆలౌటై మహిళల టి20 చరిత్రలో అత్యల్ప స్కోరు చేసిన చెత్త రికార్డును తమ పేరిట లిఖించుకుంది.*



రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

# భారత్‌కు ఎదురుందా?

**సిరీస్‌పై కన్నేసిన టీమిండియా • గెలిస్తేనే నిలిచే స్థితిలో విండీస్ • నేడు తిరువనంతపురంలో రెండో టి20**

**టి20 సిరీస్ అంటేనే మెరుపు షాట్లు, భారీ స్కోర్లు, ఓవర్ ఓవర్‌కు మారిపోయే విజయ సమీకరణాలు. పైగా ఆజానుబాహులు ఉండే వెస్టిండీస్ జట్టుతో పొట్టి ఫార్మాట్ అంటే అభిమానులకు పరుగుల విందే. సరిగ్గా శుక్రవారం నాటి మ్యాచ్ ఇలాగే సాగింది. కావాల్సినంత వినోదం పంచింది. సిరీస్ ఆరంభ పోరే ఇంత అద్భుతంగా సాగితే... సిరీస్‌లో నిలవాలంటే కచ్చితంగా వెస్టిండీస్ గెలవాల్సిన స్థితిలో ఈ పోరు మరింత రంజుగా జరుగుతుందనడంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో ఇరు జట్లు రెండో టి20 మ్యాచ్ కోసం సిద్ధమయ్యాయి. కోహ్లి సేన రెండో టి20లోనూ నెగ్గి సిరీస్‌ను సొంతం చేసుకుంటుందా? భారత్‌కు ఎదురునిలిచి, గెలిచి విండీస్ సిరీస్‌ను సమం చేస్తుందా? వేచి చూడాలి.**

**తిరువనంతపురం:** అనుకున్నట్లే జరుగుతోంది. ఎలాంటి సంచలనాలకు తావే లేనట్లుగా అనిపిస్తోంది. ప్రత్యర్థి ఎంత చెలరేగినా... సొంతగడ్డపై తమని నిలువరించేదెవరు అన్నట్లుగా కోహ్లిసేన తొలి టి20 మ్యాచ్‌లో విజృంభించింది. బౌలింగ్, ఫీల్డింగ్‌లో చేసిన పొరపాట్లను మరిచేలా బ్యాటింగ్‌లో వీరవిహారం చేసిన టీమిండియా అదే ఊపులో మరో మ్యాచ్ విజయంపై కన్నేసింది. నేడు వెస్టిండీస్‌తో జరిగే రెండో టి20లో గెలుపొంది మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను 2–0తో ఇక్కడే దక్కించుకోవడంతో పాటు ప్రపంచ చాంపియన్స్‌పై తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలని భావిస్తోంది.

**పొరపాట్లు సవరించుకుంటేనే...**

టి20 ఫార్మాట్‌లో ప్రపంచ చాంపియన్ అయినప్పటికీ భారత్ ముందు వెస్టిండీస్ ఆటలు సాగడం లేదు. టి20 మ్యాచ్‌ల్లో చెలరేగిపోయే కరీబియన్లు భారత్ ముందు తేలిపోతున్నారు. గత 13 నెలల్లో విండీస్‌పై భారత్ సాధించిన విజయాలు దీన్ని నిర్ధారిస్తున్నాయి. 4 నవంబర్ 2018 నుంచి శుక్రవారం నాటి తొలి టి20 మ్యాచ్ విజయంతో కలిపి భారత్ వరుసగా 7 మ్యాచ్‌ల్లో విండీస్‌పై గెలుపొందింది. నిజానికి హైదరాబాద్ మ్యాచ్‌లో పర్యాటక జట్టు ఊహించిన దానికంటే మిన్నగా రాణించింది. అనుభవజ్ఞులు లేని ఆ జట్టు ఏమాత్రం రాణిస్తుందిలే అనుకున్నారంతా. కానీ భారత బౌలింగ్‌ను వేటాడుతూ అలవోకగా పరుగులు సాధించింది. వారి ముందు మన బౌలర్లు తేలిపోయారు. పునరాగమనం చేసిన భువనేశ్వర్ తన ప్రభావం చూపలేకపోయాడు. దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్‌లతో సిరీస్‌లలో ఆకట్టుకున్న స్పీడ్‌స్టర్ దీపక్ చాహర్ అందరికన్నా ఎక్కువగా 56 పరుగులు సమర్పించుకున్నాడు. తాను ఆడిన గత 6 టి20 మ్యాచ్‌ల్లో కేవలం రెండే వికెట్లు తీయగలిగిన స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ శుక్రవారం నాటి మ్యాచ్‌లో తన కోటాను కూడా పూర్తి చేయలేకపోయాడు. ఫీల్డింగ్‌లోనూ అంతంతే అనిపించాడు. స్పిన్నర్లు జడేజా, చహల్ రాణించినా... ఫీల్డింగ్‌లోనూ భారత్ తడబడింది. రోహిత్ శర్మ వరుస క్యాచ్ మిస్‌లతో పాటు సుందర్ ఏమరపాటు ప్రత్యర్థి భారీ స్కోరుకు బాటలు వేసింది. యువ వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఇంకా బ్యాటింగ్‌పై దృష్టి సారించాల్సి ఉంది. బ్యాటింగ్‌లో రాహుల్, కోహ్లి అద్భుత ఇన్నింగ్స్‌తో ఛేదనలో జట్టు గట్టెక్కింది. కానీ ఈ పొరపాట్లే ఒక్కోసారి ఓటమికి కారణమవుతాయనేది మర్చిపోకూడదు.

**బేజారెత్తించిన బౌలింగ్...**

పాపం వెస్టిండీస్. బ్యాట్స్‌మెన్ అద్భుతంగా రాణించారని సంతోషించేలోపే వారి ఆశలు ఆవిరయ్యాయి. బౌలింగ్ దళంలో కాట్రెల్ కాస్త పొదుపుగా పరుగులిచ్చినా మిగతా వారు కోహ్లి, రాహుల్ విజృంభణతో బేలగా మారిపోయారు. కోహ్లిని కవ్వించడం ఎంత ప్రమాదకరమో బౌలర్ విలియమ్స్‌కి చక్కగా బోధపడినట్లుంది. ఓ వైపు విలియమ్స్ ధారాళంగా పరుగులిస్తున్నా... పొలార్డ్ అతనినే కొనసాగించడంతో చివర్లో మ్యాచ్ వారి నుంచి చేజారిపోయింది. జాసన్ హోల్డర్, వాల్ష్ వికెట్లు తీయలేకపోయారు. మరోవైపు భారత్‌పై ఒత్తిడి పెంచాల్సిన కీలక సమయంలో ఎక్స్‌ట్రాల రూపంలో పరుగులు ఇవ్వడం వారి కొంపముంచింది. వీటిని సొమ్ము చేసుకున్న భారత్ పరుగులు చేసి లాభపడింది. కానీ బ్యాటింగ్‌లో హెట్‌మైర్, ఎవిన్ లూయిస్, కీరన్ పొలార్డ్, హోల్డర్, బ్రాండన్ కింగ్ తమ ధాటి చూపించడం వారిలో కచ్చితంగా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి ఉంటుంది. ఇదే ఆత్మవిశ్వాసంతో నేటి మ్యాచ్‌లో మరింత చెలరేగి భారత్ చేతిలో తమ పరాజయాల పరంపరకు బ్రేక్ వేయడంతో పాటు సిరీస్‌లో నిలిచి ఉండేందుకు విండీస్ ప్రయత్నిస్తుందనడంలో సందేహం లేదు. అఫ్గానిస్తాన్‌తో జరిగిన సిరీస్‌లో బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడి నాలుగు మ్యాచ్‌ల నిషేధానికి గురైన నికోలస్ పూరన్ సస్పెన్షన్ ముగిసింది. దాంతో రెండో టి20లో అతను దినేశ్ రామ్‌దిన్ స్థానంలో తుది జట్టులోకి వచ్చే అవకాశముంది.



హెట్‌మైర్, పొలార్డ్

### జట్లు (అంచనా)

**భారత్:** కోహ్లి (కెప్టెన్), రోహిత్ శర్మ, రాహుల్, రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్, శివమ్ దూబే, జడేజా, యజువేంద్ర చహల్, కుల్దీప్, దీపక్ చాహర్, భువనేశ్వర్.

**వెస్టిండీస్:** కీరన్ పొలార్డ్ (కెప్టెన్), అలెన్, బ్రాండన్ కింగ్, దినేశ్ రామ్‌దిన్/నికోలస్ పూరన్, కాట్రెల్, ఎవిన్ లూయిస్, హెట్‌మైర్, కారీ పియరీ, హోల్డర్, హేడెన్ వాల్ష్ జూనియర్, కాస్రిక్ విలియమ్స్.

### పిచ్, వాతావరణం

గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో గతంలో రెండు అంతర్జాతీయ మ్యాచ్‌లు (వన్డే, టి20) జరిగాయి. ఈ మ్యాచ్‌ల్లో పిచ్ స్పిన్నర్లకు సహకరించింది. ఆదివారం చిరుజల్లులు కురిసే అవకాశముంది. ఈ మైదానంలో విండీస్ గతంలో వన్డే ఆడింది. 2018లో జరిగిన ఈ వన్డేలో విండీస్ 104 పరుగులకే ఆలౌటైంది. భారత్ వికెట్ నష్టపోయి లక్ష్యాన్ని ఛేదించింది.

# ‘డోపీ’ సత్నామ్ సింగ్

- నిషిద్ధ ఉత్ప్రేరకం తీసుకున్నట్లు ‘నాడా’ పరీక్షల్లో వెల్లడి
- ఖండించిన భారత బాస్కెట్‌బాల్ స్టార్

**న్యూఢిల్లీ:** భారత్ నుంచి నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎన్‌బీఏ)కు ఎంపికైన తొలి బాస్కెట్‌బాల్ ప్లేయర్‌గా చరిత్ర సృష్టించిన సత్నామ్ సింగ్ భమారా డోపీగా తేలాడు. దక్షిణాసియా క్రీడలకు సన్నాహక శిబిరం సందర్భంగా బెంగళూరులో జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) సత్నామ్ శాంపిల్స్‌ను సేకరించింది. వీటిలో ‘ఎ’ శాంపిల్‌ను పరీక్షించగా ఈ 23 ఏళ్ల పంజాబ్ ప్లేయర్ నిషిద్ధ ఉత్ప్రేరకాన్ని తీసుకున్నట్లుగా పరీక్షలో వెల్లడైంది. దీంతో నవంబర్ 19 నుంచి భమారాపై సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ‘నాడా’ ప్రకటించింది. అయితే దీనిని సత్నామ్ సింగ్ ఖండించాడు. తాను ఎప్పుడూ నిషిద్ధ ఉత్ప్రేరకాలు తీసుకోలేదని, తీసుకోబోనని వ్యాఖ్యానించాడు. ‘నాడా’కు చెందిన ‘డోపింగ్ నిరోధక క్రమశిక్షణా ప్యానల్ (ఏడీడీపీ)’ తన వాదనను వినాలంటూ 7 అడుగుల 2 అంగుళాల ఎత్తున్న సత్నామ్ అభ్యర్థన చేశాడు. ఒకవేళ ఏడీడీపీ అతన్ని డోపీగా నిర్ధారిస్తే ఏకంగా 4 సంవత్సరాల సస్పెన్షన్ విధిస్తారు.



## భారత అమ్మాయిలకు రెండో విజయం

**కాన్‌బెర్రా (ఆస్ట్రేలియా):** మూడు దేశాల జూనియర్ మహిళల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు అజేయ రికార్డు కొనసాగుతోంది. న్యూజిలాండ్‌తో శనివారం జరిగిన రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌లో భారత్ 4–1 గోల్స్ తేడాతో నెగ్గింది. ఈ టోర్నీలో భారత్‌కిది రెండో విజయం కాగా... మరో మ్యాచ్ ‘డ్రా’ అయింది. నేడు ఆస్ట్రేలియాతో భారత్ తలపడుతుంది. కివీస్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత అమ్మాయిలు ఆద్యంతం ఆధిపత్యం చలాయించారు. ప్రతి క్వార్టర్‌లో ఒక్కో గోల్ చేశారు. భారత్ తరఫున షర్మిలా దేవి (12వ, 43వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా... డుంగ్‌డుంగ్ బ్యూటీ (27వ ని.లో), లాల్‌రిన్‌డికి (48వ ని.లో) ఒక్కో గోల్ అందించారు. కివీస్ తరఫున షానన్ ఒలివియా (4వ ని.లో) ఏకైక గోల్ చేసింది.



# స్వర్ణాల్లో సెంచరీ... పతకాల్లో డబుల్ సెంచరీ

- దక్షిణాసియా క్రీడల్లో భారత్ అమేయం
- 214 పతకాలతో అగ్రస్థానంలో
- అన్ని క్రీడాంశాల్లో అదరగొట్టే ప్రదర్శన

**కఠ్మాండు (నేపాల్):** తమ ఏకఛత్రాధిపత్యాన్ని చాటుకుంటూ దక్షిణాసియా క్రీడల్లో భారత్ అదరగొడుతోంది. ఈ క్రీడల చరిత్రలో ఆరోసారి ‘స్వర్ణ’ పతకాల సెంచరీని పూర్తి చేసుకుంది. అదే క్రమంలో మొత్తం పతకాల్లో డబుల్ సెంచరీని దాటింది. ఈ క్రీడల్లో ఏడో రోజు శనివారం భారత్ మొత్తం 49 పతకాలు కొల్లగొట్టగా... అందులో 29 స్వర్ణాలు ఉండటం విశేషం. ప్రస్తుతం భారత్ 110 స్వర్ణాలు, 69 రజతాలు, 35 కాంస్యాలతో కలిపి మొత్తం 214 పతకాలతో ‘టాప్’లో కొనసాగుతోంది. 43 స్వర్ణాలు, 34 రజతాలు, 65 కాంస్యాలతో కలిపి మొత్తం 142 పతకాలతో నేపాల్ రెండో స్థానంలో ఉంది. శనివారం స్విమ్మర్లు, రెజ్లర్లు, షూటర్ల ప్రదర్శనతో భారత పసిడి పతకాల సంఖ్య 100 దాటింది. స్విమ్మింగ్‌లో శ్రీహరి నటరాజ్ (100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్), రిచా మిశ్రా (800 మీ. ఫ్రీస్టయిల్), శివ (400 మీ. వ్యక్తిగత మెడ్లే), మానా పటేల్ (100 మీ. బ్యాక్‌స్ట్రోక్), చాహత్ అరోరా (50 మీ. బ్యాక్‌స్ట్రోక్), లిఖిత్ (50 మీ. బ్రెస్ట్‌స్ట్రోక్), రుజుతా భట్ (50 మీ. ఫ్రీస్టయిల్) స్వర్ణాలు సాధించారు. రెజ్లింగ్‌లో సత్యవర్త్ కడియాన్ (పురుషుల ఫ్రీస్టయిల్ 97 కేజీలు), సుమీత్ మలిక్ (పురుషుల ఫ్రీస్టయిల్ 125 కేజీలు), గుర్‌శరణ్‌ప్రీత్ కౌర్ (మహిళల 76 కేజీలు), సరితా మోర్ (మహిళల 57 కేజీలు) పసిడి పతకాలు సొంతం చేసుకున్నారు. 97 కేజీల ఫైనల్లో పాక్ రెజ్లర్ తబియార్ ఖాన్‌ను సత్యవర్త్ చిత్తుగా ఓడించాడు. ఇక షూటింగ్‌లో మూడు బంగారు పతకాలు లభించాయి. పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో అనీశ్ భన్వాలా... టీమ్ విభాగంలో అనీశ్, భావేశ్, ఆదర్శ్ సింగ్‌లతో కూడిన భారత జట్టుకు... 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో మెహులీ ఘోష్–యశ్ వర్ధన్ జంటకు స్వర్ణాలు దక్కాయి. వెయిట్‌లిఫ్టింగ్‌లో మహిళల 81 కేజీల విభాగంలో సృష్టి సింగ్... 87 కేజీల విభాగంలో అనురాధ బంగారు పతకాలు గెలిచారు.



స్వర్ణంతో రెజ్లర్ సత్యవర్త్



అనీశ్

# అలా మొదలైంది...

**షోయబ్‌తో పరిచయాన్ని గుర్తు చేసుకున్న సానియా మీర్జా**



**న్యూఢిల్లీ:** భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా పెళ్లి అప్పట్లో ఎంతటి సంచలనం సృష్టించిందో కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. పాకిస్తాన్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ షోయబ్ మాలిక్‌తో ఆమె ప్రేమ, పెళ్లి అప్పట్లో రెండు దేశాల్లో చర్చనీయాంశమైంది. అయితే తాజాగా శనివారం జరిగిన ఇండియా టుడే ఇన్‌స్పిరేషన్ కార్యక్రమంలో షోయబ్‌తో తన తొలి పరిచయం గురించి సానియా మీర్జా గుర్తు చేసుకుంది. ఆస్ట్రేలియాలోని హోబర్ట్‌లోని ఒక రెస్టారెంట్‌లో తొలిసారి షోయబ్‌ను కలిశానని చెప్పుకొచ్చింది. ‘క్రీడాకారులుగా మేమిద్దరం ఒకరికొకరం తెలుసు. కానీ తొలిసారి షోయబ్‌ను హోబర్ట్‌లోని ఒక రెస్టారెంట్‌లో సాయంత్రం 6 గంటల సమయంలో కలిశాను. అప్పుడు అక్కడ ఎవరూ లేరు. మా ఇద్దరినీ విధి కలిపిందని అప్పట్లో నేను గట్టిగా నమ్మేదాన్ని. కానీ తర్వాత తెలిసింది ఏంటంటే నేను అక్కడ ఉన్నానని తెలుసుకొని షోయబ్ ప్రణాళిక ప్రకారం నా దగ్గరికి వచ్చారు. ఇదంతా అతని ప్లాన్ అని ఆలస్యంగా తెలుసుకున్నా’ అంటూ సానియా నవ్వులు చిందించింది. 2010 ఏప్రిల్ 12న హైదరాబాద్‌లో సానియా, షోయబ్ మాలిక్ వివాహం జరిగింది.

## నార్త్‌ఈస్ట్ యునైటెడ్ తొలి ఓటమి



**గువాహటి:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఆరో సీజన్‌లో నార్త్‌ఈస్ట్ యునైటెడ్ ఎఫ్‌సీకి తొలి ఓటమి ఎదురైంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో నార్త్‌ఈస్ట్ యునైటెడ్ 0–3 గోల్స్ తేడాతో అట్లెటికో డి కోల్‌కతా చేతిలో పరాజయం పాలైంది. రాయ్ కృష్ణ (35వ, 90+4వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా... డేవిడ్ విలియమ్స్ (11వ నిమిషంలో) గోల్ చేశాడు. ఆట ఆరంభంలో నార్త్‌ఈస్ట్ ప్రధాన ఆటగాడు అసమో జ్యాన్ గాయం కారణంగా మైదానాన్ని వీడటం ఆ జట్టు ఆటతీరుపై ప్రభావం చూపింది. నేటి మ్యాచ్‌లో గోవా ఎఫ్‌సీతో హైదరాబాద్ ఎఫ్‌సీ తలపడుతుంది.

# ఆ మృగాలనూ ఎన్‌కౌంటర్ చేయాలి



కుమురం భీం జిల్లా జైనూర్‌లో ఆందోళనకు దిగిన గ్రామస్తులు



యాదాద్రి జిల్లా బొమ్మలరామారం మండలం హాజీపూర్‌లో బైఠాయించిన బాధిత కుటుంబాలు

## 'ఎల్లాపటార్' ఘటనపై జైనూర్‌లో ఆందోళన

**జైనూర్:** 'దిశ' నిందితుల మాదిరిగానే ఎల్లాపటార్‌లో దళిత మహిళపై అత్యాచారం, హత్య చేసిన నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలని కుమురం భీం జిల్లా జైనూర్‌లో శనివారం స్థానికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. దిశ ఘటనకు ముందే లింగాపూర్ మండలం ఎల్లాపటార్‌లో దళిత మహిళ అత్యాచారం, హత్యకు గురైందని తెలిపారు. అయినా ఇప్పటి వరకూ న్యాయం జరగలేదన్నారు. అగ్రవర్ణ కులస్తులైతేనే స్పందిస్తారా?.. దళిత వర్గానికి చెందిన మహిళకు అన్యాయం జరిగితే పట్టించుకోరా అని ప్రశ్నించారు. పోలీసులకు చేతకాకపోతే తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఎక్కడ అత్యాచారం జరిగిందో.. అక్కడే నిందితులను రాళ్లతో కొట్టి చంపుతామన్నారు. చట్టాలు అన్ని కులాలకు ఒకే రకంగా పనిచేయాలన్నారు. జిల్లా ఎస్పీ వెంటనే స్పందించి నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలన్నారు. ఈ ఆందోళనలో చుట్టుపక్కల మండలాల ప్రజలు సైతం పాల్గొన్నారు. దాదాపు మూడు గంటలపాటు రాస్తారోకో కొనసాగడంతో ఆసిఫాబాద్ డీఎస్పీ సత్యనారాయణ ఆందోళనకారులతో మాట్లాడారు. నిందితులను శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో వారు రాస్తారోకో విరమించారు.

'దిశ' నిందితుల మాదిరిగానే ఆ మానవ మృగాలను ఎన్‌కౌంటర్ చేయాలని ఎల్లాపటార్, హాజీపూర్ ఘటన బాధిత కుటుంబాలు ఆందోళనకు దిగాయి. 'మీకు చేతకాక పోతే మాకు అప్పజెప్పండి' అని డిమాండ్ చేశాయి.

## 'హాజీపూర్' బాధిత కుటుంబాల డిమాండ్

బొమ్మలరామారం: జస్టిస్ ఫర్ దిశ కేసు తరహాలోనే హాజీపూర్‌లో ముగ్గురు బాలికల హత్య కేసులో నిందితుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డిని కూడా ఎన్‌కౌంటర్ చేయాలని బాధిత కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం హాజీపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట వారు నిరసన తెలిపారు. నెలలు గడుస్తున్నా మర్రి శ్రీనివాస్‌రెడ్డికి శిక్ష ఖరారు కాలేదని, తమ పిల్లల ప్రాణాలను బలిగొన్న క్రూరమృగానికి బహిరంగంగా మరణ శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. మర్రి శ్రీనివాస్‌రెడ్డికి వెంటనే శిక్ష పడితే దిశ లాంటి ఘటనలు జరిగేవి కావని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, సైకో కిల్లర్ మర్రి శ్రీనివాస్‌రెడ్డిని పోలీసులు ఎన్‌కౌంటర్ చేయలేకపోతే బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించాలని మృతురాలు కల్పన సోదరి మీనా చెప్పారు. అలాగే.. మానవ మృగం శ్రీనివాస్‌రెడ్డిని ఎన్‌కౌంటర్ చేయాలని, అతని మరణవార్త కోసం ఎన్నో రోజులుగా వేచి చూస్తున్నామని మనీషా తండ్రి మల్లేశ్ పేర్కొన్నారు. ముగ్గురు బాలికల ఉసురు తీసిన శ్రీనివాస్‌రెడ్డిని బహిరంగంగా ఉరి తీయాలని శ్రావణి తల్లి నాగలక్ష్మి అన్నారు. అతనికి పడిన శిక్షతో తప్పుడు పనులు చేసేటోళ్లకు గుణపాఠం కావాన్నారు.

## క్లుప్తంగా...

### బీ ఫార్మసీ విద్యార్థిని అదృశ్యం



ప్రీతి

**భీమారం:** బీ ఫార్మసీ విద్యార్థిని అదృశ్యమైంది. ఈ మేరకు తల్లిదండ్రులు కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన రేబెల్లి ప్రీతి(19) బొల్లికుంటలోని వాగ్దేవి కళాశాలలో బీ ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. హసన్‌పర్తి మండలం రామారం ప్రాంతంలోని చిన్నమ్మ తూర్పాటి దుర్గ వద్ద ఉంటున్న ఆమె రోజూ కళాశాలకు వెళ్లి వస్తుండేది. అయితే, ఈ నెల 5వ తేదీన తాళ్ల పద్మావతి కళాశాలలో పరీక్షలు ఉన్నాయని చెప్పి వెళ్లిన ప్రీతి రాత్రి వరకు ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన చిన్నమ్మ తొర్రూరులో ఉంటున్న ప్రీతి తండ్రి శివకుమార్‌కు తెలిపింది. దీంతో ప్రీతి జాడ కోసం గాలించగా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ డేవిడ్ రాజు తెలిపారు.

### చిన్నారిని చిదిమేసిన స్కూల్ బస్సు



**నడికూడ:** పాఠశాలకు వెళ్తున్న అక్కను బస్సు ఎక్కించి టాటా చెప్పి వెనుతిరిగిన ఆ చిన్నారిని స్కూలు బస్సు చిదిమేసింది. కింద పడిన బిస్కెట్ ప్యాకెట్ తీసుకునేందుకు ఆ చిన్నారి వంగిన క్రమంలో.. చూడకుండా నిర్లక్ష్యంగా డ్రైవర్ బస్సు నడపడంతో చిన్నారి తలపైకి ఎక్కగా ఛిద్రమై కన్నుమూసింది. వివరాలు.. వరంగల్ రూరల్ జిల్లా నడికూడ మండలం రాయపర్తికి చెందిన నెరిపాటి రఘుపతి, లత దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కూతురు సాయిశ్రీ అదే గ్రామానికి చెందిన ఎస్వీ ప్రైవేట్ స్కూలులో ఎల్‌కేజీ చదువుతోంది. శనివారం ఉదయం స్కూల్ బస్సులో సాయిశ్రీని ఎక్కించేందుకు చిన్నకూతురు అశ్వితతో కలసి లత వెళ్లింది. సాయిశ్రీని ఎక్కించే క్రమంలో చిన్న కూతురు అశ్విత (2) చేతిలో ఉన్న బిస్కెట్ ప్యాకెట్ కింద పడిపోయింది. దీంతో చిన్నారి బస్సు దగ్గరి కెళ్లి కిందకు వంగింది. ఈ క్రమంలో డ్రైవర్ గమనించకుండా చిన్నారి మీదుగా బస్సు నడపడంతో వాహనం టైరు చిన్నారి తల మీదుగా వెళ్లడంతో ఛిద్రమై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. కళ్ల ముందు కూతురు ప్రాణాలు కోల్పోవడంతో తల్లి లత గుండెలు బాదుకుంటూ విలపించడం గ్రామస్తులందరిని కలిచివేసింది.

### ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి

**నార్నూర్:** కుటుంబ కలహాలు ఇద్దరిని బలి తీసుకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని గొండుగూడకు చెందిన సీడాం రాంబాయి (22) అత్తింటి వేధింపులు భరించలేక శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వైద్యం కోసం ఆమెను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. రాంబాయి మృతికి కారణం భర్త సీడాం గంగారాం వేధింపులే కారణమని బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపించారు. కోడలి మృతితో ఆందోళనకు గురైన మామ సీడాం బాపూరావు(52) తానూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు నార్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కాగా, ఆయన అక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. సీడాం గంగారాం మొదటి భార్యకు విడాకులిచ్చి ఆరు నెలల కిందట జైనూర్ మండలం పానాపటర్‌కు చెందిన రాంబాయిను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. శుక్రవారం గంగారాం డబ్బులు కోసం రాంబాయిని వేధించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరడంతో ఆమె ఆవేశంలో పురుగులు మందు తాగింది. మృతురాలి తండ్రి ఆత్రం భీంరావు, మృతుడి భార్య సీడాం లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి లడ్డూ ప్రసాదంలో వచ్చిన పురుగు (వృత్తంలో)

### యాదాద్రి లడ్డూలో పురుగు

**యాదగిరిగుట్ట :** తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ తరువాత భక్తులు యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి లడ్డూపైనే అత్యంత ప్రీతి చూపెడతారు. అలాంటి యాదాద్రీశుడి లడ్డూలో శనివారం పురుగులు రావడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన శేఖర్ అనే భక్తుడు దేవస్థానంలో రెండు లడ్డూలను కొనుగోలు చేశాడు. ఇంటికి వచ్చి తిందామని చూసే సరికి అందులో పురుగు గమనించాడు. కాగా, లడ్డూల్లో పురుగులు రావడం గతంలోనూ చాలాసార్లు జరిగాయి. లడ్డూలు తయారు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

# కదిలిన ఆదివాసీ దండు



ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ ఆవరణలో ఆదివాసీల సందడి

**ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ కిటకిట • 9న ఢిల్లీలో అస్తిత్వ పోరాట సభ**

**ఆదిలాబాద్‌టౌన్:** ఆదివాసీ దండు కదిలింది. దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 9న జరిగే ఆదివాసీ అస్తిత్వ పోరాటానికి పయనమైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఆదివాసీలు శనివారం రైలుమార్గం ద్వారా నాగ్‌పూర్‌కు తరలివెళ్లారు. ఇప్పటికే చాలా మంది ప్రత్యేక వాహనాలు, రైళ్ల ద్వారా వెళ్లగా, మిగతా వారు శనివారం బయల్దేరారు. సుమారు 3 వేల మంది వరకు వెళ్లినట్లు ఆదివాసీ సంఘాల నాయకులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశ నలుమూలల నుంచి ఈ సభలో పాల్గొననున్నారు. ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఈ సభ జరగనుంది. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించడం, పోడు భూములకు పట్టాలు, ఏజెన్సీ ప్రాంతంలో నకిలీ ధ్రువపత్రాలను అరికట్టాలనే ప్రధాన డిమాండ్లతో ఈ సభ నిర్వహిస్తున్నారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఆధ్వర్యంలో ఇప్పటికే పలు కార్యక్రమాలు, ఆందోళనలు చేపట్టగా, దేశ రాజధాని ఢిల్లీలో చేపట్టే సభ ద్వారా ఈ విషయం దేశమంతటా తెలిసేందుకు ఆస్కారం ఉంది. ఆదివాసీ అస్తిత్వ పోరాట సభకు ఆదివాసీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కేంద్రమంత్రులు హాజరు కానున్నారని ఆదివాసీ నేతలు చెబుతున్నారు.

**రైల్వేస్టేషన్‌లో సందడి**

ఢిల్లీలో జరిగే అస్తిత్వ పోరాట సభకు తరలివెళ్లేందుకు వచ్చిన ఆదివాసీలతో ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ సందడిగా మారింది. వేలాది సంఖ్యలో ఆదివాసీలు చేరుకోవడంతో రైల్వేస్టేషన్ ప్రాంతం కిక్కిరిసిపోయింది.

**ఇంటెలిజెన్స్ నిఘా**

సభకు ఎంతమంది తరలివెళ్తున్నారనే విషయంపై ఇంటెలిజెన్స్, పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఇప్పటికే ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు కావడంతో అక్కడ జరిగే సభ ఏర్పాట్లను, జిల్లా నుంచి వచ్చే ఆదివాసీల ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు.

### 1.36 క్వింటాళ్ల వెండి పట్టివేత

**జగిత్యాలక్రైం:** అక్రమంగా తరలిస్తున్న 1.36 క్వింటాళ్ల వెండి, రూ.10 లక్షల నగదును పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. జగిత్యాలలోని గాంధీనగర్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా.. తమిళనాడులోని శేలం జిల్లా కేంద్రానికి చెందిన శివానందస్వామి, అర్జున్‌నాన్, ఇద్దరు డ్రైవర్లు మైవెల్, సుందరరాజన్ కారులో వస్తున్నట్లు ఎస్పీ సింధూశర్మ తెలిపారు. అనుమానంతో కారును తనిఖీ చేయగా వెనుక సీటులో రహస్యంగా తరలిస్తున్న 1.36 క్వింటాళ్ల వెండి, రూ.10 లక్షల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నామన్నారు.

# 'రేషన్' సర్వర్ డౌన్..

**చౌక దుకాణాల్లో సాఫీగా పనిచేయని 'ఈ-పాస్'**

**రాష్ట్రవ్యాప్తంగా సరుకుల పంపిణీకి ఆటంకాలు • నిత్యం లబ్ధిదారుల చక్కర్లు**

**సాక్షి, మెదక్:** సర్వర్ సమస్య.. ఈ–పాస్ యంత్రాల మొరాయింపుతో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో సరుకుల పంపిణీకి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఈ నెల ప్రారంభమై ఏడు రోజులు గడుస్తున్నా.. ఇప్పటివరకు సరుకుల సరఫరా పుంజుకోలేదు. దీంతో చౌక దుకాణాల ఎదుట లబ్ధిదారులు రోజుల తరబడి పడిగాపులు కాస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం రేషన్ దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేయడం.. గంటలపాటు నిరీక్షించలేక లబ్ధిదారులు వాగ్వాదాలకు దిగుతుండడంతో డీలర్లు తలపట్టుకుంటున్నారు. ప్రధానంగా సర్వర్ సమస్య తలెత్తడంతో ఏడో తేదీ దాటినా రేషన్ సరుకుల పంపిణీ సాఫీగా సాగడం లేదని డీలర్లు చెబుతున్నారు. నిన్న మొన్నటి వరకు సరుకుల పంపిణీ పూర్తిగా నిలిచిపోగా, శనివారం పలు చోట్ల అంతంత మాత్రంగానే సాగినట్లు సమాచారం.

**తూతూమంత్రంగా..**

రాష్ట్రంలో 17,016 రేషన్ షాపులు, వీటి పరిధిలో సుమారు 85 లక్షల ఆహార భద్రత కార్డులు ఉండగా.. 2.75 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెల సుమారు 1.65 లక్షల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం సర్వర్ సమస్యతో ఈ–పాస్ యంత్రాలు మొరాయిస్తున్న కారణంగా రేషన్ షాపులు అధిక ప్రాంతాల్లో మూసే ఉంటున్నాయి. శనివారం సాయంత్రం నాలుగు గంటల వరకు రాష్ట్రంలో 13,110 రేషన్ దుకాణాలు మాత్రమే తెరుచుకున్నాయి. తెరిచిన దుకాణాల్లో సైతం తూతూమంత్రంగానే సరుకులు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో పలు రేషన్ దుకాణాల్లో ఈ–పాస్ యంత్రాలు ఉదయం 10 గంటల వరకు మాత్రమే పనిచేశాయి.



మెదక్ జిల్లా రామాయంపేటలో ఈ-పాస్ యంత్రం పనిచేయకపోవడంతో రేషన్ దుకాణం వద్ద నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

**రేషన్ షాపులకూ అందని సరుకులు**

అధికారుల్లో ముందుచూపు కొరవడడంతో ప్రజలకు రేషన్ బియ్యం సకాలంలో అందని పరిస్థితి నెలకొంది. మెదక్‌తోపాటు పలు జిల్లాల్లో మండల లెవల్ స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ బియ్యం 30 శాతం మేర ఇంకా చౌక దుకాణాలకు చేరలేదని తెలుస్తోంది. ఈ నెల పంపిణీకి సంబంధించి గత నెల చివరి రోజు లోపే చేరాల్సి ఉండగా పలు సమస్యలతో బియ్యం చేరలేదు. మండలస్థాయి స్టాక్ పాయింట్లలో నిల్వలు నిండుకోవడంతో బియ్యం సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది. ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని ప్రజావసరాలకు మిల్లుల్లో సీఎంఆర్ కింద బియ్యంగా మార్చి గోడౌన్లకు తరలించే ప్రక్రియలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

**చాలా సమయం తీసుకుంటోంది**

మా రేషన్ దుకాణానికి ఈ నెల ఆలస్యంగా.. 4వ తేదీన సాయంత్రం పీడీఎస్ బియ్యం వచ్చింది. గురువారం ఉదయాన్నే రేషన్ షాపు తెరిచాను. ఈ–పాస్ యంత్రం పనిచేయలేదు. శనివారం కూడా ఇబ్బంది పెట్టింది. ఒక్కొక్కరికి చాలా సమయం తీసుకుంది. లబ్ధిదారులు నిరీక్షించలేక గొడవకు దిగుతున్నారు.

– కమ్మరి నాగరాజు, రేషన్ డీలర్, చందూర్, మెదక్ జిల్లా

### సిగ్నల్ పనిచేయడం లేదు



బియ్యం కోసం ఉదయమే వచ్చి రేషన్ షాపు వద్ద కూర్చున్న. సిగ్నల్ లేదని బియ్యం ఇవ్వలేదు. మాకు 24 కిలోల బియ్యం వస్తుంది. సిగ్నల్ వచ్చే వరకు ఉండి తీసుకుపోదామనుకుంటే.. సర్వర్ సమస్యతో సిగ్నల్ పనిచేయడం లేదు. పడిగాపులు పడలేకపోతున్న.

– భిక్షపతి, లబ్ధిదారుడు, చిన్నశంకరంపేట, మెదక్

### పనిచేయని మాట వాస్తవమే



సర్వర్ సమస్యతో ఈ–పాస్ యంత్రాలు పనిచేయని మాట వాస్తవమే. సర్వర్ మారుస్తున్నామని.. పై అధికారులు చెప్పారు. ఈ– పాస్‌లు కొంతసేపే పనిచేస్తున్నాయి. త్వరలో సమస్య పరిష్కారం అవుతుందని అనుకుంటున్నాం. ఈ నెల బియ్యం ఇచ్చే గడువు పెంచే అవకాశం ఉంది.

– శ్రీనివాస్, డీఎస్‌ఓ, మెదక్

### త్వరగా పరిష్కరించాలి



తరచుగా తలెత్తుతున్న సర్వర్ సమస్యను త్వరగా పరిష్కరించాలి. ఇప్పటికే ఏడు రోజులు గడిచాయి. మిగిలిన ఎనిమిది రోజుల్లో పంపిణీ ఇబ్బందిగా ఉంటది. సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకువెళితే.. పరిష్కరిస్తామన్నారు. – రాజు, డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

# తొలి జీరో ఎఫ్‌ఐఆర్

**సుబేదారి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు**

- శాయంపేట మండలం గోవిందాపూర్ బాధితుడి ఫిర్యాదు
- కేసు నమోదైన కొద్ది గంటల్లోనే యువతి ఆచూకీ లభ్యం

**సాక్షి ప్రతినిధి, వరంగల్:** తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి జీరో ఎఫ్‌ఐఆర్ వరంగల్ పోలీసు కమిషరేట్‌లో నమోదైంది. ఓ యువతి అదృశ్యం కేసులో వరంగల్ జిల్లా సుబేదారి స్టేషన్ పోలీసులు ఈ ఎఫ్‌ఐఆర్‌ను నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ రూరల్ జిల్లా శాయంపేట మండలం గోవిందాపూర్‌కు చెందిన బూర రవీందర్ కుమార్తె శ్రీవిద్య (24) శనివారం తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇదే విషయాన్ని రవీందర్.. వరంగల్ కాశిబుగ్గలో నివాసముంటూ పని నిమిత్తం హన్మకొండ సుబేదారి ప్రాంతానికి వెళ్లిన తన తమ్ముడు బూర రాజ్ కుమార్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. వెంటనే అప్రమత్తమైన రాజ్‌కుమార్ సమీపాన ఉన్న సుబేదారి పోలీసుస్టేషన్‌కు వెళ్లి తన అన్న కూతురు కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో స్టేషన్‌లో అందుబాటులో ఉన్న ఎస్ ఐ సత్యనారాయణ వెంటనే జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసుకుని కేసు దర్యాప్తు ప్రారంభించారు. కాగా పోలీసు అధికారులు శ్రీవిద్యను వెతుకుతున్న సమయంలో సాయంత్రం నేరుగా ఆమె సుబేదారి స్టేషన్‌కు వచ్చింది. ఈ విషయాన్ని సుబేదారి పోలీసులు శాయంపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో తండ్రి బూర రవీందర్‌కు సమాచారం అందించిన పోలీసులు.. ఇంటికి చేర్చడంతో కథ సుఖాంతమైంది. కాగా, తెలంగాణ రాష్ట్రంలో మొదటి జీరో ఎఫ్‌ఐఆర్ వరంగల్ పోలీసు కమిషరేట్‌లో నమోదైందని కమిషనర్ వి.రవీందర్ తెలిపారు. ఈ కేసులో సకాలంలో స్పందించిన పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.

# పిల్లలకు నిప్పంటించి.. తల్లి ఆత్మహత్య

- కుటుంబ కలహాలకు ముగ్గురి బలి
- అత్త, భర్తను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘటన



నిహారిక, మణిదీప్తి, కేదార్‌నాథ్ (ఫైల్)

**కొల్లాపూర్:** కుటుంబ కలహాల నేపథ్యంలో తన ఇద్దరు పిల్లలకు నిప్పంటించిన ఆ తల్లి కూడా ఆత్మహత్యకు పాల్పడింది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణం టీచర్స్ కాలనీలోని హారిక (25), మహేశ్ దంపతులు నివాసముంటున్నారు. వీరికి కూతురు మణిదీప్తి (3), కుమారుడు కేదార్‌నాథ్ (1) ఉన్నారు. మహేశ్ పెంట్లవెల్లి పట్టణంలో మొబైల్ దుకాణం నడుపుతున్నాడు. కాగా, శుక్రవారం రాత్రి కుటుంబ సమస్యలపై నిహారిక, అత్త మంగమ్మ గొడవ పడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన కోడలు శనివారం ఉదయం ఇంట్లోనే తన ఇద్దరు చిన్నారులతో పాటు తానూ నిప్పంటించుకుంది. దీంతో తల్లి, కూతురు అక్కడికక్కడే మృతి చెందారు. కుమారుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే చనిపోయాడు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని ఎస్పీ అపూర్వారావు, నాగర్‌కర్నూల్ డీఎస్పీ మోహన్‌రెడ్డి, కొల్లాపూర్ సీఐ వెంకటరెడ్డి పరిశీలించారు. నిహారిక అత్త, భర్తను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.


తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ
Rc. No.263/2019/D1 ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త ప్రకటన తేది: 06.12.2019
పనుల సంఖ్య (10), పనుల వివరణ: 2019–20 కాలంలో దమ్మపేట రేంజ్‌లోని BC-I నాగుపల్లి, తిరుమలకుంట, దురదపాడు, అశ్వారావుపేట రేంజ్‌లోని BC-I కంట్లమ్, ములకలపల్లి రేంజ్‌లోని BC-I పొగళ్లపల్లి నుండి లాంగ్ బాంబూ ఎక్స్‌ట్రాక్షన్, 2019–20లో BC-I నాగుపల్లి నుండి దమ్మపేట రేంజ్‌లోని GTD అర్ధపెంట వరకు రవాణ, ఇతర అన్ని పనులకోసం దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: రూ.1.10 కోట్లు, బిడ్ దాఖలు ప్రారంభ తేది, సమయం: 11.12.2019న ఉ.10.30 గం. బిడ్ దాఖలుకు ఆఖరి తేది, సమయం: 31.12.2019న సా.4.00 గం. వరకు. తెరుచు తేది, 31.12.2019న సా.4.10 గం. తదుపరి వివరాలను ఇ–ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ www.eprocurement.gov.in లో చూడవచ్చును. ఫోన్ నం.08744–295050.
సం/– డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
DIPR RO.No.1899-DP/CL/Advt/1/2019-20, Dt: 07.12.2019



తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
NIT No. 12/TS/ATO/EE/R&B/MLG/2019-2020/ తేది: 04.12.2019
పనుల సంఖ్య (06). పనుల వివరణ: ములుగు జిల్లాలోని ములుగు గ్రామంలో (G+2) 2BHK ఫ్లాట్స్ (24 నం.లు) నిర్మాణము. ప్యాకేజ్–1, 2, 3 (3వ పిలుపు). జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో టేకుమట్ల మండలంలోని గరిమిల్లపల్లి గ్రామంలో 2BHK (10 నం.లు) మరియు కాలికోట గ్రామంలో (5 నం.లు) నిర్మాణము (3వ పిలుపు), రేగొండ మండలంలోని పొనగండ్ల గ్రామంలో 2BHK (5 నం.లు) నిర్మాణము (2వ పిలుపు), టేకుమట్ల మండలంలో రామకిష్టాపూర్ గ్రామంలో 2BHK (10 నం.లు) మరియు రాఘవాపూర్ గ్రామంలో 2BHK (10 నం.లు) నిర్మాణము (2వ పిలుపు). మొత్తం ECV: 5.64 కోట్లు. టెండరుదారులు టెండరు షెడ్యూళ్ళను ఇ-మార్కెట్ ప్లేస్ అంటే https://tender.telangana.gov.in నుండి 09.12.2019న సా. 4.00 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. పై పనుల కోసం టెండర్ల స్వీకరణకు ఆఖరి తేదీ మరియు సమయం: 17.12.2019న లేదా అలోగా మ. 3.30 గం.కు.
సం/– డిస్ట్రిక్ట్ (R&B) ఆఫీసర్, (ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్) JS భూపాలపల్లి జిల్లా, ములుగు
DIPR.Ro.No. 1898-DP/CL/ADVT/1/2019-20, Dt 07/12/2019



తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ
వారి పర్యవేక్షణలో రాష్ట్ర వ్యాప్తంగా
జాతీయ లోక్ అదాలత్
14th శనివారం, డిసెంబర్, 2019 నాడు
ప్రతి కోర్టు ప్రాంగణంలో నిర్వహించబడుతోంది
అన్ని రకాల సివిల్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటారు ప్రమాద పరిహార కేసులు వగైరాలు పరిష్కారానికై ఈ లోక్ అదాలత్ నిర్వహించబడుతోంది.
లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకొనుట ద్వారా సామరస్యపూర్వకమైన పరిష్కారాన్ని వేగవంతముగా పొందడంతో పాటు చెల్లించియున్న కోర్టు ఫీజును వాపసు పొందవచ్చును.
రాజీ మార్గమే రాజ మార్గము
కోర్టులలో అనగా సుప్రీంకోర్టు నుండి క్రింది స్థాయి కోర్టులన్నింటిలో పెండింగ్‌లో ఉన్న కేసులను తేది.14.12.2019 (శనివారం) నాడు జరగబోవు జాతీయ లోక్ అదాలత్‌లో ఇరు పార్టీలకు ఆమోదయోగ్యమైన, ఖర్చు మరియు కాలయాపన లేకుండా, అప్పీలు లేని అంతిమ తీర్పును పొందవచ్చును. కావున ప్రజలు/కక్షిదారులు తమ దగ్గరలోని కోర్టు ఆవరణలో గల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఈ జాతీయ లోక్ అదాలత్ ద్వారా తమ కేసులను సత్వరముగా పరిష్కరించుకొనవచ్చును.
లోక్ అదాలత్ సేవలు పూర్తిగా ఉచితము
మరిన్ని వివరాలకు మీ దగ్గరలో ఉన్న కోర్టు ప్రాంగణములో గల న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయములో సంప్రదించవచ్చును మరియు టోల్ ఫ్రీ నంబరు – 15100 ద్వారా కూడా వివరాలు పొందవచ్చును.
సభ్య కార్యదర్శి,
తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ
రెండవ అంతస్తు, 'సి' బ్లాక్, హైకోర్టు ఆవరణ, హైదరాబాద్ – 500 066
ఫోన్ నంబర్లు: 040–23446723, ఫ్యాక్స్–040–23446723, టోల్ ఫ్రీ నం.15100
DIPR RO No. 1911-DP/CL/Advt/1/2019-20, Dt:07-12-19



TELANGANA STATE FOREST DEVELOPMENT CORPORATION LIMITED, HYDERABAD
Rc.No. 825/2016/A2 Dated: 06.12.2019
SALE NOTICE
Sealed tenders are invited for purchase of (7) Nos. terminated Beedi Leaf Units of Kawal Tiger Reserve Circle, Nirmal and (8) Nos. terminated Beedi Leaf Units of Adilabad Circle of 2017 BL Season in as is where is condition and 4th, 5th & 6th sales will be held on 12.12.2019, 19.12.2019 & 02.01.2020 respectively at O/o. DFO, Mancherial. For further details please contact O/o. DFO, Mancherial in office hours.
Sd/- Conservator of Forests, Kawal Tiger Reserve, Nirmal
DIPR.Ro.No. 532-PP/CL/ADVT/1/2019-20, Dt 07/12/2019



THE TELANGANA STATE DAIRY DEVELOPMENT COOPERATIVE FEDERATION LIMITED
Lalapet, Hyderabad - 500017
Website: tsdairy.telangana.gov.in
Tender Notice No.30&31/EE©/TSDDCFL/2019 Date:07-12-2019
The tenders are invited for the following works 1. Renovation of Dairy parlour at Gachibowli, Hyderabad for the tender value of Rs.3,93,554.00 schedule closed on 23-12-2019 by 5.00PM. 2. Providing of CC road at Nirmal dairy in Nirmal District for the tender value of Rs.11,03,743.00 schedule closed on 16-12-2019 by 5.00PM. Further detail visit https://tender.telangana.gov.in and further enquiry contact EE© in HO Ph: 9391841211 during the office hours
Sd/- EXECUTIVE ENGINEER (CIVIL)



హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
సూపరింటెండింగ్ ఇంజినీర్ (SRDP/P-WZ) కార్యాలయం, GHMC, హైదరాబాద్
జాతీయ పోటీ బిడ్డింగ్
సవరణ
టెండరు నోటీసు నం.12/SE(SRDP/P-WZ)/GHMC/2019-20/ తేది: 03.12.2019 కోసం సవరణ జారీ చేయబడింది మరియు ఇ–ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ www.tender.telangana.gov.in లో అప్‌లోడ్ చేయబడింది.
సూపరింటెండింగ్ ఇంజినీర్, (SRDP/P-WZ), GHMC
R.O.No. 223/CPRO/GHMC/2019-20




## తలారీ కావలెను...

దేశంపై దాడికి దిగిన ఉగ్రవాదుల్ని మినహాయిస్తే అత్యాచారం కేసులో సరిగ్గా 15 ఏళ్ల క్రితం ధనుంజయ్ ఛటర్జీని ఉరితీశారు. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత నిర్భయ అత్యాచారం కేసులో నిందితులకి రేపో, మాపో ఉరిశిక్ష అమలు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. కానీ, ఈ శిక్షని అమలు చేయడానికి తలారీలు కరువయ్యారు. అత్యాచార కేసుల్లో విచారణ జరపడానికి న్యాయస్థానాల్లో సిబ్బందికి కొరత ఉన్నట్టుగానే, ఉరిశిక్ష అమలు చేయడానికి మన దేశంలో తలారీలు లేరు. అందులోనూ నిర్భయ దోషుల్ని ఉంచిన ఢిల్లీలోని తీహార్ జైలుకి అధికారికంగా తలారీ ఎవరూ లేరు. మన దేశంలో తలారీ వృత్తి కూడా వంశపారంపర్యంగా వస్తోంది. ఉత్తరప్రదేశ్‌లో మీరట్ జైల్లో పవన్ అన్న తలారీ అధికారికంగా ఈ వృత్తిలో ఉన్నారు. ప్రస్తుతం 56 ఏళ్ల వయసున్న పవన్ నెలకి రూ.3 వేల జీతంతో తలారీగా పని చేస్తున్నారు. ఆయన తండ్రి కల్లు, తాత లక్ష్మణ్ కూడా తలారీలే కావడంతో చిన్నప్పట్నుంచి ఉరిశిక్ష అంటే ఏమిటి, దానిని అమలు చేసేటప్పుడు ఎంత జాగ్రత్తగా ఉండాలి, అన్నది పవన్‌కి బాగా తెలుసు. పవన్ తాత లక్ష్మణ్ ఇందిరాగాంధీ హంతకుల్ని ఉరితీస్తే,



ఆయన తండ్రి కల్లు కరుడుగట్టిన నేరస్తులు రంగా, బిల్లాలను ఉరితీశారు. ఇప్పుడు తీహార్ జైలు నుంచి అధికారికంగా పవన్‌కి ఎలాంటి ఆదేశాలు రాకపోయినా పవన్ నిర్భయ నిందితుల్ని ఉరితీయడానికి సిద్ధమవుతున్నారు. మరోవైపు సిమ్లాకు చెందిన రవికుమార్ అనే కూరగాయల వ్యాపారి నిర్భయ హంతకుల్ని ఉరితీస్తానంటూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. ఈ మేరకు ఆయన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు లేఖ రాశారు.

## ఉరి సరైనదేనా?

రేపిస్టులని ఉరి తీయండి.. ఇప్పుడీ నినాదం గల్లీలో వీధుల నుంచి ఢిల్లీలోని పార్లమెంట్ దాకా ప్రతిధ్వనిస్తోంది. ఎంపీ జయాబచ్చన్ రేపిస్టుల్ని బహిరంగంగా కొట్టి చంపాలని వ్యాఖ్యానిస్తే.. ఢిల్లీ మహిళా కమిషన్ చీఫ్ స్వాతి మలివాల్ అత్యాచార దోషులకి ఉరిశిక్ష విధించాలంటూ నిరాహార దీక్షలూ చేశారు. కానీ మానవ హక్కుల కార్యకర్తలు, కొందరు మేధావులు ఉరిశిక్షని వ్యతిరేకిస్తున్నారు. దీనికి చాలా కారణాలున్నాయి. ఉరిశిక్ష వేసినా అత్యాచారాలకు అడ్డుకట్ట పడుతుందన్న భరోసా ఎక్కడా లేదు అన్నది వారి అభిప్రాయం. నిర్భయ గ్యాంగ్ రేప్, హత్య తర్వాత ఏర్పాటైన జస్టిస్ జే.ఎస్. వర్మ కమిటీ కూడా రేపిస్టులకి మరణ శిక్ష విధించడం వల్ల మహిళల భద్రతకు భరోసా రాదనే అభిప్రాయపడింది. రేపిస్టులను ఉరి తీసుకుంటూ పోతే వారిలో భయం రాక పోగా, అత్యాచారంతో పాటు సాక్ష్యాలను నాశనం చంపేయాలన్న కసి పెరిగే అవకాశాలున్నాయని మానవ హక్కుల సంఘాలు వాదిస్తున్నాయి. ఇక కోర్టుల్లో న్యాయమూర్తుల మధ్యే భిన్నాభిప్రాయాలు చూస్తున్నాం. 2000–15 మధ్య గణాంకాలను పరిశీలిస్తే.. ట్రయల్ కోర్టు ఉరిశిక్ష విధించిన కేసుల్లో 30%



వాటిలో నిందితుల్ని పై కోర్టు నిర్దోషులుగా విడుదల చేసింది. అలాంటప్పుడు నిందితులు దోషులా? అనుమానితులా? అన్న ప్రశ్న వస్తుంది. ఒక నేరస్తుడికి శిక్ష పడకపోయినా ఫర్వాలేదు కానీ, ఒక నిరపరాధి ఉరికంబం ఎక్కడం అమానుషం అన్నది మన ప్రజాస్వామ్య సిద్ధాంతం. అంతేకాదు ఇలాంటి కఠిన చట్టాలు బలహీన వర్గాలు, నిరుపేదలనే లక్ష్యం చేసుకుంటాయే తప్ప సంపన్న వర్గాలను చూసి చూడనట్టు వదిలేస్తాయన్న అభిప్రాయమూ ఉంది.

# అది బూటకపు ఎన్‌కౌంటర్

- సీబీఐ వంటి స్వతంత్ర సంస్థతో విచారణకు ఆదేశించండి
- సుప్రీంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు

**సాక్షి, న్యూఢిల్లీ:** 'దిశ'హత్య కేసులో నిందితులను కాల్చి చంపి ఎన్‌కౌంటర్‌గా చెబుతున్నారని, అది బూటకపు ఎన్‌కౌంటర్ అని, ఈ ఘటనపై విచారణ జరిపించాలని సుప్రీం కోర్టులో ఇద్దరు సుప్రీం కోర్టు న్యాయవాదులు ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు జరిపించాలని, ఎఫ్ఐఆర్ నమోదు చేసి బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలకు ఆదేశించాలని పిటిషనర్లు జి.ఎస్.మణి, ప్రదీప్ కుమార్ యాదవ్ పిటిషన్లో కోరారు. 'పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్(పీయూసీఎల్) వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర'కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన 16 మార్గదర్శకాలను అమలుచేయాల్సిందిగా ఆదేశించాలని విన్నవించారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ డీజీపీలతోపాటు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్‌లను ప్రతివాదులుగా చేర్చారు. సీబీఐ వంటి స్వతంత్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని, లేదా ఇతర రాష్ట్రాలకు చెందిన పోలీస్ బృందంతో విచారణ జరిపించాలని విన్నవించారు.



**రెండు కేసుల్లో తీర్పులను ప్రస్తావించిన పిటిషనర్లు**

'పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్(పీయూసీఎల్) వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర'కేసులో జస్టిస్ ఆర్.ఎం.లోధా నేతృత్వంలోని ధర్మాసనం జారీచేసిన తీర్పులోని 16 మార్గదర్శకాలను పాటించాల్సిందేనని సుప్రీంకోర్టు ఆదేశించిందని ప్రస్తావించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ద్వారా దఖలు పడిన జీవించే హక్కును ఉల్లంఘించజాలమని పేర్కొందని గుర్తుచేశారు. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏపీ సివిల్ లిబర్టీస్ కమిటీ(ఏపీసీఎల్సీ) కేసును కూడా ఈ పిటిషన్‌లో ఉదహరించారు. 2006లో నాటి మావోయిస్టు రాష్ట్ర కార్యదర్శి మాధవ్ అలియాస్ బుర్రా చెన్నయ్య సహా ఎనిమిది మంది నక్సలైట్లు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. ఈ ఘటనపై ఏపీ సివిల్ లిబర్టీస్ కమిటీ(ఏపీసీఎల్సీ) హైకోర్టులో రిట్ పిటిషన్ వేసింది. అది ఎన్‌కౌంటర్ కాదని, అక్రమంగా నిర్బంధించి తెచ్చి అడవుల్లో చంపేశారని పేర్కొంది. ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ఫుల్ బెంచ్ విచారణ జరిపి ఫిబ్రవరి 6, 2009న తీర్పు ప్రకటించింది. 'ఒక పోలీస్ అధికారి ఒక వ్యక్తి మరణానికి కారణమైతే, అధికార విధుల్లో భాగమైనప్పటికీ, ఆత్మరక్షణ కోసమైనప్పటికీ, సంబంధిత ఘటనకు దారితీసిన కారణాలను నిక్షిప్తం చేస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి..'అని ఆ తీర్పులో పేర్కొంది. ఎన్‌కౌంటర్ చేసిన పోలీసుల వివరాలు కూడా ప్రకటించాలన్న పిటిషన్‌లోని ఒక అంశంపై హైకోర్టు విభేదించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. పదేళ్లపాటు సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. దీనిపై జూలై 18, 2019న సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. 'పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర'కేసులో జస్టిస్ లోధా నేతృత్వంలోని ధర్మాసనం ఇచ్చిన తీర్పులో కూడా ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఇదే కోర్టు స్పష్టం చేసిందని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో గుర్తుచేసింది. ఆ తీర్పులోని 16 మార్గదర్శకాలు అన్ని సందర్భాల్లోనూ వర్తిస్తాయంది. సెక్షన్ 157 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఇతర పోలీస్‌స్టేషన్ అధికారులతో దర్యాప్తు జరిపించి, ఆ నివేదికను కోర్టుకు సమర్పించాలని జస్టిస్ లోధా తీర్పు స్పష్టంచేసింది. ఆ తీర్పులోని మార్గదర్శకాలే ఈ కేసులోనూ వర్తిస్తాయని జూలై 18, 2019న జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టంచేసింది. 2014 నాటి 'పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్(పీయూసీఎల్) వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర'కేసులో తీర్పును, ఏపీ సివిల్ లిబర్టీస్ కమిటీ(ఏపీసీఎల్సీ) కేసులో సుప్రీం కోర్టు తీర్పును ఈ పిటిషన్‌లో ప్రస్తావిస్తూ ఎన్‌కౌంటర్ బాధ్యులపై విచారణకు ఆదేశించాలని నివేదించారు.

## కోనసీమలా సిరిసిల్ల



రాజన్న సిరిసిల్ల జిల్లా మరో కోనసీమలా మారిందా అన్న సంశయాన్ని కలిగిస్తుంది కదూ ఈ దృశ్యం. వేములవాడ మండలం చంద్రగిరి గ్రామ శివారులో ఇటీవల ఓ చెరువును తవ్వించారు. అంతకుముందు ఆ ప్రాంతంలో తాటిచెట్లు ఉండేవి. ప్రస్తుతం నీటితో నిండిన ఆ చెరువులో ఉన్న తాటి చెట్లపైనే ఆధారపడ్డ గీత కార్మికులు కల్లు గీత కోసం ప్రత్యామ్నాయాన్ని ఎంచుకున్నారు. కల్లు గీసేందుకు థర్మాకోల్‌తో చేసిన తెప్పలను ఉపయోగిస్తున్నారు. మెట్ట ప్రాంతమైన సిరిసిల్లలో ఈ దృశ్యం ఓ విచిత్రంగా కనిపిస్తోంది.- వంకాయిల శ్రీకాంత్, సాక్షి, ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

# వెయ్యి సిటీబస్సులు ఔట్?

- నష్టాలు తగ్గించుకునేందుకు ఆర్టీసీ అధికారుల యోచన
- జనవరి ఒకటి నాటికి తొలగించాలని కసరత్తు
- ఇక హైదరాబాద్‌లో మిగిలేవి 2,700 బస్సులే
- కోటి జనాభాకు అవి సరిపోతాయా అని సందేహాలు
- తగ్గించే బదులు సర్వీసుల రేషనలైజేషన్ చేయాలని సూచనలు
- ఓఆర్ఆర్ అవతలకు నడిపితే ఆదాయం పెరిగే అవకాశం



- **హైదరాబాద్:** జనాభా దాదాపు కోటి
- **ఆర్టీసీ బస్సులు:** 3,700
- **పరిస్థితి:** రాత్రి 9 తర్వాత బస్సులు చాలా పలచగా తిరుగుతుండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం ఆరు తర్వాత గానీ రోడ్లపై ఎక్కువగా కనిపించవు.
- **సిఫారసు:** ఉన్నఫళంగా నగరంలో కనీసం వేయి బస్సులు పెంచాలని గతేడాది ఆర్టీసీపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన రవాణారంగ నిపుణుల కమిటీ సూచించింది.

- **బెంగళూరు:** జనాభా దాదాపు కోటి
- **సిటీ బస్సులు:** 6,500
- **పరిస్థితి:** ఉదయం 4 నుంచి రాత్రి 12గం. వరకు బస్సులు అందుబాటులో ఉండటమే కాకుండా, అంతర్గత కాలనీలకు కూడా నడుస్తున్నాయి.
- **ప్రత్యేకత:** దేశంలో ఢిల్లీ తర్వాత అన్ని ఏసీ బస్సులున్న నగరం ఇదే. ఏకంగా ప్రభుత్వమే సొంత నిధులతో గతంలో వేయి ఏసీ బస్సులను అందుబాటులో ఉంచింది. సిటీ కోసం ప్రత్యేకంగా ఉన్న కార్పొరేషన్ ఆధ్వర్యంలో మరిన్ని బస్సులు సమకూరబోతున్నాయి.

**సాక్షి, హైదరాబాద్:** పెరుగుతున్న కాలుష్యానికి విరుగుడుగా ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య బాగా పెంచటంతోపాటు సొంత వాహనాల స్థానంలో జనం వీలైనంత ఎక్కువగా ప్రజా రవాణా వాహనాల్లో ప్రయాణించేలా ప్రపంచవ్యాప్తంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకోసం ప్రజా రవాణా వ్యవస్థలను బలోపేతం చేస్తున్నారు. అయితే, దేశంలో కాస్మోపాలిటన్ సిటీగా శరవేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్‌లో మాత్రం పరిస్థితి దీనికి విరుద్ధంగా కనిపిస్తోంది. దాదాపు కోటి జనాభా ఉన్న మరే నగరంతో పోల్చినా సిటీ బస్సులు ఇక్కడే తక్కువ. పైగా కేవలం ప్రధాన రోడ్లపై మాత్రమే సిటీ బస్సులు నడుస్తుంటాయి. దీంతో అంతర్గత ప్రాంతాల ప్రజలు బస్సు కోసం కొంత దూరం వెళ్లక తప్పని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఈ సమస్యను అధిగమించడానికి వీలైనన్ని ఎక్కువ బస్సులు అందుబాటులోకి తేవడం ద్వారా విపరీతంగా పెరిగిపోతున్న సొంత వాహనాల విస్తృతిని నియంత్రించాలని పలువురు సూచనలు చేస్తున్నారు. కానీ వీటిని అనుసరించటం అటుంచితే, ఇప్పుడు హైదరాబాద్‌లో ఏకంగా వేయి బస్సులను తొలగించాలని నిర్ణయించారు. జనవరి ఒకటో తేదీ నాటికి వాటిని తొలగించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో నగరంలో 2,700 బస్సులు మాత్రమే ఉండనున్నాయి. దాదాపు పదేళ్ల క్రితం నగరంలో తిరిగిన బస్సుల సంఖ్యకి ఇది సమానం. ఈ పదేళ్లలో హైదరాబాద్‌లో ఏకంగా 30 లక్షలకు పైగా జనాభా పెరిగింది. అందుకనుగుణంగా బస్సుల సంఖ్య పెరగాల్సి ఉండగా.. ఆర్టీసీ మాత్రం తిరోగమనంలో ఆలోచిస్తోంది.

**నష్టాలను తగ్గించేందుకేనంటూ...**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్టీసీ ఏకంగా రూ.1200 కోట్ల నష్టాలను చవిచూడనుందని అధికారులు ఇప్పటికే అంచనా వేశారు. ఇందులో దాదాపు 550 కోట్ల నష్టం హైదరాబాద్ నుంచే ఉంటుందని చెబుతున్నారు. బస్సుల సంఖ్య పెరిగే కొద్దీ నష్టాలు పెరుగుతాయన్న సూత్రాన్ని అనుసరించి, బస్సుల సంఖ్య తగ్గించాలనే నిర్ణయానికి వచ్చారు. ఇటీవల సీఎం కేసీఆర్ నిర్వహించిన రెండు సమావేశాల్లో సిటీ బస్సులతో వస్తున్న నష్టాలపై చర్చ జరిగింది. మధ్యాహ్నం వేళ బస్సులు ఒకదాని వెంట ఒకటి తిరుగుతున్నాయని, ఒక్కో బస్సులో పది, పదిహేను మందికి మించి ప్రయాణికులుండటం లేదని సీఎం పేర్కొన్నారు. తీవ్ర నష్టాలు సిటీ నుంచే వస్తున్న తరుణంలో ఇలా పలచగా ప్రయాణికులుంటే బస్సులెందుకు తిప్పుతున్నారని ప్రశ్నించారు. దీంతో అధికారులు ఇక బస్సుల సంఖ్య తగ్గించటమే మేలని నిర్ణయించారు.

**ఇలా చేస్తారు...**

- ప్రస్తుతం నగరంలో కాలం చెల్లడంతో తొలగించాల్సిన బస్సులు 600 ఉన్నట్టు తేల్చారు. వాటిని ఈ ఖాతాలో తగ్గించేస్తారు.
- దాదాపు 500 మంది వరకు డ్రైవర్ల కొరత ఉంది. దీంతో కొన్ని సర్వీసులు డిపోలకే పరిమితమవుతున్నాయి. కొత్త డ్రైవర్లను తీసుకోకుండా ఆమేర సర్వీసులకు కోత పెడతారు.

**ఇలా చేయొచ్చు...**

- ముఖ్యమంత్రి చెప్పిన విషయాలను పరిగణనలోకి తీసుకుని, బస్సుల సంఖ్య తగ్గించటం కంటే ఉన్నవాటిని హేతుబద్ధీకరించాలి. మధ్యాహ్నం వేళ చాలా ప్రాంతాలకు రద్దీ తక్కువగా ఉంటున్నందున ఆ సమయాల్లో కొన్ని బస్సులను కొత్త ప్రాంతాలకు తిప్పాలి.
- ఓఆర్ఆర్ వరకు నగరం విస్తరించినందున ఆ ప్రాంతాన్ని దాటి సమీపంలోని కొత్త ప్రాంతాల వరకు ఆ బస్సులు నడపాలి. దీనివల్ల ఆదాయం పెరుగుతుంది.
- ఉదయం, రాత్రి వేళ విపరీతమైన రద్దీ ఉంటుంది. ఆ వేళల్లో ఉన్న బస్సులే సరిపోవడంలేదు. బస్సుల సంఖ్య తగ్గిస్తే ఆ సమయాల్లో ఇబ్బంది తప్పదన్న విషయాన్ని గమనించాలి

**సిబ్బందినేం చేస్తారు?**

ప్రస్తుతం ఆర్టీసీలో బస్సులు–సిబ్బంది దామాషా 1:6గా ఉంది. వేయి బస్సులు తగ్గిస్తే 6 వేల మంది సిబ్బందిని తగ్గించాలి. ఇలా మిగిలే సిబ్బందిని ఇప్పుడేం చేస్తారన్నది ప్రశ్న. పైగా, ఆర్టీసీ మొత్తం వ్యయంలో 58 శాతం సిబ్బంది జీతాల రూపేణా ఖర్చవుతోంది. నష్టాలు తగ్గించేందుకు బస్సుల సంఖ్య తగ్గించినా, సిబ్బంది అలాగే ఉంటారు కదా. వారి జీతాలు తగ్గవన్న విషయం గుర్తించలేదా అన్నది ప్రశ్న.

**చార్జీలతో ఆదాయం పెరిగింది**

ఇటీవల పెంచిన చార్జీలతో నగరంలో 25 శాతం మేర ఆదాయం పెరిగింది. బస్సు పాస్‌ల ధరల పెంపుతో, ప్రభుత్వం నుంచి వచ్చే రీయింబర్స్‌మెంట్ మొత్తం కూడా పెరుగుతుంది. ఉన్న బస్సులను రేషనలైజ్ చేస్తే కొంత ఆదాయం కూడా పెరుగుతుంది. ఈ రెండు విషయాలను క్రోడీకరించుకునే కసరత్తు చేస్తే మంచిదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



శనివారం ఓయూలో సమతా యాత్ర వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

# 17న అంబేడ్కర్ సమతా యాత్ర

- 1,000 వాహనాల్లో నాగ్‌పూర్ దీక్షా భూమికి ప్రయాణం
- ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్ నుంచి ఈ నెల 17న అంబేడ్కర్ సమతా యాత్ర ప్రారంభిస్తున్నట్లు ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. శనివారం ఉస్మానియా యూనివర్సిటీలో టీఆర్ఎస్వీ, దళిత బహుజన విద్యార్థి సంఘాలు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2001 డిసెంబర్ 18న అప్పటి రాష్ట్రపతి నాగ్‌పూర్‌లోని అంబేడ్కర్ దీక్షా భూమి వద్ద బౌద్ధ స్తూపాన్ని ఆవిష్కరించారని, అప్పట్నుంచి ఆ తేదీన దీక్ష భూమికి వెళ్లి దర్శించుకోవడం ఆనవాయితీగా మారిందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 17న జింఖానా గ్రౌండ్స్ నుంచి 1,000 వాహనాల్లో దీక్షా భూమికి పయనమవుతారని, దళిత, బహుజన యువతీయువకులు, విద్యార్థులు, మేధావులు ఇందులో పాల్గొంటారన్నారు. ఈ నెల 18న వీరంతా దీక్షా భూమిని సందర్శించుకుని తిరుగు ప్రయాణం అవుతారన్నారు. ఈ సందర్భంగా సమతా యాత్ర వాల్ పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. సమావేశంలో జాతీయ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఆవుల బాలనాథం, మాల జన సమితి అధ్యక్ష, కార్యదర్శులు మాందాల భాస్కర్, గద్దం శ్రీనివాస్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శోభన్ బాబు, టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**క్రిస్మస్ విందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి: కొప్పుల**

**సాక్షి, హైదరాబాద్:** క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటు చేసే విందు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అధికారులను ఆదేశించారు. శనివారం తన చాంబర్‌లో క్రిస్మస్ విందు కార్యక్రమంపై సంబంధిత అధికారులతో ఆయన సమావేశమయ్యారు. సర్కార్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ విందుకు అన్ని చర్చిల పాస్టర్లు, బిషప్‌లు హాజరయ్యేలా చూడాలని అధికారులకు మంత్రి సూచించారు. అదే విధంగా క్రైస్తవ సేవా సంస్థలకు సరిపడా ఆహ్వాన పత్రికలు పంపాలని, పెద్ద సంఖ్యలో క్రైస్తవులు హాజరయ్యేలా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ హాజరవనున్నారని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. భేటీలో ఎమ్మెల్సీ రాజేశ్వరరావు, ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ తదితరులు పాల్గొన్నారు.

# సైనికుల సేవలు వెలకట్టలేనివి: గవర్నర్

### సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి రూ.52 లక్షల సేకరణ

**లక్డీకాపూల్:** దేశానికి సైనికులు చేసే సేవలు వెలకట్టలేనివని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. వారి కుటుంబాలకు ఆర్థిక చేయూతనందించేందుకు నిధిని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. శనివారం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి రూ.52 లక్షలు విరాళాలను సేకరించిన హైదరాబాద్ ప్రాంతీయ సైనిక్ సంక్షేమ అధికారి శ్రీనేష్ కుమార్ నోరి సేవలను గవర్నర్ కొనియాడారు. ఈ సందర్భంగా నోరికి రాష్ట్ర స్థాయిలో రోలింగ్ ట్రోఫీని ప్రదానం చేశారు. సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ కల్నల్ రమేశ్‌కుమార్ మాట్లాడుతూ సైనిక కుటుంబాలకు ఆర్థిక చేయూతనందించేందుకు సాయుధ దళాల పతాక దినోత్సవ నిధిని సేకరించినట్లు తెలిపారు. ఈ నిధికి విరాళాలను సమీకరించడంలో శ్రీనేష్ కుమార్ నోరి మొదటి స్థానంలో నిలిచినట్లు చెప్పారు. సైనికుల కుటుంబాలకు సాయుధ దళాల పతాక దినోత్సవ నిధి నుంచి సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని శ్రీనేష్ కుమార్ నోరి తెలిపారు. కాగా, బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్ శనివారం గవర్నర్ తమిళిసైని రాజ్‌భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు.



మేడిపల్లి ఫారెస్ట్ పార్క్‌లో మొక్కలు నాటుతున్న సీఎస్ జోషి

# గ్రీన్ ఛాలెంజ్‌లో మొక్కలు నాటిన సీఎస్

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్న ఎస్‌కే జోషి

**సాక్షి, హైదరాబాద్:** హరితహారం ప్రాధాన్యతను అందరూ గుర్తించాలని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని పర్యావరణాన్ని కాపాడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి కోరారు. మనకు సరిపోయే ఆక్సిజన్‌ను మూడు మొక్కలు ఇస్తాయి కాబట్టి ప్రతిఒక్కరూ మూడు మొక్కలు నాటాలన్నారు. గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటడం సంతోషంగా ఉందని చెప్పారు. పోలీస్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ కోలేటి దామోదర్ విసిరిన గ్రీన్ చాలెంజ్‌ను స్వీకరించిన జోషి.. శనివారం మేడిపల్లి అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లో మొక్కలు నాటారు. దామోదర గుప్తా విసిరిన గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా తాను మూడు మొక్కలు నాటినట్లు, ఏపీ సీఎస్ నీలం సహాని, స్పెషల్ సీఎస్ రాజేశ్వర్ తివారీ, పీసీసీఎఫ్ శోభలకు గ్రీన్ చాలెంజ్ విసిరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్ గుప్తా మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యమని, ఈ కార్యక్రమంలో అనేక మంది ప్రముఖులు, ఫారెస్ట్ అధికారులు, సామాన్యులు భాగస్వాములయ్యారన్నారు. ఎంపీ సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ చాలెంజ్ ఉద్యమంలా కొనసాగుతోందని, ఆయన పుట్టినరోజున మొక్కలు నాటడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ హరితహారం కార్యక్రమంలో పాల్గొని, నాటిన మొక్కలకు వారి పిల్లల పేర్లు పెట్టుకోవచ్చునన్నారు. అటవీశాఖ స్పెషల్ సీఎస్ రాజేశ్వర్ తివారీ, అటవీ సంరక్షణ శాఖ ప్రధానాధికారి శోభ, సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎం.వి.రెడ్డి పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.






# నేరము.. శిక్ష...

మన దేశంలో అత్యాచార కేసులు అంటే నిర్భయ ఘటనకి ముందు.. తర్వాత.. అని మాట్లాడుకోవాలి. దేశం నలుమూలలా గంటకో రేప్ జరుగుతున్నప్పటికీ 2012 ఢిల్లీలో అర్ధరాత్రి నిర్భయని అమానుషంగా హింసించి మరీ గ్యాంగ్ రేప్ చేయడంతో దేశం యావత్ కదిలి వచ్చింది. యువత అంతా స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి రేపిస్టులని ఉరితీయాలంటూ ఎలుగెత్తి నినదించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం కఠినమైన నిర్భయ చట్టాన్ని తీసుకువచ్చింది. అప్పటివరకు రేపిస్టులకు ఏడేళ్లు ఉన్న శిక్షని 20 ఏళ్లకి పెంచారు. గ్యాంగ్ రేప్‌లు, పదే పదే అత్యాచారాలు చేసిన వారికి ఉరి శిక్ష అమలు చేయాలంటూ చట్టం తెచ్చారు. అయినా అత్యాచార కేసులు పెరిగిపోతూనే ఉన్నాయి. కామాంధులు చిన్నారుల్ని కూడా చిదిమేస్తుండటం, మైనర్లు కూడా అత్యాచారాలకు తెగబడుతూ ఉండటంతో 2015లో జువెనైల్ జస్టిస్ చట్టానికి సవరణలు తెచ్చారు. అత్యాచారం, హత్య కేసుల్లో 16 నుంచి 18 ఏళ్ల మధ్య ఉన్న వారిని మేజర్లుగా పరిగణించారు. ఇక 12 ఏళ్ల కంటే తక్కువ వయసున్న చిన్నారుల్ని అత్యాచారం చేస్తే ఉరే సరి అని ఆ చట్టం చెబుతోంది. ఈ చట్టం తీసుకువచ్చిన తర్వాత అత్యాచార కేసులు తగ్గకపోగా మరింత పెరిగిపోతున్నాయి.



**జాతీయ నేర గణాంక నమోదు సంస్థ తాజా గణాంకాల ప్రకారం...**

2012లో(నిర్భయ ఘటనకు ముందు).. 25 వేల కంటే తక్కువ

2013లో.. **33,707**

2016లో.. **38,947**

2017లో.. **30,000**

ఈ చట్టం వల్ల అత్యాచార కేసులు తగ్గకపోయినా, మహిళలు నిర్భయంగా పోలీసు స్టేషన్ల గడపెక్కి కేసు నమోదు చేసే వాతావరణమైతే వచ్చింది. ఇది కాస్త ఊరట కలిగించే అంశం.

## 15 ఏళ్లలో నలుగురికి ఉరి..

**2004 ఆగస్టు 14:** టీనేజీ అమ్మాయిని అత్యాచారం, హత్య కేసులో దోషి అయిన ధనుంజయ్ ఛటర్జీని పశ్చిమ బెంగాల్‌లో అలీపూర్ సెంట్రల్ జైలులో ఉరితీశారు. అతని 42వ పుట్టిన రోజునాడే ఉరిశిక్ష అమలు చేశారు.

**2012 నవంబర్ 21:** ముంబై నగరంలో 2008లో జరిగిన దాడుల్లో పట్టుబడిన మహమ్మద్ అజ్మల్ అమీర్ కసబ్‌కి ఉరిశిక్ష అమలు చేశారు. పుణేలో యరవాడ జైల్లో అతనికి ఉరిశిక్ష అమలు చేశారు.

**2013 ఫిబ్రవరి 9:** పార్లమెంట్‌పై 2001లో దాడి కేసులో దోషి మహమ్మద్ అఫ్జల్ గురుకి పన్నెండేళ్ల తర్వాత ఉరిశిక్ష విధించారు. తీహార్ జైల్లో అతనికి ఉరిశిక్ష అమలు జరిగింది.

**2015 జూలై 30:** 1993 ముంబై వరుస పేలుళ్లలో దోషి యాకూబ్ మెమన్‌కి ఉరిశిక్ష అమలైంది. మహారాష్ట్రలో నాగపూర్ జైల్లో అతన్ని ఉరి తీశారు.

### క్లుప్తంగా...

## రానున్న రెండ్రోజులు పొడి వాతావరణం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో రాగల రెండ్రోజులు పొడి వాతావరణం నెలకొని ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అంతేకాకుండా ప్రధానంగా ఈశాన్య, తూర్పు దిశల నుంచి చలి గాలులు వీస్తాయని పేర్కొంది. ఆదిలాబాద్ జిల్లాలో అత్యల్పంగా 11 డిగ్రీల సెంటిగ్రేడ్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్లు వివరించింది.

## లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

**బీజేపీ ఎంపీ సోయం బాపూరావు**



**సాక్షి, న్యూఢిల్లీ:** రాష్ట్రంలో లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని బీజేపీ ఎంపీ సోయం బాపూరావు డిమాండ్ చేశారు. దేశంలో ఎమర్జెన్సీ సమయంలో ఎలాంటి ప్రక్రియ లేకుండా లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చారని, దీని వల్ల ఆదివాసీలు అన్యాయానికి గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. శనివారం ఢిల్లీలో సోయం మాట్లాడుతూ.. ఎలాంటి అధ్యయనం లేకుండా లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చారని, ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. దేశవ్యాప్తంగా ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలు, వారిపై దాడులను అరికట్టాలన్న డిమాండ్‌తో ఆదివాసీల ఐక్య సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 9న ఢిల్లీలో భారీ సభ నిర్వహించనున్నామని తెలిపారు.

## పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక విచారణ

**సాక్షి, హైదరాబాద్:** క్రిమినల్ పెండింగ్ కేసుల పరిష్కారానికి శనివారం హైకోర్టు ప్రత్యేకంగా విచారణ జరిపింది. 7 పెండింగ్ కేసులతోపాటు 26 మిస్లియస్ కేసులను న్యాయమూర్తి జస్టిస్ గండికోట శ్రీదేవి పరిష్కరించారని రిజిస్ట్రార్ జనరల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## తుది దశకు నయీం ఎన్‌కౌంటర్ కేసు దర్యాప్తు

**సాక్షి, హైదరాబాద్:** గ్యాంగ్‌స్టర్ నయీం ఎన్‌కౌంటర్ కేసు దర్యాప్తు తుది దశకు చేరుకుంది. ఈ నెలాఖరులోపు దర్యాప్తు పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2016 ఆగస్టు 8న షాద్‌నగర్‌లోని మిలీనియం టౌన్‌షిప్‌లో నయీంను పోలీసులు ఎన్‌కౌంటర్ చేసిన విషయం తెలిసిందే. ఎన్‌కౌంటర్ కేసును దర్యాప్తు చేసేందుకు అప్పట్లో కూకట్‌పల్లి ఏసీపీగా ఉన్న భుజంగరావును సర్కార్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా నియమించింది. మూడేళ్లుగా జరుగుతున్న దర్యాప్తు త్వరలో ముగియనుందని సమాచారం. ఇది పూర్తవగానే ఇందుకు సంబంధించిన రిపోర్టును డీజీపీ మహేందర్‌రెడ్డికి అప్పగించనున్నారు. ఆ తర్వాత కాపీని ప్రభుత్వానికి సమర్పిస్తారు.

## ఉన్నత విద్యా మండలిలో గ్రీన్ చాలెంజ్

**సాక్షి, హైదరాబాద్:** ఎంపీ సంతోష్‌కుమార్ నిర్వహిస్తున్న గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా శనివారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షులు ఆర్.లింబాద్రి, వి.వెంకటరమణ, కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు టీఎస్‌సీహెచ్‌ఈ ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే గ్రీన్ చాలెంజ్‌కు కొనసాగింపుగా ఉస్మానియా, పాలమూరు, మహాత్మాగాంధీ యూనివర్సిటీల రిజిస్ట్రార్‌లకు 3 చొప్పున మొక్కలు నాటాల్సిందిగా చాలెంజ్ చేశారు.

## రేపు యాదాద్రికి గవర్నర్

**10, 11 తేదీల్లో భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల్లో పర్యటన**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సోమవారం ఉదయం యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకోనున్నారు. ఈ మేరకు ఆమె పర్యటన ఖరారైంది. అదే రోజు స్వామి దర్శనం అనంతరం వరంగల్ అర్బన్ జిల్లాలో జరిగే ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఆ రోజున అక్కడే బస చేసి, 10వ తేదీన భూపాలపల్లి జిల్లాలో పర్యటిస్తారు. అక్కడ కాళేశ్వరం ముక్తీశ్వర స్వామిని దర్శించుకుంటారు. అనంతరం లక్ష్మీ పంప్‌హౌస్, లక్ష్మీ బ్యారేజీ, సరస్వతి బ్యారేజీలను సందర్శిస్తారు. 11వ తేదీన పెద్దపల్లి జిల్లాలో పర్యటించనున్న గవర్నర్, మహిళా సంఘాలు చేస్తున్న కార్యక్రమాలను స్వయంగా పరిశీలిస్తారు. అనంతరం నందిమేడారంలోని ప్యాకేజీ–6 పనులను తమిళిసై పరిశీలించనున్నారు.

## నేడు దేశవ్యాప్తంగా సీటెట్

**సాక్షి, హైదరాబాద్:** జాతీయ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (సీటెట్) ఆదివారం జరగనుంది. దేశంలోని 110 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహిస్తున్నారు. పేపర్–1 పరీక్ష ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనుండగా, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు పేపర్–2 పరీక్షను నిర్వహిస్తారు. రాష్ట్రంలో ఈ పరీక్షలు హైదరాబాద్‌లో జరగనుండగా, ఏపీలో విశాఖపట్నంతోపాటు విజయవాడలో నిర్వహిస్తున్నారు.




గీత వృత్తిదారుల బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో బూర నర్సయ్యగౌడ్, స్వామిగౌడ్, సోమేశ్‌కుమార్ తదితరులు

# కులవృత్తులకు అధిక ప్రాధాన్యం

- రాష్ట్ర అబ్కారీ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా పంపిణీ
- త్వరలో నీరా స్టాల్స్ ఏర్పాటు చేస్తామని వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** ప్రమాదవశాత్తు మరణించిన కల్లు గీత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చే ఎక్స్‌గ్రేషియా 2 లక్షల నుంచి 5 లక్షలకు పెంచడం మంచి పరిణామమని రాష్ట్ర పర్యాటక, అబ్కారీ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర అబ్కారీ శాఖ ఆధ్వర్యంలో కల్లుగీత వృత్తిదారులకు ఎక్స్‌గ్రేషియా పంపిణీ కార్యక్రమాన్ని శ్రీనివాస్‌గౌడ్ శనివారం రవీంద్రభారతిలో ప్రారంభించారు. గీత వృత్తిదారులకు 10 కోట్ల 9 లక్షల 30 వేల రూపాయల ఎక్స్‌గ్రేషియాను బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ కులవృత్తులకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగా బీసీల ఆత్మగౌరవ భవనాలకు 80 ఎకరాల విలువైన భూమిని కేటాయించి భవనాల నిర్మాణానికి కృషి చేస్తున్నారని వెల్లడించారు. గీత వృత్తిదారులు నీరా పాలసీపై గత ప్రభుత్వాలకు విన్నవించినా పట్టించుకోకుండా కాలయాపన చేశాయని, సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా నీరా పాలసీని ప్రకటించారని మంత్రి తెలిపారు. 70 సంవత్సరాలుగా వివక్షకు గురైన గౌడ కులం అభివృద్ధికి సీఎం కృషి చేస్తున్నారన్నారు. త్వరలోనే గీత కార్మికుల సంక్షేమానికి సంబంధించి మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. త్వరలోనే ప్రతి జిల్లా కేంద్రంలో నీరా స్టాల్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ 3 కోట్ల 50 లక్షల తాటి, ఈత మొక్కలను హరితహారం ద్వారా నాటారని తెలిపారు. మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ కల్లుగీత వృత్తిని అభివృద్ధి చేయడానికి సీఎం కృషి చేయడం మంచి విషయమన్నారు. మాజీ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్ మాట్లాడుతూ నీరాపాలసీ, నీరా జీవో తీసుకురావడం ఆషామాషీ విషయం కాదని, అది కేసీఆర్‌కే సాధ్యమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణగౌడ్, వి.గంగాధర్ గౌడ్, చైర్మన్లు రాజేశంగౌడ్, నాగేందర్‌గౌడ్, మాజీ శాసన సభ్యులు సత్యనారాయణగౌడ్, భిక్షమయ్యగౌడ్, అబ్కారీ శాఖ ఉన్నతాధికారులు అజయ్‌రావు, హరికిషన్, దత్తరాజ్‌గౌడ్, చంద్రయ్య, గౌడ సామాజిక వర్గ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మొత్తం లబ్ధిదారులు 521 మంది ఉండగా అందులో చనిపోయినవారు 79, శాశ్వత వైకల్యం పొందినవారు 104, తాత్కాలిక వైకల్యం పొందినవారు 338 మంది ఉన్నారు. చనిపోయినవారి కుటుంబాలకు, శాశ్వత వైకల్యం పొందిన వారికి 5 లక్షలు, తాత్కాలిక వైకల్యం ఉన్నవారికి 10 వేల రూపాయల ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం అందజేస్తోంది.

# దొడ్డిదారిన ఉద్యోగ భర్తీ చెల్లదు

- జూనియర్ పంచాయతీ సెక్రటరీల భర్తీని తప్పుబట్టిన హైకోర్టు
- 9,335 పోస్టుల భర్తీలో లొసుగులు
- గత కమిషనర్ నీతూకుమారి ప్రసాద్‌కు కోర్టు ధిక్కార నోటీసు
- రూల్ ఆఫ్ రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘించారని ఆక్షేపణ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో 9,335 జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పోస్టులను భర్తీ చేసేటప్పుడు రిజర్వేషన్ల నిబంధనలను అమలు చేయలేదని హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఏపీ స్టేట్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్–1996లోని రూల్ 22కు వ్యతిరేకంగా ఆ పోస్టులను భర్తీ చేయడంపై కోర్టు ఆక్షేపించింది. 2018లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ శాఖ ఆ పోస్టులను భర్తీ చేసింది. అయితే అప్పటికే ఆ పోస్టులను రిజర్వేషన్ల నిబంధనలకు లోబడి భర్తీ చేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నా పట్టించుకోలేదు. క్రీడలు ఇతర అన్ని కేటగిరీల రిజర్వేషన్లు 50 శాతం మించకుండా భర్తీ ఉండాలని, వంద పాయింట్ల రోస్టర్ విధానాన్ని అమలు చేయాలని, ఏపీ సబార్డినేట్ రూల్స్ యాక్ట్–1996లోని 22వ నిబంధనలను అమలు చేయాలన్న చట్ట నిబంధనలను ఉల్లంఘించి పోస్టులు భర్తీ చేశారని తప్పుబట్టింది. చట్టానికి వ్యతిరేకంగా పోస్టుల భర్తీ చేశారని దాఖలైన కోర్టు ధిక్కార వ్యాజ్యం విచారణకు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ రఘునందన్‌రావు హాజరయ్యారు. తాను నాలుగు నెలల క్రితమే పంచాయతీరాజ్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించానని, పూర్తి వివరాలు సమర్పించేందుకు 8 వారాల సమయం కావాలని రఘునందన్‌రావు కోరారు. అందుకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎమ్మెస్ రామచంద్రరావు అంగీకరించలేదు. ఇంతకు ముందు కమిషనర్‌గా నీతూకుమారి ప్రసాద్ ఉన్నారని, ఆమె 4 నెలల క్రితం వేరే శాఖకు బదిలీ అయ్యారని రఘునందన్‌రావు చెప్పారు. దీంతో అప్పటి కమిషనర్ నీతూ కుమార్ ప్రసాద్‌కు హైకోర్టు సుమోటోగా కోర్టు ధిక్కార నోటీసు జారీ చేసింది. ఇదే విషయాన్ని ఆమెకు తెలియజేయాలని రఘునందన్‌రావును హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ వచ్చే శుక్రవారానికి వాయిదా వేసింది.



### ఐఏఎస్‌లకు ఆ మాత్రం తెలియదా?

'దొడ్డి దారిన భర్తీ చేసిన పోస్టులపై ప్రభుత్వం ఏం చేస్తుందో చెప్పాలి. రిజర్వేషన్ల నిబంధన అమలు చేయకుండా పోస్టులను భర్తీ చేస్తే హైకోర్టు చూస్తూ కూర్చోదు. చట్ట వ్యతిరేకంగా భర్తీ చేసిన పోస్టుల్లో చేరిన వారిని ఏం చేస్తారో చెప్పండి. అప్పటి కమిషనర్‌గా ఉన్న నీతూకుమార్ ప్రసాద్‌కు ఈ విషయాల్ని తెలియజేయండి. ఆ నియామకాల ఫైళ్లను పర్యవేక్షించి చిట్టచివరిగా ఆమోద ముద్ర వేసినందుకు ఏం జవాబు చెబుతారు. నియామకాలు చేసేటప్పుడు చట్ట ప్రకారం న్యాయపర అభిప్రాయాన్ని కూడా పొందిన తర్వాతే చేయాలన్నది పాలనలో అత్యంత కీలక విషయం అని ఐఏఎస్ అధికారులకు తెలియదా. చట్టాలను సరిగ్గా అమలు చేస్తే కోర్టు ధిక్కార కేసుల నమోదు అనూహ్యంగా ఉండదు. ప్రతి శుక్రవారం 700 కోర్టు ధిక్కార కేసులు విచారణకు వస్తున్నాయి. ఇది ఆందోళన రేకెత్తించే తీవ్ర విషయం. ఈ కేసులో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయకపోవడం చట్టవ్యతిరేకం. చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఎవ్వరూ ఉద్యోగాలు పొందడానికి వీల్లేదు. చేసిన తప్పుల్ని ఎలా సరిదిద్దుతారో చెప్పండి. భర్తీ చేసే ముందు అడ్వొకేట్ జనరల్ అభిప్రాయం తీసుకుని ఉంటే న్యాయపరమైన అవరోధాలు ఉండేవే కావు. తప్పులను సరిదిద్దే చర్యలు ఏం తీసుకున్నారో వచ్చే శుక్రవారం జరిగే విచారణ సమయంలో చెప్పండి'అని న్యాయమూర్తి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# వరంగల్ ఆర్జేడీపై విచారణ కమిటీ

**నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోనున్న విద్యాశాఖ**

**సాక్షి, హైదరాబాద్:** సెక్టోరల్ అధికారి మనోహర్ నాయక్‌తో దురుసుగా ప్రవర్తించిన అంశంపై వరంగల్ ప్రాంతీయ సంచాలకుడు (ఆర్జేడీ) రాజీవ్‌పై విచారణ కమిటీని నియమించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. దీనిపై సమగ్ర సమాచారాన్ని సేకరించేందుకు పాఠశాల విద్య అదనపు సంచాలకుడు శ్రీహరిని విచారణాధికారిగా నియమించే అవకాశముంది. ఈ నివేదిక ఆధారంగా రాజీవ్‌పై చర్యలు తీసుకునే అవకాశముంది. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు అయిన మనోహర్ నాయక్ గత మూడేళ్లుగా జయశంకర్ భూపాలపల్లి సెక్టోరల్ అధికారిగా సమగ్ర శిక్షా అభియాన్ విధులు నిర్వర్తిస్తున్నారు. కొత్తగా ఏర్పడ్డ ములుగు జిల్లాకు కూడా అతనే సెక్టోరల్ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 5న రాజీవ్ ములుగు డీఈవో ఆఫీసుకు వచ్చి గతంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరు కాలేదని తనపై దురుసుగా మాట్లాడారని అలాగే తాను తయారు చేస్తున్న నివేదికకు సంబంధించిన పత్రాలను చింపివేశారని మనోహర్ నాయక్ పాఠశాల విద్యా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గత నెల 20న కూడా తనతో ఫోన్లో అవమానకరంగా మాట్లాడారని తెలిపారు. అలాగే రాజీవ్ తనకింద పని చేసే ఉద్యోగులను అకారణంగా సస్పెండ్ చేస్తూ వారిని వేధిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఆయన ఉద్యోగులతో దురుసుగా ప్రవర్తిస్తాడని అలాగే అవమానకరంగా మాట్లాడతారని తాము గతంలోనే ఫిర్యాదు చేశామని కానీ, ఇప్పటి వరకు ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ), ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి పాఠశాల విద్యా కమిషనర్ విజయ్ కుమార్‌కు శనివారం ఫిర్యాదు చేశాయి. వెంటనే ఆయన్ను సస్పెండ్ చేసి కఠినంగా శిక్షించాలని సమితి నాయకులు చావ రవి, మైసా శ్రీనివాస్, టి.లింగారెడ్డి, జి.సదానందంగౌడ్, రఘునందన్‌లు డిమాండ్ చేశారు. కాగా, విద్యాశాఖ రాజీవ్‌కు మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ (జేడీ)గా స్థాన చలనం కల్పిస్తూ, ఆయన స్థానంలో కె.లింగయ్యను నియమించింది.

# ప్రతి గ్రామంలో శ్మశాన వాటిక

- 'పల్లె ప్రగతి'ఉత్తమ పంచాయతీలకు ఉపాధి పనుల మంజూరీలో ప్రాధాన్యం
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద అన్ని గ్రామాల్లో శ్మశానాలు, డంపింగ్ యార్డులను నిర్మిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు 'పల్లె ప్రగతి'అమలులో ఉత్తమ గ్రామాలకు ఉపాధి హామీ పనుల మంజూరీలో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. నూతన గ్రామ పంచాయతీలకు దశలవారీగా జీపీ భవనాలను నిర్మిస్తామని చెప్పారు. ఉపాధి హామీ పథకం అమలుపై గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో శనివారం మంత్రి తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. 2019–20 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో 12 కోట్ల పని దినాలకు ఆమోదం తెలిపిందని, వేతనాల అంచనా ఖర్చు రూ.1,800 కోట్లు ఉందన్నారు. ఇప్పటివరకు 9.77 కోట్ల పని దినాలు పూర్తి కాగా.. 38.80 లక్షల మందికి ఉపాధి కల్పించినట్లు చెప్పారు. ఈ ఏడాది మెటీరియల్ కాంపొండ్ కింద రూ.1,200 కోట్లకు ఆమోదం ఉందని, ఇప్పటివరకు జరిగిన పనులతోపాటు, హరితహారం చెల్లింపులు పోగా మిగిలిన నిధులకు ప్రతిపాదనలు రూపొందించాలని పేర్కొన్నారు. శ్మశానవాటికలు, డంపింగ్ యార్డులు, సీసీ రోడ్ల నిర్మాణం తదితర పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈజీఎస్ పనుల ప్రతిపాదనలు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఇప్పటికే మంజూరైన పనుల పురోగతిని పరిశీలించి నివేదిక రూపొందించాలని పేర్కొన్నారు. ఇంకా మొదలుపెట్టని పనుల విషయంలో తగిన నిర్ణయం తీసుకోవాలని, అవసరమైన చోట కొత్త పనులు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ) కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామపంచాయతీలకు భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. పల్లె ప్రగతిలో పనితీరు బాగా ఉన్న గ్రామపంచాయతీలకే ఆర్‌జీఎస్‌ఏ భవనాల మంజూరులో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.



# 11న రాష్ట్ర కేబినెట్ భేటీ

**నీటి పారుదల ప్రాజెక్టులు, రెవెన్యూ చట్టం తదితరాలే ఎజెండా**

**సాక్షి, హైదరాబాద్:** కొత్త రెవెన్యూ చట్టం, నీటి పారుదల ప్రాజెక్టులు, ఉద్యోగుల పీఆర్‌సీ వంటి కీలక అంశాలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన ఈ నెల 11న సాయంత్రం 5 గంటలకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ప్రగతిభవన్‌లో జరిగే ఈ భేటీలో సాగునీటి ప్రాజెక్టులే ప్రధాన ఎజెండాగా ఉంటుందని సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ప్రస్తుతం రోజుకు రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోసే సామర్థ్యంతో పనులు పూర్తిచేయగా, మూడో టీఎంసీ నీటిని కూడా తరలించేలా ప్రణాళిక రూపొందించాలని రెండ్రోజుల క్రితం జరిగిన నీటిపారుదల శాఖ సమీక్షా సమావేశంలో కేసీఆర్ నిర్ణయించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి మూడో టీఎంసీ నీటిని తరలించడం ద్వారా సాగర్ ఆయకట్టును స్థిరీకరించేలా ఇరిగేషన్ శాఖ డిజైన్లు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు గోదావరి నదిపై దుమ్ముగూడెం వద్ద బ్యారేజీ, జల విద్యుత్ కేంద్రం నిర్మించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ రెండు ప్రతిపాదనలకు మరో రూ.14 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ నెల 11న జరిగే కేబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనపై చర్చించి ఆమోదముద్ర వేయనుంది. ఆర్టీసీ సమస్య పరిష్కారం కావడంతో, రెవెన్యూ శాఖ సంస్కరణలపై దృష్టి పెట్టాలని భావిస్తున్న కేసీఆర్.. నూతన రెవెన్యూ చట్టం తీరుతెన్నులపై చర్చించే అవకాశం ఉంది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితి పెంపు, వేతన సవరణ (పీఆర్‌సీ)కి సంబంధించిన అంశాలపైనా కేబినెట్‌లో చర్చించే అవకాశం ఉంది. దిశ హత్యాచార ఘటన తదనంతర పరిణామాలతో పాటు తాజా రాజకీయ అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉందని సమాచారం.

# ఆర్టీసీలో 359 మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ

- సీఎం ఆదేశంతో ఉత్తర్వులు జారీ చేసిన ఎండీ
- సంస్థలో మొత్తం ఒప్పంద కార్మికుల రెగ్యులరైజ్

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న 359 మంది సిబ్బందిని క్రమబద్ధీకరిస్తూ ఆర్టీసీ ఎండీ సునీల్ శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆర్టీసీలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న సిబ్బంది మొత్తం రెగ్యులరైజ్ అయినట్టయింది. ఇటీవల ఆర్టీసీ కార్మికులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో సీఎం కేసీఆర్ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాల్సిందిగా ఎండీని ఆదేశించడంతో శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో 296 మంది డ్రైవర్లు కాగా, మిగతా వారు కండక్టర్లుగా పనిచేస్తున్నవారున్నారు. నిజానికి వీరు 2015లోనే రెగ్యులరైజ్ కావాల్సి ఉంది. ఆ సమయంలో వేతన సవరణ కోసం ఆర్టీసీ కార్మికులు సమ్మె చేసిన సమయంలో, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ డిమాండ్‌ను కూడా ప్రభుత్వం ముందుంచారు. దానికి సమ్మతిస్తూ అప్పట్లో కార్మిక సంఘాలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఆ మేరకు 4,400 మందిని క్రమబద్ధీకరించారు. కానీ శాఖాపరమైన చర్యలకు గురైనవారు, ఇతర లోటుపాట్లు ఉన్నవారు మిగిలిపోయారు. అప్పటి నుంచి తమను కూడా రెగ్యులరైజ్ చేయాలని వారు కోరుతూ వస్తున్నారు. ఇటీవల సమ్మె నేపథ్యంలో సీఎం ప్రకటించిన వరాల్లో భాగంగా వీరికి కూడా అవకాశం లభించింది. 240 పనిదినాల అనుభవం ఉండటాన్ని అర్హతగా నిర్ధారించారు. వీరిలో చాలామంది ఐదారేళ్లుగా పనిచేస్తున్న వారుండటంతో దాదాపు అంతా దానికి అర్హత సాధించే అవకాశం ఉంది. ఎవరికైనా అన్ని పని దినాల అనుభవం లేకుంటే, వారు పనిదినాలు పూర్తి చేసుకోగానే రెగ్యులరైజ్ చేయనున్నట్టు ఉత్తర్వుల్లో ఎండీ పేర్కొన్నారు.

## మహిళా విద్యా సంస్థల్లో చైతన్య సదస్సులు

**నిర్వహించిన పోలీసు శాఖ**

**సాక్షి, హైదరాబాద్:** దిశ ఘటన నేపథ్యంలో రాష్ట్రంలోని మహిళలు, కళాశాలల విద్యార్థినుల్లో అభద్రతా భావాన్ని తొలగించి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర పోలీసు విభాగం, ప్రాసిక్యూషన్స్ డైరెక్టరేట్‌లు రాష్ట్ర వ్యాప్తంగా శనివారం అవగాహనా సదస్సులు నిర్వహించాయి. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఉన్న మహిళా కళాశాలలు, విద్యాసంస్థల్లో నిర్వహించిన ఈ సదస్సులకు ఆయా జిల్లాల పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు హాజరై మహిళలు, పిల్లల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా పోలీస్ శాఖ చేపట్టిన చర్యల గురించి చైతన్యపరిచారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు ఫోన్ చేయాలని, హాక్ ఐ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని వివరించారు. బాలలు, మహిళలకు చట్టపరమైన హక్కులపై ఈ సదస్సుల్లో సవివరంగా తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు అడిగిన పలు సందేహాలకు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమాధానం ఇచ్చారు. ఇలాగే మరిన్ని సదస్సులను నిర్వహిస్తామని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి.వైజయంతి తెలిపారు.

airtel

మా వినియోగదారుల నుంచి మా సర్వీస్ గురించి ఏవైనా సందేహాలు మరియు ఫిర్యాదులు ఉన్నట్లయితే వాటి గురించి మేము తెలుసుకోవాలనుకుంటున్నాము. సాధారణ సందేహాలు, ప్రశ్నల కొరకు 121కి మరియు ఏవైనా సర్వీస్ విజ్ఞప్తులు లేదా ఫిర్యాదులు ఉంటే వాటి కొరకు మా వినియోగదారులు 198కి కాల్ చేయాల్సిందిగా కోరుతున్నాము.

ఫిర్యాదుల క్షేత్రంలో అందచేసిన రిజల్యూషన్‌తో ఏ వినియోగదారులైనా సంతృప్తికరంగా లేకపోతే, వారు ఎపెల్లేట్ అథారిటీ వద్ద తమ అపీల్‌ని నమోదు చేసుకోవచ్చును. దానిపై ఈ దిగువ ఇచ్చిన టేబుల్‌లోని విధానాలను ఉపయోగించుకుని లేదా కేవలం 198కి కాల్ చేసి ఫిర్యాదుల వివరాల (సర్వీస్ రిక్వెస్ట్ నంబర్) సహితంగా నమోదు చేసుకోవాలి.

| | | మొబైల్ కస్టమర్ల కోసం | ఫిక్స్‌డ్ లైన్ మరియు బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్ల కోసం |
|---|---|---|---|
| కస్టమర్ కేర్ (24X7) | సాధారణ సమాచారం సంఖ్య | 121 లేదా 9849012345 (పోస్ట్‌పెయిడ్) 121 లేదా 9849098490 (ప్రీపెయిడ్) | 121 లేదా 040-44444121 |
| | కస్టమర్ కేర్ సంఖ్య | 198 లేదా 9849012345 (పోస్ట్‌పెయిడ్) 198 లేదా 9849098490 (ప్రీపెయిడ్) | 198 లేదా 040-44444198 |
| | ఇ-మెయిల్ | 121@in.airtel.com | |
| | వెబ్‌సైట్ | www.airtel.in | |
| అపెల్లేట్ అథారిటీ (ఉదయం 9:30 నుంచి సాయంత్రం 6:30 వరకు సోమవారం నుంచి శుక్రవారం వరకు) | పేరు | మంజాల మీనన్ | |
| | కాంటాక్ట్ నంబర్ | 9959444865 | 040-40000222 |
| | ఇ-మెయిల్ | appellate.andhra@in.airtel.com | appellate.southabts@in.airtel.com |
| | చిరునామా | భారతి ఎయిర్‌టెల్ లి., స్కైండిక్ టవర్స్, ఆపోసిట్ బేగంపేట్ పోలీస్ స్టేషన్, బేగంపేట్, హైదరాబాద్-500016. | |

ఫిర్యాదు నమోదు చేయడానికి, సందర్శించండి www.airtel.in/forme/home/needhelp
మీ ఫిర్యాదు ఏ స్థితిలో ఉందో చెక్ చేసుకోవడానికి, సందర్శించండి https://www.airtel.in/s/selfcare/track-request